అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

బుధవారం 18-12-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 299 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



జమిలీ బిల్లు రాజ్యాంగ విరుద్ధం

బిల్లును ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకించిన ప్రతిపక్షం

మద్దతిచ్చిన టీడీపీ, జనసేన

తీవ్ర వ్యతిరేకతతో బిల్లును జేపీసీకి పంపిన కేంద్రం

బిల్లుకు మద్దతుగా మాట్లాడని జేడీయూ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో


ఫెడరలిజంతో సహా రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని దెబ్బతీసే 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' లక్ష్యంగా రూపొందించిన వివాదాస్పద రాజ్యాంగ సవరణ బిల్లును ప్రతిపక్ష పార్టీలు ముక్తకంఠంతో వ్యతిరేకించాయి.. ఈ బిల్లు రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉందని, ప్రజాస్వామ్య స్వరూపం, సమాఖ్య వాదంపై దాడి చేస్తుందని పేర్కొన్నాయి. అందుకు ఈ బిల్లును ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నాయి. రాష్ట్ర అసెంబ్లీ పదవీకాలం, ఎలా కేంద్ర పదవీకాలంలోకి మార్చుతారని ప్రశ్నించాయి. అలా మార్చడం సాధ్యం కాదని తెలిపాయి. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించేందుకు ఉద్దేశించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లును, లోక్‌సభ ఎన్నికలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలకు కూడా ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లును కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రవేశపెట్టడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. అలాగే ... 11లో

బీజేపీ ఎంపీలు డుమ్మా..

లోక్‌సభలో జమిలీ బిల్లు పెడుతున్న దృష్ట్యా ఎంపీలంతా హాజరుకావాలని బీజేపీ పార్లమెంటరీ పార్టీ విప్ జారీచేసింది. అయినా పదిమంది ఎంపీలు గైర్హాజరయ్యారు.ఆ ఎంపీల తీరుపై కమలం పార్టీలో కలవరం మొదలైంది. వెంటనే తేరుకుని ఆ పది మంది ఎంపీలకు సంజాయిషీ నోటీసులు జారీ చేసింది.

రాష్ట్రాల హక్కులను ఎలా లాక్కొంటారు? : సీపీఐ(ఎం) ఎంపీ అమ్రారామ్

సీపీఐ(ఎం) ఎంపీ అమ్రారామ్ మాట్లాడుతూ ఈ బిల్లును తమ పార్టీ వ్యతిరేకిస్తున్నదని స్పష్టం చేశారు. ఈ బిల్లుతో దేశ గణతంత్ర రాజ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. గ్రామ పంచాయతీ, మండలపరిషత్, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ రాష్ట్ర ... 11లో







ఏడాదిలో రూ.1.27 లక్షల కోట్ల అప్పేంటి?

- ఇలాగైతే ఐదేండ్లలో 6.37 లక్షల కోట్లకు అప్పు : హరీశ్‌రావు

మీరు చేసిన అప్పులు, వడ్డీలకే రూ.66 వేల కోట్లు కట్టాం

- ప్రతిపైసాకూ జవాబుదారీతనంగా ఉంటాం..మీ మాదిరిగా లెక్కలు దాచం
- ఇది లఘు చర్చ కాదు...ప్రశ్నోత్తరాల సమయం
- కావాలంటే ప్రత్యేకంగా దీనిపైనే చర్చించేందుకు మేం రెడీ : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మీరంటే..మీరే

అప్పులకుప్పపై సభలో అధికార ప్రతిపక్షాల వాగ్యుద్ధం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

శాసనసభలో మంగళవారం ప్రశ్నో త్తరాల సమయంలో ఎఫ్‌ఆర్‌బీఎమ్ రుణాలపై వాడీవేడిగా చర్చ నడిచింది. అప్పులకు కారణం మీరంటే..మీరే కారణమంటూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, బీఆర్‌ఎస్ సభ్యులు హరీశ్‌రావుల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లకు దారి తీసింది. 'ఏడాదిలో రూ.1.27 లక్షల కోట్ల అప్పేంటి? ఇలాగైతే ఐదేండ్లలో రాష్ట్ర అప్పు 6.37 లక్షల కోట్లకు చేరుకుంటుంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేండ్లలో చేసిన అప్పు కేవలం రూ.4.17 లక్షల కోట్లే' అని హరీశ్‌రావు వివరించగా.. డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. అందులో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు, వడ్డీలకే రూ.66 వేల కోట్లు చెల్లించాం. గత ప్రభుత్వం 40 వేల కోట్ల రూపాయల పెండింగ్ బిల్లులను మాపై రుద్దిపోయింది. వాటిని క్లియర్ చేసుకుంటూ వస్తున్నాం. గత ప్రభుత్వం మాదిరిగా అప్పుల లెక్కలు దాచం. ప్రజల ప్రతిపైసాకూ జవాబుదారీగా ఉంటాం. ఇది లఘు చర్చ కాదు. ప్రశ్నోత్తరాల సమయం. ఇప్పటికే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేశాం. ప్రతిపక్ష సభ్యులు అడుగుతున్నారు కాబట్టి దీనిపై మరోమారు సుదీర్ఘంగా చర్చించేందుకు మేం సిద్ధం' అని కౌంటర్ ఇచ్చారు. ఇలా ఇద్దరి మధ్యా అరగంటకుపైగా చర్చ నడిచింది.



నల్ల చొక్కాలు.. చేతులకు బేడీలు..

'లగచర్ల'పై బీఆర్‌ఎస్ వినూత్న నిరసన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

లగచర్ల రైతులకు బేడీలు వేసిన ఘటనపై ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ వినూత్నంగా నిరసన వ్యక్తం చేసింది. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మంగళవారం నల్లచొక్కాలు ధరించి ఉదయం 9 గంటలకే శాసనసభ ప్రాంగణానికి చేరుకున్న ఆ పార్టీ ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తొలుత .. 11లో

అప్పులు రాష్ట్రానికి క్షేమకరం కాదు : హరీశ్‌రావు

రాష్ట్రంలో ఎఫ్‌ఆర్‌బీఎం, దాని కిందకు రాని రుణాలపై టి.హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి భట్టి విక్రమార్క సమాధానమిచ్చారు. 2024 నవంబర్ నాటికి ప్రభుత్వ ... 11లో

ప్రతిదాన్నీ రాజకీయం చేయొద్దు

హరీశ్‌రావుకు స్పీకర్ చురకలు

శాసనసభ మంగళవారం ప్రారంభం కాగానే..స్పీకర్ ప్రసాద్ కుమార్ సభలోకి వచ్చే సమయంలో రైతులకు బేడీలా సిగ్గుసిగ్గు... ఇదేమి రాజ్యం..ఇదేమి రాజ్యం దొంగల రాజ్యం..లూటీల రాజ్యం' అంటూ బీఆర్‌ఎస్ సభ్యులు నినాదాలు చేశారు. 'ఇది సభా సాంప్రదాయం కాదు. కూర్చొని సభ్యులు సహకరించాలి' అని స్పీకర్ ఆదేశిం చారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఎఫ్ఆర్ బీఎం రుణాలపై హరీశ్‌రావు, పలువురు సభ్యులు అడిగిన ప్రశ్న టేబుల్‌పైకి వచ్చిన సమయంలో మంత్రి భట్టి సభలో లేరు. సమాధానం చెప్పాల్సిన మంత్రి సభకు రాకపోవడమేంటి? 21 ఏండ్లలో ప్రశ్న చర్చకు వచ్చిన సమయంలో మంత్రి లేకపో వడం ఇదే తొలిసారి. సభ హుందాతనాన్ని వదిలేస్తున్నారు' అంటూ కామెంట్ చేశారు. అదే సమయంలో 'సమాధానం చెప్పాల్సిన మంత్రి ఇంకా రాకపోవడమా.. షేమ్.. షేమ్..' అంటూ బీఆర్‌ఎస్ సభ్యులు నినా దాలు చేశారు. వెంటనే స్పీకర్ ప్రసాద్‌కుమార్ జోక్యం చేసుకుని.. 'హరీశ్‌రావు ప్రతి విషయాన్ని ఇలా రాజకీయం చేయొద్దు' అని చురకలు అంటించారు. మంత్రి వస్తున్నారు..అని మరో మంత్రి పొన్నం ప్రభాకర్ చెబుతున్న సమయంలోనే భట్టి విక్రమార్క సభలో అడుగుపెట్టారు.

బీజేపీది అప్రజాస్వామ్య పాలన

మోడీ తన బాధ్యతలు నిర్వర్తించడం లేదు

కాషాయ పార్టీలోకి 830 మంది ప్రజా ప్రతినిధుల ఫిరాయింపు

దీంతో వారు పవిత్రులయ్యారు : రాజ్యసభలో సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ ఎద్దేవా

వివరాలు 11లో

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశానికి 11 ఆజ్ఞలను ప్రతిపాదించిన ప్రధాని నరేంద్ర మోడీ తన బాధ్యతలను మాత్రం నిర్వర్తించడం లేదని సీపీఐ(ఎం) రాజ్యసభ ఎంపీ జాన్‌బ్రిట్టాస్ విమర్శిం చారు. మంగళవారం రాజ్యసభలో రాజ్యాంగంపై కొనసాగిన ప్రత్యేక చర్చలో ఆయన మాట్లాడారు. అల్లర్లతో అట్టుడుకుతున్న మణిపూర్‌ని ఏడాదిన్నర ... 11లో



ఎప్‌సెట్ కన్వీనర్‌గా బి డీన్‌కుమార్

- ఐసెట్ కన్వీనర్‌గా అలువాల రవి
- త్వరలో ప్రవేశ పరీక్షల తేదీల ప్రకటన : ఉన్నత విద్యామండలి వెల్లడి

వివరాలు 3లో



కేటీఆర్‌పై విచారణకు రంగం సిద్ధం

గవర్నర్ అనుమతి లేఖను పంపిన సీఎస్ శాంతికుమారి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఫార్ములా వన్ (ఈ కార్) రేసుకు సంబంధించి మాజీ మంత్రి, బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను విచారించేందుకు రంగం సిద్ధమైంది. ఇందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతి చ్చారు. ఈ క్రమంలో సోమ వారం నాటి రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించిన ... 3లో





హైదరాబాద్‌కు రాష్ట్రపతి

ఘన స్వాగతం పలికిన గవర్నర్, సీఎం

శీతాకాల విడిదిలో భాగంగా రాష్ట్ర పర్యటన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శీతాకాల విడిది నిమిత్తం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం హైదరాబాద్ విచ్చేశారు. సాయంత్రం 5.15 గంటలకు ప్రత్యేక విమానంలో హకీంపేట విమానాశ్రయం చేరుకున్న ఆమెకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దనసరి అనసూయ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, త్రివిధ దళాల అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ద్రౌపదిముర్ము హకీంపేట నుంచి బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి చేరుకున్నారు. శీతాకాల విడిదిలో భాగంగా ఈ నెల 21 వరకు ఐదు రోజుల పాటు రాష్ట్రంలో బస చేయనున్నారు. బుధవారం ఆమె పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి బృందం, అధికారులు, పౌరులతో రాష్ట్రపతి నిలయంలో ఎట్‌హోం కార్యక్రమం నిర్వహిస్తారు.

నిర్బంధాలు.. అరెస్టులు

జీపీ సిబ్బంది చలో హైదరాబాద్ విజయవంతం

ఇందిరాపార్క్ వద్ద భారీ ధర్నా.. ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి :

తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ కన్వీనర్ పాలడుగు భాస్కర్



- అరెస్టులను నిరసిస్తూ నేడు, రేపు మండల కేంద్రాల్లో నిరసనలు
- వేతనాల పెంపు, పర్మినెంట్ కోసం 27,28 తేదీల్లో సమ్మెకు జేఏసీ పిలుపు

నవతెలంగాణ - ముషీరాబాద్

గ్రామపంచాయతీ ఉద్యోగులకు, కార్మికులకు వేతనాలు పెంచాలని, పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని, పంచాయతీ కార్మికులందరినీ వెంటనే పర్మినెంట్ చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కారోబార్ బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలని తదితర డిమాండ్లతో మంగళవారం గ్రామ ... 2లో



(ఫైల్)


సాయుధ పోరాట కొదమసింహం

దర్గ్యానాయక్

విస్నూర్ దేశ్‌ముఖ్ పాలిట ఫిరంగి గుండు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

దర్గ్యానాయక్ అంత్యక్రియలు పూర్తి, పలువురి నివాళి

వివరాలు 11లో..



'జులై 19' కటాఫ్ డేట్

ఆ తర్వాత చేపట్టిన అక్రమ నిర్మాణాలు కూల్చేస్తాం : హైడ్రా కమిషనర్ ఐజీ రంగనాథ్ హెచ్చరిక

వివరాలు 11లో..

పెద్దల భూదందా

384 ఎకరాలకు ఎసరు పెట్టిన నేతలు

"కాదేదీ కబ్జాకు అనర్హం అన్నట్టుగా పటాన్‌చెరు నియోజకవర్గంలో ప్రతిదీ కబ్జా మయమవుతోంది. ఓఆర్ఆర్ పక్కనే వేల కోట్ల విలువ చేసే సర్కార్ భూముల్ని కాజేసేందుకు కీలకమైన ప్రజా ప్రతినిధులే ఎసరు పెట్టారు. పడావుగా ఉన్న ప్రభుత్వ భూముల్లో ప్లాట్లు చేసి క్రయవిక్రయాలు సాగిస్తున్నారు. ఒకటా రెండా 384 ఎకరాల భూముల్ని కబ్జాబెట్టారు. రూ.5 వేల కోట్ల విలువ చేసే సర్కార్ భూముల్ని అప్పనంగా మింగేయచూస్తున్నారు. ఇనాం పేరిట కొందరు కాజేయగా.. ఓఆర్‌సీల పేర ఇంకొందరు కబ్జా పెట్టారు. మరి కొందరేమో కొనుగోళ్ల పేరిట కోర్టుకెళ్లారు. ఇద్దరు కీలకనేతల కనుసన్నల్లో అప్పనంగా అమాంతం వేల కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూముల్నే మాయం చేసే ప్రయత్నాలు సాగుతుండటం గమనార్హం.

మార్కెట్ విలువ రూ.5 వేల కోట్ల పైనే

అనర్హులకు ఓఆర్‌సీ..

గతంలో అసెంబ్లీ హౌజ్ కమిటీ

తప్పుడు ఓఆర్‌సీలపై విచారణ.. రద్దు చేసిన

సీసీఎల్ఏ పడావు భూముల చదును

ప్లాట్లుగా మార్చి క్రయవిక్రయాలు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజక వర్గం అంటేనే భూ కబ్జాలు.. భూ దందాలనే పేరుంది. అందులో అమీన్‌పూర్ మండలమంటే కబ్జాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. హైడ్రా వచ్చాక అమీన్‌పూర్ రాష్ట్రంలోనే చర్చనీయాంశమైంది. అమీన్‌పూర్ రెవెన్యూ మండల పరిధిలో సుల్తాన్‌పూర్, బొమ్మన్‌కుంట రెవెన్యూ గ్రామాల పరిధిలో ఉన్న మెడికల్ డివైజెస్ పార్కు పక్కనే 30 సర్వే నెంబర్‌లో 722.20 ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. ఈ భూములపై అనేక వివాదాలున్నాయి. అట్టి భూములు నిజాం నవాబ్ కాలంలో ఎండీ ఫరీదొద్దీన్ పేరుతో ఇనామ్ భూమిగా ఉండేదని చెబుతారు. అయితే సదరు వ్యక్తి ఎప్పుడూ అట్టి భూముల్ని సాగు చేయలేదు. కబ్జాలోనూ లేరు. నిజాం కాలంలో ఎండీ ఫరీదొద్దీన్ ఇనామ్‌దారుగా ఉన్నట్టు చెప్పబడుతున్నా 1954-55 నాటి రెవెన్యూ రికార్డుల్లో మాత్రం ఇనామ్‌దార్ల పేరుతో ఎలాంటి రికార్డులూ లేవు. కొందరు సాగు చేసుకుంటున్న గ్రామస్తుల వివరాలు మాత్రమే ఉన్నాయి. స్థానిక పేదలు భూముల్ని సాగు చేసుకుంటున్నారన్న పేరుతో అప్పట్లో రెవెన్యూ అధికారులు తమ మెజిస్ట్రీరియల్ అధికారంతో అక్రమ ఓఆర్‌సీలు ఇచ్చారు. 1986లో 432.25 ఎకరాలకు, 1987లో 83.37 ఎకరాలకు ఆక్యూపేషన్ రైట్ సర్టిఫికెట్స్ (ఓఆర్‌సీ) ఇచ్చారు. తప్పుడు ... 12లో

హైకోర్టులో కేసులు పెండింగ్

2001లో ఎస్.వినోద్‌కుమార్‌తో పాటు మరో తొమ్మిది మంది హైకోర్టులో కేసు వేశారు. 432.25 ఎకరాలకు తమకు పట్టా ఇవ్వాలని, తాము ఆ భూమిని కొనుగోలు చేశామని చెబుతూ కేసు వేశారు. డబ్ల్యూపీ 23718/01 నంబర్‌తో హైకోర్టులో కేసు పెండింగ్‌లోనే ఉంది. రాజన్న లోహడే, ఛాయ లోహడే భార్య 96.20 ఎకరాలు తమకు ఇవ్వాలని కోరుతూ డబ్ల్యూపీ నంబర్ 23843/01తో కేసు వేశారు. ఈ రెండు కేసులూ పెండింగ్‌లో ఉన్నాయి.

సమాచారం తెలిసిన వెంటనే తొలగించాం : రాధా, తహసీల్దార్, అమీన్‌పూర్

సర్వే నెంబర్ 30లోని ప్రభుత్వ భూముల్లో మహ్మద్ సోయల్ అనే వ్యక్తి ఇన్ లీగల్‌గా లేఅవుట్ చేసినట్టు తెలిసింది. ఆ స్థలంలో ఒక మసీదు కూడా నిర్మించారు. అది ఇటీవల నిర్మించారా..? లేక పాత నిర్మాణమా.. అనేది విచారిస్తున్నాం. ప్రభుత్వ భూమిని చదును చేసి ప్లాట్లుగా మారుస్తున్న విషయం తెలియగానే పోలీస్, రెవెన్యూ సిబ్బందితో వెళ్లి ఆక్రమణలను తొలగించాం. ఎక్కడా ఆక్రమణలు జరగకుండా కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నాం.

నిర్బంధాలు.. అరెస్టులు

(మొదటిపేజీ తరువాయి)

పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ తలపెట్టిన చలో హైదరాబాద్ విజయవంతమైంది. పలు జిల్లాల్లో నిర్బంధాలు, అరెస్టులను ప్రయోగించినా వాటిని ఛేదించుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీ సిబ్బంది ఇందిరాపార్క్‌కు తరలివచ్చారు. అనుమతి లేదంటూ అక్కడికి చేరుకున్న కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. ఇచ్చిన పర్మిషన్‌నే ఎలా రద్దు చేస్తారని జేఏసీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరికి కొన్ని గంటలపాటు కార్యక్రమాన్ని నిర్వహించుకునేందుకు అనుమతించారు. అనంతరం సీఐటీయూ, ఏఐటీయూసీ, టీయూసీఐ, ఐఎఫ్‌టీయూ, తెలంగాణ గ్రామ పంచాయతీ కారోబార్, బిల్ కలెక్టర్ల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద భారీ ధర్నా జరిగింది. ధర్నాకు గ్రామ పంచాయతీ యూనియన్ ఏఐటీయూసీ నుంచి రాష్ట్ర అధ్యక్షులు టి.నర్సింహారెడ్డి, గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ నుంచి రాష్ట్ర అధ్యక్షులు గ్యార పాండు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ కన్వీనర్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ సిబ్బంది వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని, అందుకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 12,790 గ్రామ పంచాయతీల్లో సుమారు 60,000 మంది ఉద్యోగులు, కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. 2018లో అప్పటి ప్రభుత్వం జీవో 51ని విడుదల చేసి సిబ్బంది వేతనాలను రూ.8,500కు పెంచిందని గుర్తు చేశారు. వేతనాలు పెంచుతూనే పంచాయతీ కార్మికుల మెడకు ఉరితాళ్లను బిగిస్తూ మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని ప్రవేశపెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ సిబ్బందికి బకాయి వేతనాలు చెల్లించాలని, గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2వ పీఆర్సీ పరిధిలోకి గ్రామ పంచాయతీ సిబ్బందిని తీసుకురావాలని, జీవో 60 ప్రకారం వేతనాలను కేటగిరీల వారీగా చెల్లించాలని డిమాండ్ చేశారు. దాంతోపాటు జీవో 51ని సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని అన్నారు.

జేఏసీ రాష్ట్ర కన్వీనర్ కె.సూర్యం మాట్లాడుతూ.. పాత కేటగిరీలన్నింటినీ కొనసాగించాలని కోరారు. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలన్నారు. అర్హులైన సిబ్బందికి ప్రమోషన్లను కల్పించాలన్నారు. రాష్ట్ర కన్వీనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ.. కార్మికులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, ఇండ్ల స్థలాలు కేటాయించాలని, చనిపోయిన, అనారోగ్యానికి గురైన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో జేఏసీ రాష్ట్ర నేతలు మొటె నరసింహ, వెంకటరాజ్యం, అరుణ్ కుమార్, ఎం.వెంకటేష్, బింగి గణేష్, శివ బాబు, అరుణ, యాదయ్య, పాలడుగు సుధాకర్, వెంకన్న, చిలుకామారుతి, నాయకులు, కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

భవిష్యత్ కార్యాచరణను ప్రకటించిన జేఏసీ

ధర్నా అనంతరం జేఏసీ రాష్ట్ర కార్యవర్గం సమావేశమై భవిష్యత్ కార్యాచరణను ప్రకటించింది. పోలీసుల అరెస్టులు, నిర్బంధాన్ని నిరసిస్తూ ఈ నెల 18, 19 తేదీల్లో మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. డిమాండ్ల అమలు కోరుతూ ఈ నెల 27,28 తేదీల్లో రెండు రోజుల పాటు టోకెన్ సమ్మె చేయాలని నిర్ణయించింది. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే నిరవధిక సమ్మె తేదీలను ఖరారు చేస్తామని హెచ్చరించారు.

మాకు కావాల్సింది దయా దాక్షిణ్యాలు కావు

- రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలి
- 19ఏండ్లుగా వెట్టి చాకిరే
- మేము అడిగేవి గొంతెమ్మ కోరికలూ కావు
- డిమాండ్లు పరిష్కరిస్తామంటేనే కాంగ్రెస్‌కు ఓట్లేసినం
- అధికారంలోకి వచ్చి ఏడాదైనా..ఇచ్చిన మాట గుర్తులేదా?
- ఆశాల పోరాట శక్తి ఏంటో గత ప్రభుత్వానికి తెలుసు
- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లోనే మా డిమాండ్లు పరిష్కరించాలి
- పీఎఫ్ ,ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలి : తెలంగాణ ఆశా వర్కర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి.విజయలక్ష్మి
- పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలో సాగిన ఆశా వర్కర్ల బస్సు జాతా
- వందలాదిగా తరలివచ్చిన ఆశా వర్కర్లు

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి/ కరీంనగర్/ పెద్దపెల్లి

"ఆశా వర్కర్లు 19ఏండ్లుగా వెట్టి చాకిరీ చేస్తున్నారు. ప్రభుత్వం తలపెట్టే ప్రతి పనిలోనూ క్షేత్రస్థాయిలో ఆశా వర్కర్లతోనే పాలకులు పని చేయించుకుంటున్నారు. జీతాలు మాత్రం.. పనిని లెక్కగడుతూ కనీసం నెలకు అరకొరగా ఇస్తున్నారు. పెరుగుతున్న ధరలకు తగ్గ వేతనం రాక ఆశాల కుటుంబాలు అల్లాడుతున్నాయి. ధర్నాలు, రాస్తారోకోలు, వంటావార్పులు ఇలా ఎన్నో రకాలుగా తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ పోరాటాలు చేసినప్పుడల్లా ఉపశమన హామీలు, కమిటీలు వేస్తూ కాలయాపన చేశారు. మాకు దయా దాక్షిణ్యాలు అవసరం లేదు. నెలకు రూ.18వేల ఫిక్స్ వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ సహా ఉద్యోగ భద్రత కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం చేయాలి." అని తెలంగాణ ఆశా వర్కర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి జయలక్ష్మి డిమాండ్ చేశారు. ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే ఆశాల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ ఆశా వర్కర్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 15న రాష్ట్రవ్యాప్తంగా బస్సుజాత ప్రారంభమైంది. ఆ సంఘం రాష్ట్ర నాయకులు ఏడుగురు సభ్యులతో కూడిన బృందం బస్సు జాత మంగళవారం పెద్దపెల్లి, కరీంనగర్ జిల్లాల్లో సాగింది. ఈ రెండు జిల్లా కేంద్రాల్లో వందలాదిగా వచ్చిన ఆశా వర్కర్లు డప్పు చప్పుళ్ళ నడుమ బతుకమ్మ బోనాలు కోలాటాలతో జాత బందానికి ఘన స్వాగతం పలికారు. పెద్దపెల్లి కరీంనగర్ జిల్లాలో ర్యాలీ చేపట్టి ఆయా జిల్లాల కలెక్టరేట్ల ఎదుట బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జాత బృందంలోని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి జయలక్ష్మి ప్రసంగించారు. ఎన్నికలకు ముందు గత ప్రభుత్వంతో తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఆశాలు పోరాడుతున్న సమయంలో తాము అధికారంలోకి వస్తే సమస్యలన్నీ పరిష్కరిస్తామని రాష్ట్రవ్యాప్తంగా ఇప్పుడున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎంపీలు మాట ఇచ్చారని గుర్తు చేశారు ఆశాల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది గడిచిన ఇచ్చిన మాట మరిచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు విషయమై రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సహా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశామని, నిరంతరం నిరసనలు పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ఆశాల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15 నుంచి 31వరకు రాష్ట్ర వ్యాప్త బస్సు జాత చేపట్టినట్టు తెలిపారు.



19ఏండుగా ఆశాలతో వెట్టి చాకిరీ

ఎన్‌హెచ్ఎం స్కీంలో భాగంగా 19ఏండ్లుగా ఆశా వర్కర్లందరూ వెట్టి చాకిరీ చేస్తున్నారని, వీరంతా బలహీన వర్గాలకు చెందిన వారేనని విజయలక్ష్మి తెలిపారు. రాత్రింబవళ్లు ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న వీరికి ప్రభుత్వం పనిని బట్టి పారితోషకం ఇస్తామనడం ఎంత మాత్రం సమంజసం కాదన్నారు. దీనికితోడు చెప్పిన పని చేయకపోతే పారితోషకాల్లో కోతలు పెడతామంటూ అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రసవాల సమయంలో రెండు మూడు రోజులు కుటుంబాన్ని వదిలి గర్భిణితో పడి కాపులు కాస్తున్న ఆశా వర్కర్లకు డెలివరీ కేసుల టార్గెట్స్ పెడుతూ టార్చర్ చేస్తుందన్నారు. అసాశ్రయమైన పద్ధతిలో టీబీ స్ఫూటం డబ్బాలను మోయిస్తూనే ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో పని ఒత్తిడికి గురి చేస్తున్నారని చెప్పారు.

ఇంత చాకిరీ చేస్తున్నా నెలకు కేవలం రూ.9,900 పనిని బట్టి పారితోషకాలు ఇవ్వడం దారుణం అన్నారు. ఈ వేతనంలోనూ వ్యత్యాసాలు ఉంటున్నాయని తెలిపారు. మరోవైపు కేంద్రంలోని బీజేపీ సర్కారు చెల్లించే బడ్జెట్ తగ్గిస్తూ కేవలం రూ.3వేలు మాత్రమే పారితోషకాలు ఇస్తుందని చెప్పారు.

కరోనా సమయంలో ఆశాలను శ్రమను గుర్తించిన డబ్ల్యుహెచ్ఓ తమను గ్లోబల్ లీడర్స్‌గా అభివర్ణించిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. అలాంటి సేవలు అందించిన ఆశా వర్కర్లను కేంద్ర సర్కారు పట్టించుకోవడం లేదన్నారు. పదేళ్ల అధికారంలో ఉంటూ ఆశా వర్కర్లను బీఆర్ఎస్ సర్కారు మోసం చేసిందని, తాము అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం సైతం మోసగిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా 15 రోజులు రాష్ట్రవ్యాప్తంగా ఆశలు చేసిన సమ్మె గత ప్రభుత్వాన్ని గడగడలాడించిందని, వెంటనే ఓ ఐఏఎస్ అధికారి నేతృత్వంలో కమిటీని సైతం వేసిన విషయాన్ని గుర్తు చేశారు. తీరా ఎన్నికలు రావడంతో రాష్ట్రాల్లో ప్రభుత్వం మారిందనితెలిపారు. ఆశాల మద్దతుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే తమ డిమాండ్లు పరిష్కరించాలని, లేని పక్షంలో నిరవధికంగా సాగుతుందని హెచ్చరించారు.

సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్ మాట్లాడుతూ అతి తక్కువ పారితోషికాల నుంచి నేడు రూ.9900 పారితోషకాలను రాష్ట్రంలో పెంచుకున్నాం న్నారు. ఇది సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశలు చేసిన పోరాట ఫలితమేనని, పారితోషకాల పెంపుతో పాటు యూనిఫామ్, సెల్ఫోన్, ప్రింటర్ రిజిస్టర్ అనేక తదితర సౌకర్యాలు సాధించుకు న్నామన్నారు.

ఆంధ్రప్రదేశ్, హర్యానా, మహారాష్ట్ర మాదిరిగా రాష్ట్రంలో ఫిక్స్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ బస్సు జాతా బందంలో తెలంగాణ ఆశా వర్కర్ యూనియ న్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ నీలాదేవి ఉపాధ్యక్షులు ఆర్ సాధన రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఎస్ పద్మ, కే సునీత, రాష్ట్ర కోశాధికారి పి గంగమణి రాష్ట్ర నాయకులు ఎం బాలమణి, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు గిట్ల ముకుంద రెడ్డి జిల్లా కోశాధి కారి జి రాజేశం ఉపాధ్యక్షులు యు శ్రీనివాస్ జిల్లా సహాయ కార్యదర్శి పున్నం రవి నగర కన్వీనర్ పుల్లెల మల్లయ్య ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షులు రంగవేణి శారద, ఉపాధ్యక్షు లు రాజమణి, శంకరమ్మ, ప్రియాంక, లక్ష్మి, సరిత సహా పెద్ద ఎత్తున ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

- రిక్రూట్‌మెంట్ రాత పరీక్ష నిలిపివేయాలి : తెలంగాణ వైద్య ఆరోగ్య ఉద్యోగ సంఘాల పోరాట కమిటీ (జేఏసీ) డిమాండ్
- డీఎంహెచ్ఎస్ ఆవరణలో ఏఎన్ఎంల ధర్నా

నవతెలంగాణ -సుల్తాన్‌బజార్



ఈనెల 29న జరగనున్న ఏఎన్ఎం, ఎంపీహెచ్ఏ (ఎఫ్) రిక్రూట్‌మెంట్ రాత పరీక్షను నిలిపివేయాలని, కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రాత పరీక్ష లేకుండా రెగ్యులర్ చేయాలని తెలంగాణ వైద్య ఆరోగ్య ఉద్యోగ సంఘాల పోరాట కమిటీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. హైదరాబాద్ కోఠిలోని డీఎంహెచ్ఎస్ ఆవరణలో తెలంగాణ వైద్య ఆరోగ్య ఉద్యోగ సంఘాల పోరాట సమితి జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు యాద నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ, ప్రాథమిక ఆస్పత్రుల్లో 20 ఏండ్లుగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఇప్పుడు వారి వయస్సు 45 నుంచి 55 వరకు ఉందని, ఈ వయసులో పోటీ పరీక్ష రాసే పరిస్థితి లేదని అన్నారు. ఇప్పుడు వారికి రాత పరీక్ష పెట్టడం అర్థరహితమని, తక్షణమే రాత పరీక్ష నిలిపివేయాలని డిమాండ్ చేశారు. 20 ఏండ్ల కిందట నాటి వైద్య ఆరోగ్యశాఖ అవసరానికి రాత పరీక్ష, మెరిట్, స్థానికత ఆధారంగా రోల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించి నియమించినట్టు గుర్తు చేశారు. ఇన్ని సంవత్సరాల సర్వీస్‌కు 50 మార్కులు, ఏఎన్ఎం ట్రెనింగ్‌లో పొందిన మార్కుల ఆధారంగా రాత పరీక్ష లేకుండా వీరందరినీ రెగ్యులరైజేషన్ చేయడానికి పరిశీలించాలని కోరారు. రిక్రూట్‌మెంట్ నిబంధనలను సవరించి సర్వీసులో ఉన్న వారికి వయోపరిమితిని ఎత్తేయాలన్నారు. కాంట్రాక్ట్ సర్వీసులోని వివిధ రిజర్వేషన్ క్యాటగిరీల్లో 50 నుంచి 55 వయసు పైబడిన వారు 700 మంది రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు చేసుకునే అర్హతను కోల్పోతున్నారన్నారు. వీరికి న్యాయం జరగాలంటే వయోపరిమితిని ఎత్తేయాలని కోరారు.

జేఏసీ నాయకులు కె.సాయిరెడ్డి మాట్లాడుతూ.. 70 ఏండ్ల కిందట ఏర్పాటైన సబ్ సెంటర్ల పరిధిలో జనాభా ప్రాతిపదికన కొత్తవి మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో 3000 జనాభాకు, పట్టణ ప్రాంతంలో 5,000 జనాభాకు సబ్ సెంటర్ పెట్టాలన్నారు. ఆనాడు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతుల్లో నియామకాలు చేసి ఎలాంటి సర్వీసు నిబంధనలూ పెట్టకుండా 20 ఏండ్లు నెట్టుకొచ్చారన్నారు. ఈ 20 ఏండ్ల కాలంలో అనేకమంది చనిపోయారని, కొందరు రోడ్డు ప్రమాదాల్లో పాక్షికంగా, పర్మినెంట్‌గా వైకల్యానికి గురయ్యారని చెప్పారు. అలాంటి వారి కుటుంబాలకు నష్టపరిహారం, ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జేఏసీ నాయకులు భూపాల్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు 61 ఏండ్లు నిండి ఉద్యోగ విరమణ పొందిన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు చివరి నెల వేతనంలో సగం ప్రతినెలా పింఛన్‌గా ఇవ్వాలని కోరారు. అనంతరం కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యలపై వెంటనే స్పందించాలని కోరారు. ఈ ధర్నాలో జేఏసీ నాయకులు పసియోద్దీన్, రాజశేఖర్, మధురిమ, జ్యోతి, రాజమణి, సీతమ్మ, సుగుణ, మమత, హసీనా, సరోజా, కిరణ్మయి, కుమార్, పెద్దఎత్తున ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సంధ్య థియేటర్‌కు షోకాజ్ నోటీసులు

- బాలుడికి నగర సీపీ పరామర్శ

నవతెలంగాణ-సిటీబ్యూరో

సంచలనంగా మారిన సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసు ఊహించని మలుపులు తిరుగుతోంది. ఈ కేసులో నటుడు అల్లు అర్జున్‌ను అరెస్టు చేసిన పోలీసులు.. ఆ తర్వాత మధ్యంతర బెయిల్ రావడంతో విడుదల చేశారు. తాజాగా బన్నీ బెయిల్ రద్దు కోసం సుప్రీం కోర్టును ఆశ్రయించాలని హైదరాబాద్ పోలీసులు నిర్ణయించారు. ఇదే సమయంలో సంధ్య థియేటర్ యాజమాన్యానికి చిక్కడపల్లి పోలీసులు షాక్ ఇచ్చారు. థియేటర్ నిర్వహణ లోపాలపై వివరణ ఇవ్వాలంటూ షోకాజ్ నోటీసు జారీ చేశారు.

సీపీఐ(ఎం) యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కమిటీ ఎన్నిక

- కార్యదర్శిగా ఎండి.జహంగీర్



నవ తెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

సీపీఐ(ఎం) యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శిగా ఎండి.జహంగీర్ ఎన్నికయ్యారు. చౌటుప్పల్‌లో జరిగిన సీపీఐ(ఎం) జిల్లా మూడో మహాసభ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా కార్యదర్శితోపాటు 34 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా కొండమడుగు నర్సింహా, బట్టుపల్లి అనురాధ, మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేషం, దాసరి పాండు, జల్లెల్ల పెంటయ్య, బూర్గు క్రిష్టారెడ్డి, గుంటోజు శ్రీనివాసాచారిని ఎన్నుకున్నారు.

జిల్లా కమిటీ సభ్యులుగా సిరిపంగి స్వామి, దయ్యాల నర్సింహా, మాయ క్రిష్ణ, బొల్లు యాదగిరి, మద్దెల రాజయ్య, ఎండి.పాష, బొడ్డుపల్లి వెంకటేష్, ముక్కెర్ల యాదయ్య, గుండు వెంకటనర్సు, గంగాదేవి సైదులు, దోడ యాదిరెడ్డి, మద్దెపూరం రాజు, బోలగాని జయరాములు, అవ్వారు రామేశ్వరి, రాచకొండ రాములమ్మ, ఎంఏ.ఇక్బాల్, వనం ఉపేందర్, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, గడ్డం వెంకటేష్, రాగిరు కిష్టయ్య, మల్లెపల్లి లలిత, బలుగూరి అంజయ్య, కోట రామచంద్రారెడ్డి, గోశిక కరుణాకర్, పైళ్ళ గణపతిరెడ్డిని ఎన్నుకున్నారు.

ఈ మహాసభలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, సీనియర్ నాయకులు బొంతల చంద్రారెడ్డి పాల్గొన్నారు.

భవిష్యత్ ఎర్రజెండాలదే..

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ- చౌటుప్పల్ రూరల్

ప్రపంచంలో అనేక దేశాల్లో కార్మికులు, రైతులు, ప్రజలు పెద్దఎత్తున పోరాటాలు చేసి కమ్యూనిస్టులను అధికారంలోకి తీసుకొచ్చారని, భవిష్యత్ ఎర్రజెండాలదేనని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. చౌటుప్పల్‌లో జరుగుతున్న సీపీఐ(ఎం) యాదాద్రిభువనగిరి జిల్లా మూడో మహాసభ చివరి రోజైన మంగళవారం ఆయన మాట్లాడారు. పక్కనున్న శ్రీలంకలో, నేపాల్‌లో కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చారని చెప్పారు. ఫ్రాన్స్ పార్లమెంట్ ఎన్నికల్లో పెద్ద పార్టీగా కమ్యూనిస్టు పార్టీ అవతరించిందని, జర్మనీ స్థానిక ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను కమ్యూనిస్టులు గెలిచారని తెలిపారు. అమెరికా చుట్టూత ఉన్న వెనిజులా, అర్జెంటీనా లాంటి దేశాల్లో కమ్యూనిస్టులు అధికారంలో ఉన్నారని చెప్పారు.

ప్రపంచ దేశాలపై అమెరికా పెత్తనం చలాయిస్తోందన్నారు. భారతదేశ పాలకులు కూడా అమెరికా కనుసన్నల్లో నడుచుకుం టున్నారని ఆరోపించారు. బీజేపీ అనుసరిస్తున్న విభజన రాజకీయాలను తిప్పికొడుతూ ఉద్యమాలు చేయాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ.. భవిష్యత్ ఎర్రజెండా పార్టీలదేనని, బీజేపీ నిజస్వరూపం బయటపడిందని అన్నారు.

రైతాంగ పోరాటంతో వెనక్కి తగ్గినట్టే తగ్గి మూడు నల్ల చట్టాలను తిరిగి దొడ్డిదారిన తెచ్చే ప్రయత్నం చేస్తోం దని విమర్శించారు. నరేంద్రమోడీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడుతున్నాయన్నారు. ఇప్పటికే చావుతప్పి కన్ను లొట్టతప్పినట్టు నితీశ్‌కుమార్, చంద్రబాబు సహాయంతో మూడో సారి అధికారం చేపట్టారన్నారు. ఈ మహాసభలో జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, పైళ్ల ఆశయ్య, సీనియర్ నాయకులు బొంతల చంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మంగ నర్సింహులు, మాటూరు బాలరాజు, కల్లూరు మల్లేశం, దోనూరు నర్సిరెడ్డి, దాసరి పాండు, మేక అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లచట్టాల అమలును ఆపాలి

కనీస మద్దతు ధర కల్పనపై మోడీ సర్కారు మోసం

- 23న 500 జిల్లా కేంద్రాల్లో ఆందోళనలను జయప్రదం చేయాలి
- అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించే చట్టం తీసుకొస్తామని రాతపూర్వకంగా రైతాంగానికి ఇచ్చిన హామీని తుంగలో తొక్కి దొడ్డిదారిన నల్లచట్టాలను అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమవ్వటం దుర్మార్గమని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. నల్లచట్టాలను తీసుకురావడాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. కేంద్రం తీరును నిరసిస్తూ ఈ నెల 23న దేశంలో 500 జిల్లా కేంద్రాల్లో ఎస్కేఎం తలపెట్టిన ఆందోళనలను జయప్రదం చేయాలని రైతులకు పిలుపు నిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నల్లచట్టాల్లోని సారాంశం ఆధారంగా మార్కెట్ ఆధారిత చట్టం కొత్తగా రూపొందించి అమలు చేయాలని చూడటం రైతులను మోసం చేయడమేనని విమర్శించారు. దేశవ్యాప్తంగా రైతుల పోరాటంపై ఉక్కుపాదం మోపుతూ అరెస్టులు చేయడా న్ని ఖండించారు. ఉత్తరప్రదేశ్, హర్యానా ప్రభుత్వాలు రైతు సంఘాల నాయకులపైనా, రైతులపైనా అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేసి వేధించడాన్ని తప్పుబట్టారు.

నోయిడాలో రైతుల నిరవధిక దీక్షలు కొనసాగుతున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే రైతు సంఘాల నేతలతో చర్చలు జరపాలనీ, గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రైతుల పోరాటానికి మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘాల జేఏసీ పిలుపు మేరకు 23న జరిగే ఆందోళనల్లో వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

రైతాంగానికి కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర కల్పించడం అంటే భారతదేశ ఆహార భద్రతను కాపాడటమేనని చెప్పారు. నేడు చాలా దేశాలు ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న తీరును, కోవిడ్ కాలంలో ఎదుర్కొన్న ఇబ్బందులను వివరించారు. నేషనల్ క్రైమ్ బ్యూరో లెక్కల ప్రకారం దేశంలో 5,400 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే వ్యవసాయ కార్మికులు 5,800 మందికిపైగా చనిపోయారని తెలిపారు. గతంలో యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్‌లో నాలుగు శాతం నిధులు కేటాయిస్తే.. కేంద్రంలోని ప్రస్తుత మోడీ సర్కారు 1.37 శాతానికి నిధులను కుదించిందని విమర్శించారు. ఆధార్ పేరుతో ఏడు కోట్ల జాబ్‌కార్డులను తొలగించిందని తెలిపారు. ఆహార భద్రతా కార్డుల్లోని 5.86 కోట్ల మంది లబ్ధిదారులను తొలగించిందనీ, 2 కోట్ల రేషన్‌కార్డులను రద్దు చేసిందని విమర్శించారు. ఈ చర్యలను తక్షణమే వెనక్కి తీసుకుని రైతాంగ సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించకపోతే మోడీ సర్కారు ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య, కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, ఉపాధ్యక్షులు బి.ప్రసాద్ పాల్గొన్నారు.

నమూనా చీరలను పరిశీలించిన సీఎం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్వయం సహాయక సంఘాల మహిళలకు అందించేందుకు ఎంపిక చేసిన నమూనా చీరలను ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పరిశీలించారు. మంగళవారం తన తన చాంబర్‌లో నమూనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి పాలకవర్గంతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.



పెండింగ్ ఫీజులను దశల వారీగా చెల్లిస్తాం

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంజినీరింగ్, సాంకేతిక కళాశాలల ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలను దశలవారీగా చెల్లిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ప్రయివేట్ కళాశాలల యజమానులు, విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు, అసలు కలిపి ఏడాదికి 66 వేల కోట్లు, రైతు రుణమాఫీ కోసం రూ. 21 వేల కోట్లు మొత్తం ఈ ఏడాది రెండు అంశాలకే రూ. 87 వేల కోట్ల నగదును చెల్లించామని వారికి వివరించారు. ఆర్థిక సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కారించుకుంటూ ముందుకు వెళ న్నామని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం బకాయిలు దశలవారీగా చెల్లిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో ఉన్నత విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి శ్రీధర్, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌పీలకు చట్టబద్ధత కల్పించాలి

- రుణ మాఫీ కోసం పథకం అవసరం
- వ్యవసాయానికి మరింత బడ్జెట్
- వ్యవసాయ కార్మికుల కోసం జాతీయ కమిషన్
- కేంద్రానికి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫారసు



న్యూఢిల్లీ : పంటలకు అందిస్తున్న కనీస మద్దతు ధరలకు (ఎంఎస్‌పీ) చట్టబద్ధత కల్పించి అమలు చేయాలని వ్యవసాయం, పశుసంవర్ధకం, ఫుడ్ ప్రాసెసింగ్‌పై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ మంగళవారం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని అన్నదాతలు, పలు రైతు సంఘాలు చాలా కాలం నుంచి డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఎంఎస్‌పీలకు చట్టబద్ధత కోరుతూ శంభు, ఖనౌరీ సరిహద్దుల వద్ద రైతులు ఆందోళన నిర్వహిస్తున్న సమయంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఈ సిఫారసు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి, జలంధర్ ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చెన్నీ నేతృత్వంలోని కమిటీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయం, రైతుల సంక్షేమానికి సంబంధించిన గ్రాంట్ల డిమాండ్లపై లోక్‌సభకు తన తొలి నివేదికను అందజేసింది. ఎంఎస్‌పీలకు చట్టబద్ధత కల్పించాలన్న సిఫార్సును తన నివేదికలో కమిటీ చేర్చిందని లోక్‌సభ సచివాలయం ఓ ప్రకటనలో తెలిపింది.'దేశంలో వ్యవసాయ సంస్కరణలు, రైతుల సంక్షేమం కేంద్రంగా జరుగుతున్న చర్చలో ఎంఎస్‌పీల అమలు కేంద్ర బిందువుగా ఉన్నదని కమిటీ అభిప్రాయపడింది. ఎంఎస్‌పీలకు చట్టబద్ధత కల్పిస్తే దేశంలో రైతుల ఆత్మహత్యలను తగ్గించవచ్చునని అది భావిస్తోంది. రైతులకు ఆర్థిక స్థిరత్వాన్ని కల్పించడం, మార్కెట్‌లో నెలకొంటున్న అస్థిర పరిస్థితుల నుండి వారికి రక్షణ కల్పించడం, రుణ భారాన్ని తగ్గించడం ద్వారా ఆత్మహత్యల నుండి రైతులను కాపాడవచ్చు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని ఎంఎస్‌పీలకు చట్టబద్ధత కల్పించాలని కమిటీ సిఫారసు చేసింది' అని లోక్‌సభ సచివాలయం ఆ ప్రకటనలో వివరించింది.

రైతుల ఇక్కట్లకు రుణభారం, ఆత్మహత్యలే కారణమని అభిప్రాయపడిన కమిటీ... అన్నదాతలు, వ్యవసాయ కార్మికుల రుణాలను మాఫీ చేసేందుకు ఓ పథకాన్ని ప్రవేశపెట్టాలని కూడా కేంద్రానికి సూచించింది. 2021-22, 2024-25 మధ్యకాలంలో వ్యవసాయం, రైతుల సంక్షేమ శాఖకు అధిక కేటాయింపులు జరిపినప్పటికీ కేంద్ర ప్రణాళికా వ్యయంలో ఈ శాఖ వాటా 3.53 శాతం (2020-21) నుండి 2.54 శాతానికి (2024-25) తగ్గిపోయిందని కమిటీ అందజేసిన గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్పాదకతను మెరుగుపరచడానికి వ్యవసాయానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని కేంద్రాన్ని కమిటీ కోరింది. పీఎం-కిసాన్ పథకానికి అందిస్తున్న వార్షిక మద్దతును రూ.6,000 నుండి రూ.12,000కు పెంచాలని కూడా సిఫారసు చేసింది. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు అందేలా చూడడానికి సాధ్యమైనంత త్వరగా జాతీయ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, దీనివల్ల వారికి లభించాల్సిన హక్కులు దక్కుతాయని కమిటీ తెలిపింది.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

- ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి
- రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న సమ్మె



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె కొనసాగుతున్నది. మంగళవారంతో ఎనిమిది రోజులు పూర్తయ్యింది. మంగళవారం హైదరాబాద్‌లోని సమ్మె శిబిరంలో తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుండిగల్ యాదగిరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతేడాది సెప్టెంబర్ 13న హన్మకొండలోని ఏకశిల పార్క్ దీక్షా శిబిరంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. రీఎంగేజ్ విధానం తొలగించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజీ కల్పించాలని సూచించారు. ఉద్యోగులకు హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలనీ, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎనిమిది రోజులుగా సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెలో ఉండడం వల్ల ఎంఈవో, డీఈవో కార్యాలయాలు మూతపడ్డాయని అన్నారు. విద్యాశాఖ పరిపాలన పూర్తిగా స్తంభించిపోయిందన్నారు. కేజీబీవీ, యూఆర్ఎస్ పాఠశాలల్లో బోధన కొనసాగడం లేదన్నారు. పాఠశాల విద్యాశాఖలో యూడైస్, అపార్, మధ్యాహ్న భోజనం ఆన్‌లైన్ పనులు కుంటుపడ్డాయని వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సంఘ నాయకులను పిలిచి చర్చలు జరిపి సమస్యలను పరిష్కారం చేయ్యాలని కోరారు. పే స్కేల్ అమలు చేస్తామంటూ అసెంబ్లీలో ప్రకటన చేయాలన్నారు. తమ సమస్యలు తీర్చే వరకు సమ్మె కొనసాగుతుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనిల్ చారి, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ సహాదేవ్, సురేందర్, రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్సీ అభ్యర్థి పడాల రవీందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చందు, జానకి రామ్, కనుకుల రమేష్ , రాష్ట్ర కార్యదర్శి సత్య నారాయణ, ప్రవీణ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌పై విచారణకు రంగం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

ప్రకారం గవర్నర్ అనుమతించిన విషయాన్ని పేర్కొంటూ సదరు లేఖను ఏసీబీకి పంపాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో కేటీఆర్‌ను విచారించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి...'గవర్నర్ అనుమతి లేఖ'ను మంగళవారం రాత్రి 10.30 గంటల సమయంలో ఏసీబీకి పంపారు. సోమవారం నిర్వహించిన క్యాబినెట్‌లో ఫార్ములా-ఈ కార్ రేసు వ్యవహారంపైన, విద్యుత్తు వ్యవహారాలకు సంబంధించి జస్టిస్ మదన్ లోకూర్ ఇచ్చిన నివేదికపైనా సమగ్రంగా చర్చించారు. ఫార్ములా రేసు పూర్వాపరాలు, అనుమతి లేకుండానే హెచ్ఎండీఏ ఒప్పందం చేసుకోవడం, ఆర్‌బీఐ అనుమతి లేకుండా రూ.46 కోట్ల మేర విదేశీ కరెన్సీ చెల్లించడం వంటి వ్యవహారాలపై పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి ఫిర్యాదు మేరకు ఏసీబీ ఇప్పటికే కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇందులో కేటీఆర్‌తోపాటు పురపాలకశాఖ అప్పటి ప్రత్యేక కార్యదర్శి అర్వింద్‌కుమార్‌ను, చీఫ్ ఇంజినీర్‌ను బాధ్యులుగా పేర్కొన్నారు. అధికారులపై విచారణకు ప్రభుత్వం ఇంతకుముందే అనుమతి ఇచ్చింది. కేటీఆర్‌పై కేసు నమోదుకు గవర్నర్ నుంచి అనుమతి కోరగా, సుమారు నెల రోజుల తర్వాత ఇటీవల అనుమతి లభించింది.

ఎప్‌సెట్ కన్వీనర్‌గా బి డీన్‌కుమార్


- ఐసెట్ కన్వీనర్‌గా అలువాల రవి
- త్వరలో ప్రవేశ పరీక్షల తేదీల ప్రకటన
- ఉన్నత విద్యామండలి వెల్లడి


అలువాల రవి


ఎ. అరుణకుమారి


పి. చంద్రశేఖర్


బి. విజయలక్ష్మి


ఎస్ఎస్ దిలీప్


బి. వెంకట్రామ్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ సహా వివిధ వృత్తి విద్యా, ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్షలను నిర్వహించే విశ్వవిద్యాలయాలు, కన్వీనర్లను ఉన్నత విద్యామండలి ఖరారు చేసింది. ప్రవేశ పరీక్షలు నిర్వహించే విశ్వవిద్యాలయాలు, కన్వీనర్ల పేర్లను ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ వి బాలికిష్టారెడ్డి, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ మంగళవారం ప్రకటించారు. ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ నిర్వహణ బాధ్యతను జేఎన్టీయూ హైదరాబాద్‌కు మళ్లీ అప్పగించారు. ఎప్‌సెట్ కన్వీనర్‌గా జేఎన్టీయూ హైదరాబాద్ సివిల్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ బి డీన్‌కుమార్‌ను నియమించారు. ఎంటెక్, ఎంఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పీజీఈసెట్ నిర్వహణ బాధ్యతను జేఎన్టీయూ హైదరాబాద్‌కు అప్పగించారు. పీజీఈసెట్ కన్వీనర్‌గా జేఎన్టీయూ హైదరాబాద్ మెకానికల్ విభాగం ప్రొఫెసర్ ఎ అరుణ కుమారి నియమితులయ్యారు. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఐసెట్ నిర్వహణ బాధ్యతను మహాత్మాగాంధీ విశ్వవిద్యాలం (ఎంజీయూ)కు అప్పగించారు. ఐసెట్ కన్వీనర్‌గా బిజినెస్ విభాగం విభాగం ప్రొఫెసర్ అలువాల రవిని నియమించారు. పాలిటెక్నిక్ అభ్యర్థులు ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాల్లో చేరేందుకు నిర్వహించే ఈసెట్ నిర్వహణ బాధ్యతను ఓయూకు అప్పగించారు. ఈసెట్ కన్వీనర్‌గా ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే లాసెట్ నిర్వహణ బాధ్యతను మళ్లీ ఓయూకు అప్పగించారు. కన్వీనర్‌గా ఓయూ లా కాలేజీ ప్రొఫెసర్ బి విజయలక్ష్మిని నియమించారు. బీఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్‌సెట్ నిర్వహణ బాధ్యతను కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ)కు అప్పగించారు. ఎడ్‌సెట్ కన్వీనర్‌గా కేయూ ఫిజిక్స్ ప్రొఫెసర్ బి వెంకట్రామ్ రెడ్డిని నియమించారు. బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పీఈసెట్ నిర్వహణ బాధ్యతను పాలమూరు విశ్వవిద్యాలయం (పీయూ)కు అప్పగించారు. కొత్త కన్వీనర్‌గా జేఎన్టీయూ హైదరాబాద్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ప్రొఫెసర్ ఎస్ఎస్ దిలీప్ నియమితులయ్యారు. మేలో ప్రవేశ పరీక్షలను నిర్వహించాలని ఉన్నత విద్యామండలి ఆలోచిస్తున్నట్టు సమాచారం. ప్రవేశ పరీక్షల తేదీలను త్వరలోనే ఖరారు చేసి ప్రకటిస్తామని వారు తెలిపారు.

ప్రవేశ పరీక్షల కన్వీనర్ల వివరాలు

సెట్	విశ్వవిద్యాలయం	కన్వీనర్
ఎప్‌సెట్	జేఎన్టీయూహెచ్	బి డీన్‌కుమార్
పీజీఈసెట్	జేఎన్టీయూహెచ్	ఎ అరుణకుమారి
ఐసెట్	ఎంజీయూ	అలువాల రవి
ఈసెట్	ఓయూ	పి చంద్రశేఖర్
లాసెట్	ఓయూ	బి విజయలక్ష్మి
ఎడ్‌సెట్	కేయూ	బి వెంకట్రామ్ రెడ్డి
పీఈసెట్	పీయూ	ఎస్ఎస్ దిలీప్

నవతెలంగాణ

నవ్వించడం ఒక యోగం.. నవ్వడం ఒక భోగం..
నవ్వలేకపోవడం ఒక రోగం - జంధ్యాల

బుధవారం 18 డిసెంబరు 2024
www.navatelangana.com

సంపాదకీయం

ఆగిన సంగీత ఝరి



తన మహోన్నత ప్రతిభా పాటవాలతో దేశ విదేశాల్లో కోట్లాది మంది మనసుల్ని గెలుచుకున్న సంగీత భానుడు అస్తమించాడు. భారత శాస్త్రీయ వాయిద్య కళను ప్రపంచానికి చేరువ చేసిన మ్యూజిక్ మాస్ట్రో, తబలా వాయిద్య మాంత్రికుడు ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ నిష్క్రమణతో తబలా మూగబోయింది. తోడు వాయిద్యంగా ఉన్న తబలాకు ప్రత్యేక గుర్తింపుతెచ్చిన అద్వితీయ ప్రతిభావంతుడు ఇకలేరన్న వార్త ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంగీత ప్రియులను శోకసంద్రంలో ముంచింది. ఆల్‌టైం గ్రేట్ తబలా విద్వాంసుడిగా పేరొందిన ఉస్తాద్ అల్లారఖా ఖాన్ కుమారుడైన జాకీర్ హుస్సేన్ అల్లారఖా ఖురేషికి పసిబిడ్డగా ఉన్నప్పుడే తబలాతో ఏర్పడిన అనుబంధం, అంతకు మించిన అకుంఠిత దీక్ష, అద్వితీయ ప్రతిభ... ఆయన్ను సంగీత ప్రపంచంలో శిఖరాగ్రాన నిలిపాయి. శాస్త్రీయ వాయిద్య కళాకారులకిచ్చే బిరుదైన 'ఉస్తాద్' అని కాకుండా... జాకీర్ బాయ్ అని పిలవాలని కోరుకోవడం ఆయన వినమ్రతకు, విశ్వమానవ సౌభ్రాతృత్వానికి నిదర్శనం.

ఆసుపత్రి నుంచి ఇంటికి తీసుకొచ్చినప్పుడు ముస్లిం సంప్రదాయం ప్రకారం తండ్రి కొడుకు చెవిలో 'కల్మా' చదివి, పేరు పలికి లోపలికి తీసుకెళ్లాలి. ఉస్తాద్ అల్లా రఖా తన కొడుకు చెవిలో తబలా జతులు వినిపించాడట. ఇదేమిటని భార్య ప్రశ్నిస్తే... 'నా ప్రార్థనలు ఇవే.. నేను ప్రార్థన చేసే విధానం ఇదే' అన్నాడట. తనకు గురువుల నుంచి సంక్రమించిన జ్ఞానాన్ని కొడుకుకు పంచాలన్న ఆయన తపన...తండ్రికి మాట రాకూడదన్న పట్టుదల జాకీర్‌ను జగద్విఖ్యాతం చేశాయి. మూడేళ్లకే తబలాను మీటిన ఆ పసివేళ్లు...ఏడేళ్లకే అకుంఠిత దీక్షతో సాధన చేశాయి. పన్నెండేండ్లకే ప్రదర్శనలిచ్చాయి. అన్ని మతాలు, అన్ని ధోరణుల విద్వాంసులతో అతి సులువుగా కలిసిపోయి తన తబలాను వారి సంగీతానికి జత చేయగలగడం జాకీర్ ప్రతిభకు, సర్వమత సారం ఒక్కటేనన్న ఆధ్యాత్మిక భావనకు తార్కాణం. 'నేను స్కూల్‌కు వెళ్లే దారిలో చర్చిలో సంగీతం వినేవాణ్ణి. గుడిలో వినిపించే భక్తి గీతాలు ఆలపించేవాణ్ణి. ప్రపంచంలో ఏ మతమూ ఇంకో మతంపైన జబర్దస్తీ చేయదు. ఏ మతమైనా చెప్పేది నీ పొరుగు వారిని ప్రేమించమనే' అన్న ఆయన మాటలు... మతం పేరుతో విద్వేష విషం చిమ్మే తిరోగమన వాదులకు చెంపపెట్టు. 1989లో ఢిల్లీలో ప్రముఖ నాటక రచయిత సఫ్దర్ హష్మీని కాంగ్రెస్ గూండాలు హత్య చేసినప్పుడు ఆయన సృజనాత్మకంగా నిరసన తెలిపారు. కుల, మతాలకు అతీతంగా అందరినీ ప్రేమించారు. తన స్నేహితుడైన ప్రముఖ సంతూర్ విద్వాంసుడు శివకుమార్ 2022లో మరణించినప్పుడు భౌతికకాయాన్ని భుజాలపై మోసి ప్రేమను చాటుకున్నారు. అందరూ వెళ్లిపోయినా...చితిపక్కన విచారంగా నిలబడి కన్నీళ్లు పెట్టుకున్న ఫొటోలు వైరల్‌గా మారాయి. 'ఇదీ నిజమైన ఇండియా... స్నేహానికి కుల, మత భేదాలు లేవు' అన్న నెటిజన్ల వ్యాఖ్యలు అక్షర సత్యం కదా!అందుకేనేమో... క్రిస్టియన్ అయిన కథక్ నృత్యకారిణి ఆంటోనియా మిన్నెకోలాను వివాహం చేసుకున్నారు.

> అన్ని మతాలు, అన్ని ధోరణుల విద్వాంసులతో అతి సులువుగా కలిసిపోయి తన తబలాను వారి సంగీతానికి జత చేయగలగడం జాకీర్ ప్రతిభకు, సర్వమత సారం ఒక్కటేనన్న ఆధ్యాత్మిక భావనకు తార్కాణం. 'నేను స్కూల్‌కు వెళ్లే దారిలో చర్చిలో సంగీతం వినేవాణ్ణి. గుడిలో వినిపించే భక్తి గీతాలు ఆలపించేవాణ్ణి. ప్రపంచంలో ఏ మతమూ ఇంకో మతంపైన జబర్దస్తీ చేయదు. ఏ మతమైనా చెప్పేది నీ పొరుగు వారిని ప్రేమించమనే' అన్న ఆయన మాటలు... మతం పేరుతో విద్వేష విషం చిమ్మే తిరోగమన వాదులకు చెంపపెట్టు.

తండ్రి అల్లారఖాకు అనారోగ్యం కారణంగా 19 ఏళ్ల వయసులో తొలిసారి అమెరికా వెళ్లి పండిట్ రవి శంకర్‌కు సహవాయిద్యం అందించే అవకాశం దక్కింది. ఆయనతోపాటు అలీ అక్బర్ ఖాన్, భీమ్‌సేన్ జోషి, మంగళం పల్లి బాలమురళీకృష్ణ, శివకుమార్ శర్మ వంటి భారతీయ సంగీత ప్రముఖులతోనే కాక అంతర్జాతీయ దిగ్గజాలందరి తోనూ చేసిన జుగల్ బందీలు అజరామరంగా నిలిచాయి. పలు సినిమాలకు సౌండ్ ట్రాక్స్ అందించడం, నటించడమే కాకుండా... మిస్టర్ అండ్ మిసెస్ అయ్యర్ వంటి చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించారు. 'వాహ్ తాజ్' వంటి ప్రకటనలతో దేశంలో ప్రతి ఇంటికీ చేరువయ్యారు. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్, సంగీత నాటక అకాడమీ, గ్రామీ వంటి లెక్కలేనన్ని పురస్కారాలను అందుకున్నారు. హిందూ, ముస్లిం శాస్త్రీయ సంగీత భాగస్వామ్యాన్ని స్థిరంగా ప్రచారం చేయడంతోపాటు కొనసాగాలని కోరుకున్న కళా స్రష్ట. గాత్ర సంగీతమైనా, వాయిద్య సంగీతమైనా, జుగల్ బందీ అయినా, వ్యక్తిగత ప్రదర్శన ఇచ్చినా, ఫ్యూజన్ అయినా... తనదైన శైలిలో రక్తికట్టించే ఆయన తబలా వాయిద్యం... గాలిలో ఊగే గుబురు జుత్తు... జనం కళ్లలో ఎప్పుడూ కదలాడుతూనే ఉంటాయి. వచ్చే ఏడాది ముంబైలో వరుసగా సంగీత కచేరిలిచ్చేందుకు సిద్ధమైన ఆ బహుముఖ ప్రజ్ఞాశాలి ఇంతలోనే అస్తమించడం సంగీత ప్రపంచానికి తీరని లోటు. సంగీతానికి భాష అంటూ ఉంటే అది ప్రేమ, ఐక్యత అని చాటిచెప్పిన జాకీర్ భాయ్ ఎన్నటికీ సంగీత ప్రపంచంలో మకుటాయమానంగా వెలుగొందుతూనే ఉంటారు. కొత్త వెలుగులను అన్వేషించే భావి తరాలకు స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తారు.

ట్రంప్ ఉక్రోషం: సిరియాలో ఏం జరిగింది? భవిష్యత్తేమిటి!



ఎం కోటేశ్వరరావు
8331013288

ఐదు దశాబ్దాలకు పైగా సాగిన అసద్ కుటుంబ పాలన సిరియాలో ముగిసింది. అరబ్ సోషలిస్టు బాత్ పార్టీనేత, అధ్యక్షుడు బషర్ అల్ అసద్ పాలన 2000 సంవత్సరం జూలై 17 నుంచి 2024 డిసెంబరు 8వరకు సాగింది. అంతకు ముందు బషర్ తండ్రి హఫీస్ అల్ అసద్ 1971 మార్చి 14 నుంచి మరణించిన 2000 జూన్ పది వరకు అధికారంలో ఉన్నాడు. మధ్యప్రాచ్యంలో పాలస్తీనాకు మద్దతుగా ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా పూర్వపు సోవియట్ యూనియన్, తరువాత రష్యా పాలకులు సిరియాకు ప్రధాన మద్దతుదారులుగా ఉన్నారు. నవంబరు చివరివారం నుంచి హయత్ తహ్రరిర్ అల్ షామ్(హెచ్‌టిఎస్) సాయుధ సంస్థ, దానికి మద్దతు ఇచ్చిన వారు కలసి అసద్ మిలిటరీపై పెద్ద ఎత్తున దాడులు ప్రారంభించి డిసెంబరు ఎనిమిదో తేదీన రాజధాని డమాస్కస్‌ను స్వాధీనం చేసుకోవటం, అసద్ కుటుంబం రష్యాకు ప్రవాసం వెళ్లటంతో సిరియాలో నూతన అధ్యాయం మొదలైంది. సిరియా ఉగ్రవాదుల చేతికి చిక్కిన తరువాత తాను ప్రవాసం వెళ్లినట్లు మాజీ అధ్యక్షుడు అసాద్ చేసినట్లుగా చెబుతున్న ప్రకటనలో ఉంది. ముందుగా రూపొందించిన పథకం ప్రకారమే తాను తప్పుకున్నట్లు చేస్తున్న ప్రచారం వాస్తవం కాదన్నాడు. సిరియా తమ తొత్తుల చేతికి చిక్కనందుకు డోనాల్డ్ ట్రంప్ ఉక్రోషాన్ని వెళ్లగక్కాడు. అక్కడ తాము పోరాటం జరపలేదని తొలుత ప్రకటించిన ట్రంప్ సోమవారం నాడు మరోసారి స్పందించాడు. ఫ్లోరిడాలోని తన ఎస్టేట్‌లో విలేకర్లతో మాట్లాడుతూ ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా టర్కీ పని ముగించిందని అంటూనే బలవంతంగా ఆక్రమించిందని వ్యాఖ్యానించాడు.మొదటిసారి అధికారంలోకి వచ్చినపుడు సిరియాలో ఉన్న 900 మంది తమ సైనికులను ఉపసంహరించనున్నట్లు ప్రకటించిన ట్రంప్ తరువాత మాట మార్చాడు. సోమవారం నాడు అదే ప్రశ్నకు తరువాత చూద్దామన్నట్లుగా స్పందించాడు. ఇప్పుడు సిరియా భవిష్యత్ ఏమిటన్న ప్రశ్నకు ఎవరికీ ఏమీ తెలియదని, టర్కీ కీలక పాత్ర పోషించనుందని చెప్పాడు.

అసద్ స్థానంలో కొత్తగా అధికారానికి వచ్చిన వారు ఉగ్రవాదులా, కాదా అంటే అవును అన్నది వాస్తవం.హెచ్‌టిఎస్ నేత అబూ మహమ్మద్ అల్ జొలానీది అదే నేపథ్యం. అల్‌ఖైదా ఉగ్రవాద సంస్థలో పనిచేశాడు. తాజాగా అధికారానికి రావటం కోసం అలాంటి వారితో చేతులు కలిపాడు. ఇదే సమయంలో అల్‌ఖైదాతో విడగొట్టుకోవటంతో పాటు జీహాదీలకు వ్యతిరేకంగా పనిచేసిన చరిత్ర కూడా ఉంది. అతగాడిని అమెరికా ఇప్పటికీ ఉగ్రవాదిగానే పరిగణిస్తున్నది, గతంలో అరెస్టు చేసి జైల్లో కూడా పెట్టింది. అయితే తాజాగా అమెరికన్లు అధికారంలో ఉన్నవారితో సంప్రదింపులు జరుపుతున్నట్లు వార్తలు వచ్చాయి. అసద్ ప్రభుత్వం కూలిపోయినందుకు అక్కడి జనం ఆనందంతో ఉన్నారు. అది ఎంతకాలం ఉంటుంది? రానున్న రోజుల్లో జొలానీ నాయకత్వంలోని ప్రభుత్వం ఎలా ఉంటుంది, అసలు స్థిరత్వం చేకూరుతుందా అనే ప్రశ్నలు తలెత్తాయి. గాజాలో ఇజ్రాయిల్ మారణకాండ ప్రారంభమై పద్నాలుగు నెలలు గడిచాయి. పాలస్తీనియన్లకు మద్దతుగా ఉన్న లెబనాన్‌లోని హిజబుల్లా సాయుధ సంస్థతో ఇజ్రాయిల్ కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్న తరువాత సిరియా పరిణామాలు జరిగాయి. 2011లో ప్రారంభమైన అంతర్యుద్ధంతో సిరియన్లు అనేక విధాలుగా దెబ్బతిన్నారు, దేశం సర్వనాశనమైంది. కుక్కలు చింపిన విస్తరిలా సాయుధ ముఠాలు కొన్ని ప్రాంతాలను తమ అదుపులో ఉంచుకున్నాయి. ఆరు లక్షల మంది వరకు పౌరులు, సాయుధులు, సైనికులు మరణించినట్లు అంచనా, 70లక్షల మంది అంతర్గతంగా నెలవులు తప్పగా మరో 70లక్షల మంది వరకు ఇరుగుపొరుగు దేశాలకు శరణార్థులుగా వెళ్లారు. అంతర్యుద్ధం ముగిసినా సాధారణ జీవన పరిస్థితి ఎంతకాలానికి పునరుద్ధరణ అవుతుందన్నది పెద్ద ప్రశ్న.

కొత్త ప్రభుత్వం కొలువు తీరలేదు,వారు తమతో ఎలా ఉంటారో తెలియదు కనుక రానున్న రోజుల్లో సిరియాను దెబ్బతీయాలంటే దాని పాటవాన్ని దెబ్బతీసేందుకు ఇజ్రాయిల్ పెద్ద ఎత్తున దాడులు చేస్తూ ఆయుధ ఫ్యాక్టరీలు, నౌకా దళం ఇతర మిలిటరీ వ్యవస్థలను నాశనం చేస్తున్నది. వాటిలో ఇరాన్, రష్యా సరఫరా చేసిన ఆయుధాలు, వాటి నిల్వకేంద్రాలు కూడా ఉన్నాయి. ఇదంతా అమెరికా కనుసన్నల్లో జరుగుతున్నదని వేరే చెప్పనవసరం లేదు. గత కొద్ది నెలలుగా లెబనాన్‌పై దాడి అక్కడ పెద్ద సాయుధ శక్తిగా ఉన్న హిజబుల్లాపై దాడులు, దాని నేతల హత్యలో ఇజ్రాయిల్ పాత్ర గురించి తెలిసిందే. సిరియాకు మద్దతుగా అది ఇంకేమాత్రం దాడులు చేసే స్థితిలో లేదని చెబుతున్నారు. కొనసాగుతున్న ఉక్రెయిన్ సైనిక చర్య కారణంగా రష్యా, ఆంక్షల వలన ఇరాన్ మిలిటరీ సరఫరాలు కూడా తగ్గిపోయాయి. సిరియాలో ఉన్న తన నౌకా కేంద్రాన్ని రక్షించుకోవటంలోనే రష్యా మునిగి ఉంది. సిరియాలో అధికారాన్ని చేజిక్కించుకున్న హెచ్‌టిఎస్ సంస్థకు టర్కీ ప్రధాన మద్దతుదారుగా ఉంది. పరోక్షంగా ఇజ్రాయిల్ కూడా ఒక దశలో సాయం చేసిందని నిఘావర్గాలు చెబుతున్నాయి. అసద్ ప్రభుత్వం అణచివేతలకు పాల్పడిందనే విమర్శలు ఉన్నప్పటికీ అది ఇస్లామిక్ మత ఛాందసవాదాన్ని ప్రోత్సహించిన దాఖలాలు లేవు. ముస్లింలలో అనేక తెగలు ఉన్నాయి. అవి ఒక్కో ప్రాంతంలో కేంద్రీకృతమై ఉన్నాయి. వాటిలో కర్దులు ఒకరు. ఇస్లామిక్ తీవ్రవాద ఐసిస్, ఆల్‌ఖైదా కూడా అసద్‌ను వ్యతిరేకించాయి. వీటితో పాటు అమెరికా తనకు అనుకూలమైన శక్తులకు భారీఎత్తున సాయం చేసింది. అవేవీ అసద్ ప్రభుత్వాన్ని కదిలించలేక పోయాయి. సిరియాలో చమురు నిల్వలున్న ప్రాంతాల మీద అమెరికా ఆధిపత్యం ఉంది. అక్కడ దాని సైనికులు కూడా ఉన్నారు. గతంలోనే సిరియాలోని గోలన్ గుట్టల ప్రాంతాన్ని ఇజ్రాయిల్ ఆక్రమించింది. కొంత ప్రాంతాన్ని ఐక్యరాజ్యసమితి పర్యవేక్షణలో బఫర్‌జోన్‌గా ఉంచారు. అక్కడికి ఎవరూ ప్రవేశించకూడదు. అయితే డిసెంబరు ఎనిమిది నుంచి ఇజ్రాయిల్ దళాలు అతిక్రమించి సిరియాలోకి చొచ్చుకుపోయాయి.

ఇప్పుడు సిరియా భవితవ్యం ఏమిటి? అంటే ఎవరూ ఏమీ చెప్పలేని స్థితి.అమెరికా కుట్రలకు వ్యతిరేకంగా దశాబ్దాలపాటు జోక్యం చేసుకున్న రష్యా రానున్న రోజుల్లో ఎలాంటి పాత్ర పోషించేది తెలియదు.నూతన పాలకులు టర్కీ కనుసన్నలలో పని చేసే అవకాశం ఉంది. నాటోలో అది అమెరికా అనుయాయి.అదే సమయంలో కొన్ని అంశాలలో దానితో విబేధించి రష్యాతో సంబంధాలు కలిగి ఉంది. సిరియా పరిణామాల్లో రష్యా, అమెరికా రెండూ తమ ప్రభావాన్ని చూపేందుకు ప్రయత్నించాయి. దాన్ని అదుపులోకి తెచ్చుకొనేందుకు అమెరికా పెద్దఎత్తున తిరుగుబాటుదార్లను ప్రోత్సహించింది.ఇటీవల జరిగిన పరిణామాలను చూసినపుడు సిరియాలో ఇంక అమెరికా చేసేది ఏముంది అని కొందరు నిరుత్సాహాన్ని ప్రకటించారు. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన 1990 దశకం తరువాత "ఆపరేషన్ టింబర్ సైకామోర్ " పేరుతో అమెరికా భారీ మొత్తాలను సిరియాలో కుమ్మరించిందని చెబుతున్నారు. ఉదారవాద తిరుగుబాటుదార్ల ముసుగులో 2013 నుంచి 2017వరకు నాలుగేండ్లలో అమెరికా సిఐఏ ద్వారా వివిధ సంస్థలకు వంద కోట్ల డాలర్లకు పైగా అందచేసిందని అంచనా. ఆ తరువాత కూడా తరతమ తేడాలతో ఇదే విధంగా తిరుగుబాటుదార్లకు చేరుస్తున్నది. అసద్ వ్యతిరేకులకు మద్దతుతో పాటు సిరియాలో అమెరికాను కూడా వ్యతిరేకించే శక్తులను దెబ్బతీసేందుకు చూసింది. అమెరికా మిలిటరీ కూడా 50 కోట్ల డాలర్లతో తిరుగుబాటుదార్లకు శిక్షణ, ఆయుధాలను అంద చేసింది. ఇవన్నీ ఘోరంగా విఫలమయ్యాయి. టర్కీ మద్దతు ఉన్న తిరుగుబాటుదార్లు డమాస్కస్‌ను పట్టుకుంటారని కూడా అమెరికా ఊహించినట్లు కనపడదు.లేదా నిస్సహాయంగా ఉండిపోయిందని చెప్పవచ్చు. అందుకే ట్రంప్ అందని ద్రాక్ష పుల్లన అన్నట్లుగా మాట్లాడుతున్నాడు.



> సిరియాలో అధికారాన్ని చేజిక్కించుకున్న హెచ్‌టిఎస్ సంస్థకు టర్కీ ప్రధాన మద్దతుదారుగా ఉంది. పరోక్షంగా ఇజ్రాయిల్ కూడా ఒక దశలో సాయం చేసిందని నిఘావర్గాలు చెబుతున్నాయి. అసద్ ప్రభుత్వం అణచివేతలకు పాల్పడిందనే విమర్శలు ఉన్నప్పటికీ అది ఇస్లామిక్ మత ఛాందసవాదాన్ని ప్రోత్సహించిన దాఖలాలు లేవు. ముస్లింలలో అనేక తెగలు ఉన్నాయి. అవి ఒక్కో ప్రాంతంలో కేంద్రీకృతమై ఉన్నాయి. వాటిలో కర్దులు ఒకరు. ఇస్లామిక్ తీవ్రవాద ఐసిస్, ఆల్‌ఖైదా కూడా అసద్‌ను వ్యతిరేకించాయి. వీటితో పాటు అమెరికా తనకు అనుకూలమైన శక్తులకు భారీఎత్తున సాయం చేసింది. అవేవీ అసద్ ప్రభుత్వాన్ని కదిలించలేక పోయాయి. సిరియాలో చమురు నిల్వలున్న ప్రాంతాల మీద అమెరికా ఆధిపత్యం ఉంది. అక్కడ దాని సైనికులు కూడా ఉన్నారు. గతంలోనే సిరియాలోని గోలన్ గుట్టల ప్రాంతాన్ని ఇజ్రాయిల్ ఆక్రమించింది.

ఒబామా గనుక కాస్త ముందుగా జాగ్రత్తపడి ఉంటే అసద్ తొలగింపు మరింత వేగిరం, అమెరికా ప్రమేయం కూడా ఉండేదని రణోన్మాదులు కొందరు నిష్ఠూరాలాడుతున్నారు. అమెరికా మద్దతిచ్చిన మిలిటెంట్ సంస్థలన్నీ అంతర్గత కుమ్ములాటలు, అవినీతి, గూండాయిజాలతో కొట్టుకు చచ్చాయని, ఆల్‌ఖైదాకు ఆయుధాలు అమ్ముకున్నట్లు విమర్శిస్తున్నారు. ఈ శక్తులు అసద్ మీద ఒత్తిడి తెచ్చి అంతర్జాతీయ సమాజంతో చర్చలకు నెడతాయని అమెరికా ఊహించినదానికి భిన్నంగా అసద్ బలమైన శక్తితో అనేక నగరాలను స్వాధీనం చేసుకున్నట్లు సిరియాలో మాజీ అమెరికా రాయబారి రాబర్ట్ ఫోర్డ్ చెప్పాడు. సిఐఏ మద్దతు ఇచ్చిన తిరుగుబాటుదార్లు ఒక బాల ఖైదీ తలనరికే వీడియోను చూసిన డోనాల్డ్ ట్రంప్ సిరియా మీద ఆసక్తి కోల్పోయాడని, అమెరికా మిలిటరీ తరువాత సిరియాలోని కర్దులకు మద్దతు ఇవ్వటంపై కేంద్రీకరించిందని చెబుతున్నారు.

అమెరికా నుంచి నిధులు పొందిన ఫ్రీ సిరియన్ ఆర్మీ వంటి సంస్థలు చివరకు టర్కీ అనుకూల సిరియన్ నేషనల్ ఆర్మీగా మారిపోయాయని, వారు కర్దులపై లైంగికదాడులు, దోపిడీలకు పాల్పడటంతో అదే అమెరికా చివరికి మానవహక్కులకు భంగం కలిగించారనే పేరుతో ఆంక్షలు విధించిందని అంటున్నారు. చివరికి నవంబరు చివరివారంలో ఈ శక్తులు లూటీలకు పాల్పడుతుండటంతో తాజాగా అధికారానికి వచ్చిన హెచ్‌టిఎస్ దళాలు వారిని అణచివేసి అరెస్టు చేశాయని, ఇలాంటి పనులు చేసిన తరువాత అమెరికాకు సిరియాలో ఇంక చేసేందుకు ఏమి మిగిలిందని ప్రశ్నిస్తున్నారు.ఈ విమర్శలన్నీ మరింత గట్టిగా వ్యవహరించలేదని, సిరియాను తమ అదుపులోకి తెచ్చుకోలేదని తప్ప పరాయి దేశంలో జోక్యం తప్పనే కోణం నుంచి కాదు. రాబోయే రోజుల్లో ఏమి జరిగినప్పటికీ అమెరికా డ్రైవర్ సీట్లో కూర్చొనే అవకాశం లేదని, చేసిన ఖర్చంతా వృధా అయిందని విమర్శిస్తున్నారు.

సిరియాలో అసద్ ప్రభుత్వాన్ని కూలదోయటంలో ఏకీభావంతో ఉన్న శక్తులన్నీ తరువాత అధికారాన్ని అలాగే పంచుకుంటాయని చెప్పలేకపోతున్నారు. లిబియాలో అమెరికాను వ్యతిరేకించిన గడాఫీ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు నాటో కూటమి దేశాలన్నీ తిరుగుబాటు శక్తులను ప్రోత్సహించాయి, తీరా 2011లో గడాఫీ సర్కారు కూలిపోయిన తరువాత ఇప్పటి వరకు అధికారం కోసం కుమ్ములాడుకుంటూనే ఉన్నాయి. అదే స్థితి సిరియాలో తలెత్తవచ్చని పరిశీలకులు చెబుతున్నారు. ఇప్పటికీ హెచ్‌టిఎస్‌ను ఉగ్రవాద సంస్థగా దాని నేత జొలానీ ఉగ్రవాదిగా వర్ణిస్తున్న అమెరికా రానున్న రోజుల్లో అతని నాయకత్వాన ప్రభుత్వం ఏర్పడితే ఎలా వ్యవహరిస్తుందన్నది ప్రశ్న.అతనికీ అదే పరిస్థితి.

ఈ సంస్థ రానున్న రోజుల్లో ఇరాన్‌తో చేతులు కలపవచ్చని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు అనుమానిస్తున్నాడు. అది గనుక తమపై దాడికి దిగితే ప్రతిస్పందన గట్టిగా ఉంటుందని, గత ప్రభుత్వానికి ఏమి జరిగిందో దీనికీ అంతే అని హెచ్చరించాడు. నూతన పాలకులతో రష్యా సంబంధాలు పెట్టుకోవచ్చని, ఇరాన్ కూడా అదే చేయవచ్చని కూడా పశ్చిమదేశాల పరిశీలకులు చెబుతున్నారు. సిరియాలో ఉన్న తమ సైన్యాన్ని వెనక్కు రప్పిస్తానని గతంలో డోనాల్డ్ ట్రంప్ చెప్పాడు. అయితే జనవరి 20న కొలువు తీరనున్న ట్రంప్ సర్కార్‌లో విదేశాంగ మంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న మార్కో రుబియో మాత్రం వేరుగా స్పందించాడు. రానున్న రోజుల్లో ఉగ్రవాద ముప్పు తలెత్తితే ఎదుర్కొనేందుకు అక్కడ తమ సైన్యం ఉండటం అవసరమని సెలవిచ్చాడు.సిరియాలో ఇప్పటికైతే పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది.

> సిరియాలో అసద్ ప్రభుత్వాన్ని కూలదోయటంలో ఏకీభావంతో ఉన్న శక్తులన్నీ తరువాత అధికారాన్ని అలాగే పంచుకుంటాయని చెప్పలేకపోతున్నారు. లిబియాలో అమెరికాను వ్యతిరేకించిన గడాఫీ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు నాటో కూటమి దేశాలన్నీ తిరుగుబాటు శక్తులను ప్రోత్సహించాయి, తీరా 2011లో గడాఫీ సర్కారు కూలిపోయిన తరువాత ఇప్పటి వరకు అధికారం కోసం కుమ్ములాడుకుంటూనే ఉన్నాయి. అదే స్థితి సిరియాలో తలెత్తవచ్చని పరిశీలకులు చెబుతున్నారు. ఇప్పటికీ హెచ్‌టిఎస్‌ను ఉగ్రవాద సంస్థగా దాని నేత జొలానీ ఉగ్రవాదిగా వర్ణిస్తున్న అమెరికా రానున్న రోజుల్లో అతని నాయకత్వాన ప్రభుత్వం ఏర్పడితే ఎలా వ్యవహరిస్తుందన్నది ప్రశ్న.

పెరుగుతున్న పట్టణ జనాభా - 'కాగ్' ఆందోళన

మన దేశంలో నగరాలు, పట్టణాలు సుస్థిర అభివృద్ధిని సాధించి అహ్లాదకర జీవనానికి ఉపాధి, ఉద్యోగాల కల్పనకు నెలవులుగా బాసిల్లాల్సి ఉంది. కానీ ప్రభుత్వాల అలక్ష్యం, పట్టణ స్థానిక సంస్థ దౌర్బల్యం, యంత్రాంగం ఉదాసీనత, వ్యవస్థీకృత అవినీతి మూలంగా ఇవి జీవకళను కోల్పోతున్నాయి. ఒకవైపు ఆదాయాల కొరత, మరో వైపు కిక్కిరిసిన జనసాంద్రతతో పట్టణాలు, నగరాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. వీటికి తోడ్పాటునందించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదాయాన్ని పెంచుకునే మార్గాలు, రాజ్యాంగం ద్వారా కల్పించ బడిన అధికారుల విభజన, స్వేచ్ఛ కల్పించాలి. బడ్జెట్‌లో నిధులు, వాటాలు పెంచాలి. తద్వారా మౌలిక వసతుల కల్పన పెరుగుతుంది. వ్యవస్థాగత నిర్లక్ష్యం మూలంగా చెరువులు,నాళాలు కబ్జాల కారణంగా వానాకాలంలో కొద్దిపాటి వర్షాలకే వరద నీరు ముంచెత్తడంతో పట్టణాలు,నగరాలు జనావాసాలకు వరద నీరు ముంచేస్తుంది. దీంతో కాలనీలు, రోడ్లు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న అక్రమ నిర్మాణాలు, నాలాల ఆక్రమణలతో పట్టణ, నగర ప్రజల్ని ఎప్పుడు ఎక్కడ ఎలాంటి ప్రమాదం జరుగుతుందో అనే అంతుపట్టని వాతావరణం కనిపిస్తుంది. ఇటీవల హైదరాబాద్‌లో ఓ బాలుడు నాలలో పడి శవమై తేలాడు. ఇలాంటి ఘటనలు ప్రతి ఏడాది ఏదో ఓచోట జరుగుతూనే ఉన్నాయి. బాధిత కుటుంబాలకు కన్నీళ్లే మిగులుస్తున్నాయి.ప్రణాళిక బద్ధమైన పట్టణీకరణతోనే ప్రజా జీవితాలు మెరుగుపడటంతో పాటు ప్రగతి ప్రస్థానం చురుగ్గా ముందుకు



సాగుతుంది. పర్యావరణాన్ని దెబ్బతీయని రీతిలో వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ, సంపదను సృష్టించడం తద్వారా అభివృద్ధికి నాందిగా మారుతాయి. అంతే కాదు, దేశంలోని గ్రామీణ ప్రజల జీవితాలు ఆర్థిక ఒడిదుడుకులతో ఉద్యోగ, ఉపాధి అవ కాశాల అన్వేషణలో పట్టణాల, నగరాల బాట పడుతున్న వారి సంఖ్య నానాటికి పెరిగిపోతోంది. ఈ వలసలతో పట్టణ భారతం జనాభా రాబోయే కాలంలో 90 కోట్లకు చేరుతుందని పరిశీలనలు వెల్లడిస్తున్నాయి. ఈ క్రమంలో పట్టణాల, గ్రామాల మధ్య అభివృద్ధిలో సమతూకం పాటించాలి. పట్టణా(నగరా)ల్లో పెరుగుతున్న జనాభా తగినట్లుగా వసతుల కల్పనపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలి.

దేశవ్యాప్తంగా నగర, పట్టణ స్థానిక సంస్థల్లో పరిస్థితులపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఆందోళన వ్యక్తం చేస్తుంది. వనరులకు వ్యయానికి మధ్య తీవ్ర అంతరాన్ని కాగ్ ఎత్తి చూపింది. దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాల్లోని పట్టణ స్థానిక సంస్థల్లో ఈ అంతరం 42 శాతంగా ఉందని గుర్తించింది. ఇవి చేసే వ్యయంలో 29శాతం మాత్రమే ప్రణాళిక బద్ధమైన అభివృద్ధి పనికి వెళ్తున్నదని వివరించింది. వీటిలో పనిచేసే సిబ్బందిలో సగటున 37శాతం ఖాళీలు ఉన్నాయి.రెండు తెలుగు రాష్ట్రాలతో సహా 18 రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి ఉంది. మనదేశంలో పట్టణ స్థానిక సంస్థల అధికారాన్ని కల్పించే 74వ రాజ్యాంగ సవరణ 1993లో అమల్లోకి వచ్చింది. అయితే, 31 ఏండ్ల తర్వాత కూడా ఈ 18 రాష్ట్రాలు ఈ చట్టాన్ని పూర్తిగా అమలు చేయడం లేదని కాగ్ గుర్తించింది. 18 రాష్ట్రాల్లో 74 వ రాజ్యాంగ సవరణ అమలు విషయంలో ఆడిట్ నివేదికల పోలికలను కాగ్ ఇటీవల విడుదల చేసింది. తెలంగాణ, ఏపీలతో పాటు అస్సాం, ఛత్తీస్‌గఢ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, కేరళ, కర్నాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, మణిపూర్, ఒడిస్సా, పంజాబ్, రాజస్థాన్, తమిళ నాడు, త్రిపుర, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని మొత్తం 393 పట్టణ స్థానిక సంస్థ(యూఎల్‌ఎస్ జీ)లను ఇది కవర్ చేసింది. కాగ్ సమాచారం ప్రకారం.. పట్టణ సంస్థలు సగటున 32శాతం రెవెన్యూ సొంతంగా సమకూర్చుకుం టున్నాయి. మిగతాది, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వస్తుంది. పదహారు రాష్ట్రాల్లోని పట్టణ సంస్థలకు నియామకాల విషయంలో ఎలాంటి అధికారం లేకపోవడం గమనార్హం.

74వ రాజ్యాంగ సవరణ ప్రకారం రాష్ట్రాలు.. పట్టణ స్థానిక సంస్థలకు పద్దెనిమిది పనుల్ని పంపిణీ చేయాలి. అందులో పట్టణ ప్రణాళిక, భూమి విని యోగం, నిర్మాణ నియంత్రణ, నీటి సరఫరా, ఆర్థిక, సామాజిక అభివృద్ధి ప్రణాళిక, ప్రజారోగ్యం వంటివి ఇందులో ఉంటాయి. నాలుగు మాత్రమే పూర్తిగా స్వయం ప్రతిపత్తితో ఉన్నాయని కాగ్ పేర్కొన్నది. ప్రణాళిక వంటి కీలకమైన విధుల్లో రాష్ట్రాలు పట్టణ స్థానిక సంస్థలను భాగస్వామ్యం చేయాలని కాగ్ సిఫారసు చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇన్నాళ్ల నిర్లక్ష్యం, రాజకీయ గ్రహణం వీడాలి. రోజురోజుకూ పెరిగిపోతున్న పట్టణ జనాభాకు ప్రణాళికాబద్ధమైన ప్రగతి చాలా అవసరమన్నది గుర్తించాలి.

మేకిరి దామోదర్, 9573666650

రాజకీయ నియంతృత్వానికే 'జమిలీ'!



షేక్ కరిముల్లా
9705450705

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశం భారత్. గతంలో స్వేచ్ఛాయుతంగా, సమయానికి ఎన్నికలు సక్రమంగా జరిగేవి. రాను రానూ ఎన్నికల వ్యవస్థ ఒక తంతుగా మారి నవ్వుల పాలైంది. ఈవీఎంల ట్యాంపరింగ్ నుంచి మొదలుకుంటే ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రాజ కీయ పార్టీలకు అందుతున్న విరాళాలు, దానిమీద పార్లమెంట్ ఎన్నికల ముందు రేగిన దుమారం, ఓటుకు నోటు, ఎన్నికల వేళ పంచుతున్న డబ్బులు, పాలకవర్గాలు చేస్తున్న అధికార దుర్వినియోగం అంతా ఇంతా కాదు. పైగా కులం, మతం, దేవుడు, ప్రాంతం, భాష అంశాలతో ప్రజలను మభ్య పెట్టడం, విద్వేషాలు రెచ్చగొట్టడం మామూలై పోయింది. ఇలా అన్ని రాజకీయ పార్టీలు పూర్తిగా పతనమైపోయాయి. వామ పక్షాలొక్కటే ప్రజలకు సరైన దారిదీపంగా వెలుగొందుతున్నాయి. అయితే సరైన ప్రత్యామ్నాయ ప్రజా రాజకీయాలను గుర్తించని ప్రజలు కార్పొ రేట్ శక్తులకు కొమ్ముకాసే పార్టీలనే మారుస్తూ ఎన్ను కుంటూ వస్తున్నాయి. కానీ, రేపటి రోజుల్లో దాని క్కూడా అవకాశం లేకుండా ఏకఛత్రాధిపత్య పాలన సాగే అవకాశాలే మెండుగా కనిపిస్తున్నాయి. మరి ఇలాంటి నియంతృత్వ విధానాలకు అడ్డుకట్ట వేయలేమా?

నేడు దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. దేశంలో ప్రతిపక్షమే లేకుండా చేసే వ్యవస్థను సృష్టించటం కోసం బీజేపీ ఎప్పటి నుంచో ప్రయత్నిస్తున్నది. ఇందుకు తాజా ఉదాహరణే జమిలీ ఎన్నికలు. కిందపడ్డా నాదే పై చేయి అన్నట్టుగా ఉంది మోడీ ప్రభుత్వ తీరు. ఏకపక్ష, నిరంకుశ విధానాలు ఇక చెల్లవంటూ 2019 గెలిచిన 303 స్థానాల నుంచి 63 స్థానాలు కోతపెట్టి 240 స్థానాలకు పరిమితం చేసినా, ప్రాంతీయ పార్టీలపై ఆధార పడి ప్రభుత్వం ఏర్పాటు చేసినా పాలనాపరమైన నిరంకుశ విధానాలు ఈ పార్టీ అనుసరిస్తూనే ఉంది. ప్రజల మౌలిక అవసరాలైన ధరలు, పేదరికం, నిరుద్యోగం, నాణ్యమైన విద్య, వైద్యం అందించే విషయంలో ఏంచేయకుండా ప్రజలకు కష్టాలు, కన్నీళ్లు మిగిల్చింది. ఈ ప్రజల ప్రధాన సమస్యల నుంచి పక్కదారి పట్టించటానికి జిమ్మిక్కులు, ఎత్తులు వేయడం చేస్తూనే ఉంది. భిన్న సంస్కృతులు, బహుళత్వం గల ఈ దేశంలో ఒకే మతం, ఒకే రకమైన పన్ను, ఒకే రకమైన తిండి తినాలని, ఒకే భాష (హిందీ) ఉండాలని మొత్తం ప్రజల సంస్కృతిపైనే దాడిచేస్తోంది. ఇప్పుడు ఆచరణా సాధ్యం కాని, అవసరం లేని ఒకే దేశం, ఒకే ఎన్నిక అంటూ జమిలీ ఎన్నికలకు శ్రీకారం చుట్టింది. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆధ్వర్యంలో కమిటీ వేయడం, ఆ కమిటీ కొద్దికాలంలోనే 'బాగా కష్టపడి' 18వేల పేజీల నివేదిక సమర్పించడం, దీనికి కేబినేట్ ఆమోదం తెలపడం చకచకా జరిగిపోయాయి.

దేశంలో 47రాజకీయ పార్టీలలో 32 పార్టీలు జమిలీ ఎన్నికలకు అనుకూలత తెలిపాయని, 21వేల సూచనలు అందాయని, అందులో 81శాతం మంది జమిలీ ఎన్నికలను సమర్థించాయని కమిటీ చెబుతున్నది. దేశంలో ఉన్న ఓటర్ల సంఖ్యతో పోలిస్తే ఈ సూచనలు చేసిన 21వేల మంది అభిప్రాయానికి ఏ మాత్రం విలువ ఉంటుందో కమిటీయే చెప్పాలి. ఏడు దేశాల్లో జమిలీ



ఎన్నికల గురించి అధ్యయనం చేశామని చెప్పింది. తొలిదశలో లోక్‌సభ, శాసన సభలకు ఒకేసారి ఎన్నికలు జరిపి, రెండో దశలో పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్లకు వంద రోజుల వ్యవధిలో ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పింది. ఈ జమిలీ ఎన్నికల అమలుకు కనీసం ఆరు రాజ్యాంగ సవరణలు చేయ వలసి ఉంటుందని చెప్పింది. 1951 ప్రజా ప్రాతినిధ్య చట్టానికి సవరణలు చేయడంతో పాటు, లోకసభ, రాజ్యసభ కాలపరిమితిని నిర్ణయించే 83వ ఆర్టికల్, రాష్ట్రాల శాసనసభల కాలపరిమితి నిర్ణయించే 172వ ఆర్టికల్, ఎన్నికల సంఘం అధికారులకు సంబంధించిన 324వ ఆర్టికల్, స్థానిక పంచాయతీరాజ్‌కు సంబంధించిన ఆర్టికల్స్ 243 కె, 243జెడ్, ఏలను కూడా సవరించాలని సూచించింది. ఈ రాజ్యాంగ సవరణలు జరగాలంటే లోక్‌సభ, రాజ్యసభలలో రెండు బై మూడోవంతు మెజార్టీతో ఆమోదించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉభయ సభల్లో బీజేపీకి ఉన్నబలం సరిపోదు. స్థానిక సంస్థల రాజ్యాంగ సవరణలకు సగం రాష్ట్రాల శాసనసభలు ఆమోదించాల్సి ఉంటుంది. ఇదంతా సాధ్యమయ్యే పనేనా?

స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో అంటే 1952, 1957, 1962లలో జమిలీ ఎన్నికలు జరిగాయి. అప్పుడు కేంద్ర, రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యత కొనసాగింది. 1967 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఎనిమిది రాష్ట్రాలలో ఓటమి చెందింది. తదుపరి చాలా రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి వచ్చాయి. 1989 నుంచి 2014 వరకు కేంద్రంలో, రాష్ట్రాలలో ప్రస్తుతం ఇప్పుడు కూడా సంకీర్ణ (కూటమి) ప్రభుత్వాలు నడుస్తున్నాయి. దేశంలోని భిన్న సంస్కృతులు, చారిత్రక పరిస్థితుల రీత్యా బహుళ పార్టీలు మనుగడలో ఉన్నాయి. ఈ తరుణంలో జమిలీ ఎన్నికలు ఆచరణలో సాధ్యం కాదు. గతంలో 1989, 1996, 1998లలో కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడి కీచులాడుకుని ముందే రద్దయ్యాయి. జమిలీ ఎన్నికల వ్యవస్థలో దీనికి సమాధానం లేదు. ఎన్నికల తదనంతరం లోక్‌సభ, శాసనసభలు ముందే రద్దయితే పరిస్థితి ఏమిటి? రాజ్యాంగంలో 83వ ఆర్టికల్ లోక్‌సభ, 172వ ఆర్టికల్ శాసనసభలు ముందే రద్దు కావటానికి అవకాశమిచ్చాయి కదా? ఏదైనా జమిలీ ఎన్నికల ప్రక్రియ మొత్తం రాజ్యాంగ సమాఖ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధంగా ఉంది. రాజ్యాంగంలో ఒకటవ నిబంధన భారతదేశాన్ని రాష్ట్రాల యూనియన్‌గా పేర్కొంది. కేంద్రంతో పాటు రాష్ట్రాలు కూడా బలంగా సమాఖ్య స్ఫూర్తితో మెలగాలని రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ సూచించారు. ఈ జమిలీ ఎన్నికల ద్వారా బీజేపీ సమాఖ్య విధానాన్ని దెబ్బకొట్టి ఏకపార్టీ (బీజేపీ) నియంతృత్వం కోసం పాకులాడుతోంది. అన్ని రాష్ట్రాలలో బీజేపీ మాత్రమే అధికారంలో ఉండాలని కలలు కంటూ నిరంకుశ పోకడలు పోతున్నది. భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయాలని పథకం పన్నుతున్నది.

ఆది నుంచి బీజేపీ మాతృసంస్థ ఆరెస్సెస్ ప్రజాస్వామిక, లౌకిక విలువలకు, రాజ్యాంగానికి విరుద్ధంగా నడుస్తున్నది. దీని పుట్టుకలోనే ఆ స్వభావం ఉంది. 1947 ఆగస్టులో త్రివర్ణ జాతీయ జెండాను గౌరవించబోమని ఆరెస్సెస్ ప్రకటించింది. నాగపూర్‌లోని తమ కేంద్ర కార్యాలయంపై 2002 వరకు జాతీయ జెండాను కూడా ఎగురవేయలేదు. ఇప్పుడు ఈ 'అపరదేశభక్తులే' మొన్న ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'హర్ ఘర్ తిరంగ' అంటూ ప్రతి ఇంటిపై జాతీయజెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. అలాగే 1949 నవంబర్‌లో మనుస్మృతి తప్పితే అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని అంగీకరించమని ప్రకటించారు. 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజ్యాంగాన్ని మారుస్తామని ప్రకటిస్తూనేవున్నారు. ఇలా చాపకింద నీరులా భిన్నత్వంలో ఏకత్వంగా కలిసిమెలిసి ఉండే ప్రజల్ని మొత్తంగా హిందూ దేశంగా విభజించాలని చూస్తున్నారు. ఏదైనా ప్రజలేచరిత్ర నిర్మాతలు. వీరి నియంతృత్వ విధానాలను అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రగతిశీల, లౌకికవాద శక్తులు, ప్రజలపై ఉంది. ఈ ఆగడాలపై పౌరసమాజంలో చర్చ జరగాలి. వీరి నిరంకుశతత్వాన్ని తిప్పికొట్టాలి. రాజ్యాంగాన్ని, లౌకిక ప్రజాస్వామ్య విలువలను రక్షించుకోవాలి.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
5
బుధవారం డిసెంబర్ 18, 2024 www.navatelangana.com

'కాసుల' రమణ అవినీతిపై చర్యలు షురూ

- కొట్టేసిన సొమ్ము 'రికవరీ'కి ఆదేశాలు



నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామ పంచాయతీ కార్యదర్శి (గ్రేడ్-3) ఎంపీ రమణ అలియాస్ కాసుల రమణపై అవినీతి ఆరోపణలు రుజువయ్యాయి. రఘునాథపాలెం మండలం పాపటపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన సమయంలో ఆయన చేసిన అవినీతికి అడ్డూఆదుపూ లేకుండా పోయింది. వెంకట రమణ అవినీతిపై గ్రామస్తులు జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేయడంతో ఎంపీవో శ్రీనివాసరెడ్డి గ్రామంలో మూడు రోజుల పాటు విచారణ నిర్వహించిన విషయం విధితమే. ఈ విచారణలో వెంకటరమణ అవినీతికి పాల్పడినట్లు రుజువైంది. దీంతో ఎంపీవో విచారణకు సంబంధించిన నివేదికను జిల్లా పంచాయతీ అధికారికి నివేదించారు.

అవినీతి ఆరోపణలు ఇలా

గ్రామంలో కొత్తగా పెళ్లైయిన జంటలకు వివాహ ధ్రువీకరణ పత్రాలను జారీ చేసేందుకు వారినుంచి భారీగా వసూళ్లకు పాల్పడినట్లు నిరూపితమైంది. గ్రామంలో నూతన గృహ నిర్మాణాలకు అనుమతులు జారీచేసే విషయంలో ఇంటి యజమానుల నుంచి భారీగా ముడుపులు పుచ్చుకున్నట్లు తేలింది. పంచాయతీరాజ్ చట్టం 2018కి వ్యతిరేకంగా విధుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహించినట్లు అధికారులు గుర్తించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడం లోనూ తీవ్రమైన నిర్లక్ష్యం వహించడంతో పాటు ప్రజాపాలన ఉద్దేశాన్ని నీరుగార్చినట్లు గుర్తించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో పాపటపల్లి గ్రామంలో వసూలు చేసిన ఇంటి, వివిధ రకాల పన్నులు రూ. 29,079 పంచాయతీ జనరల్ ఫండ్‌కు జమచేయలేదని గుర్తించారు. ఈ సొమ్మును వడ్డీతో సహా కాసుల రమణ నుంచి రికవరీ చేయాలని అధికారులు నిర్ణయించారు.

కఠిన చర్యలు తీసుకొనే అవకాశం...?

కిష్టారం గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటరమణపై ఇప్పటికే ఉన్నతాధికారులు ఛార్జెస్ ఫ్రేమ్ చేశారు. ఈ ఆరోపణల నేపథ్యంలో తీవ్రస్థాయిలో కఠినమైన చర్యలు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. గతంలోనూ అనేక ఆరోపణలతో సస్పెండ్ అయిన ఎంపీ రమణను ఇక విధుల నుంచి పూర్తిస్థాయిలో తొలగించే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.



పనిచేయడం ఇష్టం లేకుంటే సెలవుపై వెళ్లండి

- విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు
- గైర్హాజరైన వైద్యుల పట్ల ఆగ్రహం
- పీహెచ్‌సీ వైద్యులపై చర్యలు తీసుకోవాలని
- డీఎంఅండ్‌హెచ్‌ఓకు కలెక్టర్ ఆదేశం

నవతెలంగాణ-ఖమ్మం

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, పనిచేయడం ఇష్టం లేకపోతే సెలవుపై వెళ్లాలని, అనవసరంగా ప్రజలను ఇబ్బంది పెట్టవద్దని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మంగళవారం రఘునాథపాలెం మండలం మంచుకొండ పిహెచ్‌సిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంచుకొండ పిహెచ్‌సికు మధ్యాహ్నం మూడు గంటలకు చేరుకున్న కలెక్టర్ 15 మంది సిబ్బందికి గాను కేవలం ముగ్గురు ఉండటాన్ని గమనించారు. డ్యూటీ టైంలో ఇద్దరు డాక్టర్లు ఆస్పత్రిలో గైర్హాజరు కావడాన్ని కలెక్టర్ తీవ్రంగా పరిగణిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రి విధులలో ఉండాల్సిన డాక్టర్లు ఎక్కడ ఉన్నారంటూ కలెక్టర్ అక్కడ సిబ్బందిని ప్రశ్నించారు. వైద్యులతో ఫోన్‌లో మాట్లాడిన కలెక్టర్ పని చేయడం ఇష్టం లేకపోతే సెలవుపై వెళ్లాలని, అనవసరంగా ప్రజలను ఇబ్బందులకు గురి చేయవద్దని, ప్రభుత్వ ఆసుపత్రిని నమ్మి వచ్చే పేదల పరిస్థితి గురించి ఆలోచించక పోవడం విధుల పట్ల స్పష్టమైన నిర్లక్ష్య వైఖరి అని కలెక్టర్ అన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీఎంహెచ్ఓను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా పీహెచ్సీలలో డ్యూటీ పీరియడ్‌లో వైద్యుల హాజరును డీఎంహెచ్ఓ నిరంతరం పర్యవేక్షించాలని, డ్యూటీ పీరియడ్‌లో వైద్యులు తప్పనిసరిగా ఆసుపత్రులలో అందుబాటులో ఉండాలని అన్నారు.



పెన్షనర్లకు సముచిత స్థానం కల్పించాలి

- పెన్షన్‌తో ఉల్లాసవంతమైన జీవితం గడపాలి
- తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణం నాగేశ్వరరావు, నాయకులు ఎం.సుబ్బారావు

నవతెలంగాణ-ఖమ్మం

పెన్షనర్లకు సముచిత స్థానం కల్పించాలని, పెన్షన్‌తో ఉల్లాసవంతమైన జీవితం గడపాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణం నాగేశ్వరరావు, నాయకులు ఎం.సుబ్బారావు అన్నారు. మంగళవారం ఖమ్మంలోని మంచికంటి భవనంలో జాతీయ పెన్షనర్స్ దినోత్సవం ఎల్.గోపీచంద్ అధ్యక్షత జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ జీవితకాలం మొత్తం ఉరుకులు, పరుగులతో జీవితం గడుపుతూ సుమారు 30 సంవత్సరాలకు పైగా ప్రభుత్వ రంగంలో విశిష్ట సేవలందించిన ఉద్యోగులు ఉద్యోగ విరమణ పొంది తమకు లభించే పెన్షన్‌తో ఉల్లాసవంతమైన జీవితం గడపాలని అన్నారు. కొద్దిమంది తమ జీవిత భాగస్వామితో తీర్థయాత్రలకు ప్రయాణం సిద్ధం చేసుకుంటారని, మరికొంత మంది సామాజికసేవా కార్యక్రమంలో పాల్గొంటూ పొరుగువారికి సేవ చేయడంలో నిమగ్నమౌతారని అన్నారు. కానీ ప్రస్తుతం పెన్షనర్ పదవీ విరమణ పొందినా రావల్సిన ఆర్థికపరమైన లావాదేవీలు సంవత్సరాల కొద్దీ రాని పరిస్థితి ఈ క్రమంలోనే నేడు జాతీయ పెన్షనర్స్ దినోత్సవం జరుపుకోవడం శోచనీయమన్నారు. ఈ రోజు పెన్షనర్లు అందరూ పెన్షన్ పొందుతూ వారి శేష జీవితాన్ని హాయిగా గడుపుతున్నారంటే ఒక వ్యక్తిని ఈ సందర్భంలో స్మరించుకోవల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని, ఆయనే డి.ఎస్.నకారా అన్నారు. ప్రజల ద్వారా వసూలు చేసిన పన్నులు, ప్రభుత్వానికి కలిగే ఆదాయం కార్పొరేట్ శక్తులకు పోతుందని, ఇటువంటి విధానాలలో మార్పు తీసుకురావాలంటే ప్రజలు పోరాటాలు చేయాలని, అదే క్రమంలో మధ్య తరగతి ఉద్యోగులు, ప్రజలు దీనిపై దృష్టి సారించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణం నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు నెల్లూరి వీరబాబు, లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర బాధ్యులు విద్యాసాగర్, సీనియర్ నాయకులు శ్రీరాములు, వై.శ్రీనివాస్‌రావు, మధు, రంగారావు, ఘూన్సీ, రాములమ్మ, టిఎస్.రావు, భాస్కర్‌రావు, సిహెచ్.భాస్కర్‌రెడ్డి, గణపతి, రాజేంద్రప్రసాద్, కృష్ణారావు, కె.వెంకట్రామారావు, భారతి, పద్మ కుమారి, జి.ఉపేందర్, కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సీఎం కప్ కబడ్డీ పోటీలకు ఎంపిక

- క్రీడల దాత యరమల పూర్ణచంద్రారెడ్డి అభినందనలు



నవతెలంగాణ-ఎర్రుపాలెం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సీఎం కప్ క్రీడా పోటీలలో మండల కేంద్రమైన ఎర్రుపాలెం గ్రామానికి చెందిన సిహెచ్ చంద్రకళ, గురుకుల పాఠశాల విద్యార్థిని విద్య శ్రీచందన రాష్ట్రస్థాయిలో నిర్వహించే సీఎం కప్ కబడ్డీ పోటీలకు విద్యార్థులు ఎంపికైనట్లు మండల అభివృద్ధి అధికారి సురేందర్ మంగళవారం తెలిపారు. డిసెంబర్ చివరి వారంలో సీఎం కప్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు జరుగనున్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లా స్థాయి పోటీలలో తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులకు తాసిల్దార్ మన్నే ఉషాశారద, మండల విద్యాశాఖ అధికారి మురళీమోహన్‌రావు, క్రీడల దాత కెపిఆర్ అధినేత యరమల పూర్ణచంద్రారెడ్డి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వ్యాయామ ఉపాధ్యాయులు జమలయ్య, శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణరెడ్డి, సాంబశివరెడ్డి, నాగేశ్వరరావు, అజీమ్, అశ్విత, వేణు తదితరులు అభినందనలు తెలిపారు.

'ఎరుపు' పిలుపు

"ఎర్రజెండా పిలుస్తోంది.. సీపీఐ(ఎం) స్వాగతం పలుకుతోంది. కమ్యూనిస్టు ఉద్యమ బలోపేతమే లక్ష్యంగా సత్తుపల్లి కేంద్రంగా బుధ, గురువారాల్లో ఖమ్మం జిల్లా 22వ మహాసభలు నిర్వహించేందుకు సిద్ధమైంది. గత మూడు, నాలుగు మాసాలుగా శాఖల నుంచి డివిజన్ మహాసభల వరకు నిర్వహించి.. ఉద్యమ కార్యాచరణ రూపొందించుకున్న పార్టీ జిల్లా మహాసభలు సిద్దారం రోడ్డులోని లక్ష్మీప్రసన్న హాల్ వేదికగా నేడు, రేపు కొనసాగనున్నాయి."

- నేడు, రేపు సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా 22వ మహాసభలు
- సత్తుపల్లిలో పుల్లయ్యనగర్ దుర్గాదేవి ప్రాంగణంలో నిర్వహణ
- హాజరుకానున్న 600 మందికి పైగా ప్రతినిధులు, పరిశీలకులు
- మండలాలకు కొత్తరక్తం...డివిజన్ కమిటీల పునరుద్ధరణ
- అన్ని శాఖల్లోనూ మహిళలు, ఎస్సీ, ఎస్టీ, యూత్‌కు రిజర్వేషన్
- కమ్యూనిస్టు ఉద్యమ బలోపేతమే లక్ష్యంగా సభలు



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ సత్తుపల్లి

ఎర్రజెండా ఉద్యమాలకు పుట్టినిల్లైన ఖమ్మం జిల్లా సీపీఐ(ఎం) 22వ మహాసభలు సత్తుపల్లి సిద్దారం రోడ్డులోని లక్ష్మీప్రసన్నహాల్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సత్తుపల్లి డివిజన్ మాజీ కార్యాదర్శి మోరంపుడి పుల్లారావు నగర్, ఐద్వా ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శి కొండపల్లి దుర్గాదేవి ప్రాంగణాన్ని అరుణవర్ణ శోభితంగా తీర్చిదిద్దారు. ఈ మహాసభలకు 600 మందికి పైగా ప్రతినిధులు, పరిశీలకులకు పిలుపు అందింది. డివిజన్, మండల, వివిధశాఖల నుంచి మహాసభల డెలిగేట్స్‌ను ఎంపిక చేశారు. ఈ మహాసభల పరిశీలకులుగా సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కార్యదర్శివర్గ సభ్యులు బి.వెంకట్, పోతినేని సుదర్శన్, సాయిబాబు హాజరవుతున్నారు. కమ్యూనిస్టు ఉద్యమ బలోపేతమే లక్ష్యంగా మహాసభలు నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. మహాసభల సందర్భంగా బస్టాండ్ సమీపంలోని పార్టీ డివిజన్ కార్యాలయం రావి వీరవెంకయ్య భవనం నుంచి మహాసభల వేదిక వరకు ఎర్రకవాతుతో ప్రదర్శన నిర్వహిస్తారు.

కొత్తరక్తం...డివిజన్‌శాఖల పునరుద్ధరణ

2016లో కొత్త జిల్లాల ఆవిర్భావం తర్వాత రద్దయిన డివిజన్ కమిటీలను ఈ ఏడాది పునరుద్ధరించారు. ఖమ్మం- వై.విక్రమ్, పాలేరు- బండి రమేశ్, వైరా- భూక్యా వీరభద్రం, మధిర- మడుపల్లి గోపాలరావు, సత్తుపల్లి- శీలం సత్యనారాయణరెడ్డి డివిజన్ కార్యదర్శులుగా ఎన్నికయ్యారు. వీరితో పాటు ఈసారి 28 మండల, పట్టణ కమిటీల్లో అధికం కొత్తరక్తంతో నింపారు. ఖమ్మం వన్‌టౌన్- ఎస్కే నాగుల్‌మీరా, ఖమ్మం రూరల్- ఊరడి సుదర్శన్‌రెడ్డి, ఎర్రుపాలెం - ప్రభాకర్, మధిరటౌన్- పడకంటి మురళి, బోనకల్- కిలారి సురేష్, చింతకాని -రాచబంటి రాము, కూసుమంచి- తోటకూరి రాజశేఖర్, వైరా రూరల్- బాణాల శ్రీనివాసరావు, వైరా టౌన్- చింతనిప్పు చలపతిరావు, సత్తుపల్లి రూరల్- జాజిరి జ్యోతి ఇలా పదిమంది మండల, పట్టణకార్యదర్శులు కొత్తగా ఎన్నికయ్యారు. గ్రామశాఖ నుంచి జిల్లాశాఖ వరకు పార్టీ నిర్ణయం మేరకు మహిళలు, ఎస్సీ, ఎస్టీలకు 15% చొప్పున, యువతకు 10% మొత్తంగా 40% రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. మొత్తం జిల్లావ్యాప్తంగా 516 శాఖల మహాసభలు, ఏడు పట్టణ, 21 మండల కమిటీలు ఏర్పాటు చేశారు. గ్రామ, మండలస్థాయిలో ప్రజాసంఘాల బలోపేతమే ఈ మహాసభల్లో ఓ లక్ష్యంగా తీసుకున్నారు.



మహాసభల కోసం...

మహాసభల కోసం సత్తుపల్లి డివిజన్, టౌన్ కమిటీలు విశేషంగా కృషి చేశాయి. ఆహ్వానసంఘం ఏర్పాటై విరాళాలు సేకరించింది. ప్రతినిధులకు కమిటీ ఆధ్వర్యంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. దాదాపు రెండున్నర దశాబ్దాల తర్వాత సత్తుపల్లిలో సీపీఐ(ఎం) మహాసభలు నిర్వహిస్తుండటంతో పార్టీ శ్రేణులు ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేశాయి.

మహాసభ టూ మహాసభ..

ప్రతీ మూడేళ్లకోసారి గ్రామ శాఖల నుంచి జాతీయస్థాయి వరకు దేశవ్యాప్తంగా నూతన కమిటీలు ఏర్పాటు చేసే ఆనవాయితీని సీపీఐ(ఎం) నిరాటంకంగా కొనసాగిస్తోంది. ఖమ్మం జిల్లాలో 21వ మహాసభ నుంచి 22వ మహాసభ వరకు 28 మండల కమిటీలుంటే 24 చోట్ల స్టడీ సర్కిల్స్ నిర్వహించారు. జిల్లా కేంద్రంలో బీవీకే ఆధ్వర్యంలో 15 ఏళ్లుగా స్టడీ సర్కిల్స్ ప్రతీ ఆదివారం నిర్వహిస్తున్నారు. జిల్లా, డివిజన్ కేంద్రాలు, మండలస్థాయిలో పొలిటికల్ క్లాసులు బోధించారు. స్టడి సర్కిల్స్ నిర్వహణలో ఖమ్మం జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా ఉంది. ఫలితంగా పత్రికలకు వ్యాసాలు, అనువాదాలు రాసే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది.

పోరాటాలకు పోరాటాలు.. సేవకు సేవ...

సీపీఐ(ఎం) అంటే ఉద్యమాలు, పోరాటాలే కాదు...మానవతా విలువలు, సేవా తత్పరత కూడా. అందుకే గత తొమ్మిదేళ్లుగా ప్రతినెలా వైద్యశిబిరాలు నిర్వహిస్తోంది. దీర్ఘకాలిక వ్యాధులు, క్యాన్సర్, హృద్రోగ అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. ప్రతీనెలా ఉచిత కంటి వైద్యశిబిరాలు చేపడుతోంది. రూ.100కు రూ.2వేలకు పైగా విలువ చేసే మందులను అందిస్తోంది. రూ.30కే రక్తపరీక్షలు నిర్వహిస్తున్నారు. ఖమ్మం టూటౌన్ కమిటీ బోడేపూడి విజ్ఞాన కేంద్రం, ఖమ్మం త్రీటౌన్‌లో డాక్టర్ యలమంచిలి రాధాకృష్ణ పేరుతో, ఖమ్మం రూరల్‌లో తమ్మినేని సుబ్బయ్య భవన్, వైరా, మధిరలో బోడేపూడి కళా మందిర్, నేలకొండపల్లిలో నూతక్కి గంగాధర్ పేరిట మొత్తం ఆరు శిబిరాలు కొనసాగుతున్నాయి. సత్తుపల్లిలోనూ త్వరలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వైరా, ఖమ్మంలో ప్రతినెలా 500-800 మందికి పైగా మంది వైద్యశిబిరాలకు హాజరవుతున్నారు. ఇప్పటి వరకు దాదాపు రూ.26 లక్షలకు పైగా విలువ చేసే మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఇటీవల ఖమ్మంలో వరదలు సంభవించినప్పుడు ధన, ప్రాణహాని జరగకుండా సీపీఐ(ఎం) కార్యకర్తలు చూపించిన తెగువ కనీవినీ ఎరుగనిది. వరద బాధితులకు బియ్యం, నిత్యావసర వస్తువులతో పాటు ఏడువేల మందికి పాతదుస్తులు సైతం సమకూర్చి పోరాటాలే కాదు సర్వీసులోనూ సీపీఐ(ఎం) మేటి అనిపించుకుంది. ప్రభుత్వానికి కూడా సాధ్యం కాని రీతిలో కరోనా సమయంలో నిర్వహించిన ఐసోలేషన్ సెంటర్స్, ప్రస్తుతం నిర్వహిస్తున్న వైద్యశిబిరాలను సందర్శించి ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఇతర రాజకీయ ప్రముఖులు ఆశ్చర్యచకితులు కావడం గమనార్హం.

కమ్యూనిస్టు ఉద్యమాల బలోపేతమే లక్ష్యం

నున్నా నాగేశ్వరరావు, సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి



కమ్యూనిస్టు ఉద్యమాల బలోపేతమే లక్ష్యంగా ఈ మహాసభలు నిర్వహిస్తున్నాం. బూర్జువాపార్టీలు ఓట్లు సీట్ల కోసం ఎన్నికలను డబ్బుమయం చేసి లబ్ధి పొందుతున్నాయి. ఆ వాతావరణం నుంచి ప్రజలను బయటపడేస్తాం. ప్రజాసమస్యలపై జన సమీకరణ చేసి ఉద్యమాలు నిర్వహిస్తాం. 2022లో ఖమ్మంలో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభకు లక్ష మందిని సమీకరించి, ఖమ్మానికి ఐదువైపుల నుంచి ర్యాలీలు నిర్వహించాం. కేరళ సీఎం పినరయ్ విజయన్ ఈ మహాసభలకు హాజరయ్యారు. అదే స్ఫూర్తితో భవిష్యత్తు ఎన్నికలు, ఉద్యమాలను సఫలీకృతం చేస్తాం.

భరత్ ఈ-టెక్నో స్కూల్ సెమీ క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-మధిర



మధిర పట్టణంలో భరత్ ఈ టెక్నో స్కూల్ నందు డైరెక్టర్ శీలం విద్యాలత, శీలం వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి అమ్మ ఫౌండేషన్స్ చైర్మన్ మల్లు నందిని విక్రమార్క హాజరయ్యారు. కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ టెక్నో స్కూల్ అధ్యాపక బృందం మల్లు నందిని విక్రమార్కని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంతోష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, మున్సిపాలిటీ కౌన్సిలర్లు కోన ధని కుమార్, గద్దల మాధురి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దారా బాలరాజు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తూమాటి నవీన్‌రెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దారా బాలరాజు పాల్గొన్నారు.

రూ.30 లక్షల విలువ చేసే స్థలాన్ని...

నారాయణపురం సొసైటీకి 'బత్తినేని' విరాళం

నవతెలంగాణ - బోనకల్



స్థలం రిజిస్ట్రేషన్ కాగితాలను సొసైటీకి అందజేస్తున్న బత్తినేని నాగప్రసాదరావు

రైతులకు చాలీచాలని సొసైటీ గోడౌన్‌తో అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే విధంగా సొసైటీ సిబ్బంది కూడా సరైన వసతి లేక అనేక రకాలుగా అవస్థలు పడుతున్నారు. నిత్యం అన్నదాతలకు ఆ సంఘం సేవలు అందిస్తుంది. నారాయణపురం గ్రామ వాసి, ఆ సొసైటీ చైర్మన్‌గా బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బత్తినేని నాగప్రసాదరావు ఉన్నారు. బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ అంటేనే సేవకు మారుపేరు. దీంతో ఆ సొసైటీకి మహర్దశ ప్రారంభమైంది. బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నారాయణపురం సహకార సంఘం అధ్యక్షులు బత్తినేని నాగప్రసాదరావు సొసైటీ అభివృద్ధికి నడుం బిగించారు. అందులో భాగంగా సొసైటీ సమీపంలోనే 30 లక్షల రూపాయల విలువచేసే స్థలాన్ని సొసైటీ పేరుతో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించి అందుకు సంబంధించిన పత్రాలను ఆ వెంటనే మండల తహసిల్దార్ కార్యాలయంలోనే తహసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్, బత్తినేని నాగప్రసాదరావు సొసైటీ అధికారులకు అందజేశారు. ప్రస్తుత సొసైటీ కార్యాలయం 100 మెట్రిక్ టన్నుల సామర్థ్యం మాత్రమే కలిగి ఉంది. నారాయణపురం సొసైటీ పరిధిలో చిన్న బీరవల్లి కూడా ఉంది. రైతుల సంఖ్య ఎక్కువగా ఉండటం సొసైటీ గోడౌన్ తక్కువ సామర్థ్యం కలిగి ఉండటంతో ప్రతి సంవత్సరం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో 2000 సంవత్సరంలో జరిగిన సహకార సంఘం ఎన్నికలలో బత్తినేని నాగప్రసాదరావుని ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. దీంతో నాగప్రసాదరావు సొసైటీ అభివృద్ధికి నిరంతరం పాటుపడుతూ వస్తున్నారు. గ్రామంలోనే ప్రధాన రహదారి నుంచి సొసైటీ కార్యాలయం వెళ్లడానికి సరైన మార్గం లేదు. ఒకవేళ వర్షం వస్తే ప్రధాన రోడ్డు నుంచి సొసైటీ కార్యాలయానికి వెళ్లాలంటే నరకయాతన పడవలసిందే. దీంతో నాగప్రసాదరావు రైతుల పడుతున్న ఇబ్బందులను స్వయంగా చూశారు. దీంతో నాగప్రసాదరావు వెంటనే స్పందించారు. బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామంలోనే ప్రధాన రహదారి నుంచి సొసైటీ వరకు సిసి రోడ్డు వేయించారు. దీంతో సొసైటీకి రహదారి సమస్య పూర్తిగా తొలగిపోయింది. రహదారి సమస్య పూర్తిగా తొలగిపోవడంతో సొసైటీ గోడౌన్‌పై నాగప్రసాద్ రావు తన దృష్టిని సారించారు. సొసైటీని ఎట్టి పరిస్థితులలోనూ విస్తరించాలని కంకణం కట్టుకున్నారు. కానీ సొసైటీకి సంబంధించి గోడౌన్ మినహా ఖాళీ స్థలం లేదు. దీంతో నాగప్రసాదరావు గ్రామంలో తనకు గల 30 (75 సెంట్లు) కుంట్ల భూమిని సొసైటీకి బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ద్వార విరాళంగా ఇచ్చేందుకు నిర్ణయించారు. అనుకున్నదే తడవుగా నాగ ప్రసాద్‌రావు ఉచితంగా భూమి ఇవ్వటంతో పాటు, రిజిస్ట్రేషన్‌కు కూడా తన సొంత ఖర్చులతో తహశీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారు. భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ముందుగానే విరాళంగా అందజేస్తున్న భూమిని నారాయణపురం సొసైటీ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించారు. అందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను సొసైటీ అధికారులకు తహసిల్దార్‌తో కలిసి స్వయంగా అందజేశారు. దీంతో నారాయణపురం సొసైటీ గోడౌన్ ఇబ్బందులు తొలగిపోనున్నాయి. త్వరలోనే విరాళంగా అందజేసిన స్థలంలో 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల సొసైటీ కార్యాలయం, గోడౌన్ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించినట్లు సొసైటీ చైర్మన్ బత్తినేని నాగ ప్రసాద్‌రావు, సీఈవో దేవవరపు వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణపురం సొసైటీ మాజీ అధ్యక్షుడు కాకాని హనుమంతరావు, సొసైటీ డైరెక్టర్లు మన్నేపల్లి వెంకటేశ్వరరావు, పోతినేని నరసింహారావు, సొసైటీ సీఈవో మాదవరపు వెంకటేశ్వర్లు, మాజీ సొసైటీ సీఈఓ యనమద్ది శ్రీనివాసరావు, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తూము రోషన్ కుమార్ పాల్గొన్నారు.





గ్రామంలో ప్రధాన రహదారి నుంచి సొసైటీ వరకు వేయించిన సిసి రోడ్డు



వ్యవసాయశాఖ మంత్రి ఇలాకాలో రెండు నెలల్లో ఇద్దరు రైతుల ఆత్మహత్య

- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

రైతు భూపతిరావు కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-రఘునాథపాలెం

కోటపాడు గ్రామంలో అప్పుల భారంతో ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు గునిపిన్ని భూపతిరావు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు భూపతిరావు కుటుంబాన్ని తెలంగాణ రైతు సంఘం జిల్లా బృందం సభ్యులు పరామర్శించారు. కోటపాడులో భూపతి రావు ఇంటివద్ద తల్లితండ్రులు వెంకయ్య, పద్మా, భార్య సాయికుమారి, కుమారుడు కౌశిక్ ను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూపతిరావు 14 ఎకరాలు కౌలుకు తీసుకొని మిర్చి సాగు చేశాడు. ఇందులో నాలుగు ఎకరాల మిర్చి వైరస్ వచ్చి ఎండిపోయింది. మిగతా 10 ఎకరాలలో కూడా దిగుబడి వస్తుందో రాదో అనే ఆందోళన చెందాడు. పెట్టుబడుల కోసం అప్పులు చేశాడు. ఆ అప్పులు తీరే మార్గం కనబడకపోవడంతో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సందర్భంగా బొంతు రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూపతి రావు కుటుంబాన్ని అన్ని విధాలా అందుకోవాలని అన్నారు. ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల ఇలాకాలో 2 నెలల సమయంలో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమన్నారు. మార్కెట్‌లో మిర్చి ధర తగ్గకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిర్చి క్వింటాళ్ల 20 వేల రూపాయలు ధర నిర్ణయం చేసి ప్రభుత్వ సంస్థలు ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్కె మీరా, వాసిరెడ్డి ప్రసాద్, సహాయ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎస్.నవీన్ రెడ్డి, చిమ్మపూడి గ్రామ శాఖ కార్యదర్శి జైపాల్, నాయకులు రాజేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు



రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికైన త్రివేణి విద్యార్థిని

నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న సీఎం కప్ ఎస్‌జిటి కరాటే పోటీలో ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలకు చెందిన ఎస్.సంధ్య మొదటి బహుమతి గెలుచుకున్నారు. రాష్ట్రస్థాయిలో జరగబోయే పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా త్రివేణి పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, త్రివేణి కృష్ణవేణి విద్యా సంస్థల అధినేత యార్లగడ్డ వేంకటేశ్వర రావు, పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, పాఠశాల ప్రిన్సిపల్ పి.రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న ముస్తఫాలు గెలుపొందిన విద్యార్థినిని అభినందించారు.

నేషనల్ పెస్ట్ సర్వేలైన్ సిస్టం మొబైల్ యాప్ రెడీ

- వ్యవసాయ శాస్త్ర వేత్తల వివరణ

నవతెలంగాణ-వైరా

నేషనల్ పెస్ట్ సర్వైలైన్ సిస్టం యాప్ ద్వారా పంటల్లో చీడ పీడలను గుర్తించి వాటి నివారణకు తగిన చర్యలు చేపట్ట వచ్చని వ్యవసాయ శాస్త్ర వేత్తలు వివరించారు. మంగళవారం మండలంలోని ఖానాపురం రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రస్తుత దశలో వివిధ పంటలలో తీసుకోవలసిన సస్య రక్షణ చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు నేషనల్ పెస్ట్ సర్వైలైన్ యాప్ గురించి వివరించారు. దాచాపురం గ్రామంలో వరి కొయ్యలను కాలచ్చుతున్నారని, దాని వల్ల కలిగే నష్టాలను వివరించారు. వరి కొయ్యలను భూమిలోనే కలియ దున్ని భూ సారాన్ని పెంచాలని తెలిపారు. అనంతరం పూసలపాడు గ్రామం లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోలు తీరును, సంబంధిత రికార్డులను పరిశీలించారు.కార్యక్రమం లో మండల వ్యవసాయాధికారి మయాన్ మంజూఖాన్ వ్యవసాయ విస్తరణాధికారులు సైదులు, వెంకటనర్సయ్య, రాజేష్, కీర్తి, రైతులు షేక్ లాల్ మహ్మద్, మౌలాలి, వాకదాని వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో సర్వజ్ఞ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-ఖమ్మం



ఈనెల 11 నుంచి 13 వరకు జరిగిన సీఎం కప్ పోటీలలో పల్లె నుంచి ప్రపంచ స్థాయి విజేతలకు సీఎం కప్ నిర్వహించిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ అండర్ 14, 17 టేబుల్ టెన్నిస్ పోటీలలో సర్వజ్ఞ విద్యార్థులు విజయకేతనాన్ని ఎగరవేశారని పాఠశాల డైరెక్టర్ నాగేంద్ర కుమార్ అన్నారు. అండర్ 14, 17 టేబుల్ టెన్నిస్ పోటీలలో జి.చార్విక్, షేక్ ఫజిల్ విద్యార్థులు మొదటి స్థానాన్ని సాధించి బంగారు పతకాలను గెలుచుకున్నారని తెలిపారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా చదువుతోపాటు విద్యార్థులకు ఆటలలో శిక్షణ ఇస్తూ వారిలో దాగివున్న ప్రతిభను వెలికితీస్తూ వాళ్ళ మనోధైర్యంతో పాటు ఏకాగ్రత, క్రమశిక్షణకు ఆటలు ఎంతో ముఖ్యమని అన్నారు. పాఠశాల డైరెక్టర్ కె.నీలిమ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో బహుమతులు గెలుచుకున్న విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ వారి ఉజ్వల భవిష్యత్తుకు సర్వజ్ఞ ఎప్పుడు తోడుగా ఉంటుందని, అలానే వారు మున్ముందు మరెన్నో విజయాలు సాధించాలని తెలియజేస్తూ వారి సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల యాజమాన్యం ప్రిన్సిపల్ , వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.



సేవాదళ్ అధ్యక్షులు గుండేల రవికి అభినందనలు

నవతెలంగాణ-వైరాటౌన్

జిల్లా కాంగ్రెస్ ఆఫీసులో జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సయ్యద్ గౌస్ వైరా మండల సేవాదళ్ అధ్యక్షులుగా నూతనంగా నియమించబడిన గుండేల రవిని అభినందించారు. పదవికి వన్నె తెచ్చే విధంగా పని చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ సెక్రెటరీ బడే మియా, సేవాదళ్ జానీ, కిసాన్ సెల్ అధ్యక్షులు శేఖర్ గౌడ్, చంద్రం, కల్వ సుజాత అభిమాన సంఘం నాయకులు గ్రంది ప్రవీణ్, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి

నవతెలంగాణ-ఖమ్మం

సంక్షేమ గురుకుల పాఠశాలలు సంక్షోభంలోకి కోరుకుపోయాయని తక్షణమే సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రఘునాథపాలెం గురుకుల బాలికల పాఠశాల తోపాటు మరికొన్ని గురుకుల పాఠశాలను ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా మడుపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఫుడ్ పాయిజన్ ఘటనలపై రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు షేక్ నాగుల్ మీరా, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు బుర్ర మనోజ్, వంశీ, రోహిత్, రాజు, సాయి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఎన్నిక

- అధ్యక్షులుగా ప్రేమ్‌కుమార్, కార్యదర్శిగా మణికంఠ

నవతెలంగాణ-కల్లూరు



ఎస్ఎఫ్ఐ మండల నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా తెల్లూరి ప్రేమ్ కుమార్, ఈలాప్రోలు మణికంఠలను ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బెజవాడ సాయి శేషు తెలిపారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ విద్యార్థుల కోసం పోరాడే ఏకైక సంఘం ఎస్ఎఫ్ఐ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ గర్ల్స్ నాయకులు మల్లూరు సత్య తల్లాడ మండల కార్యదర్శి బొల్లం కార్తీక్, పెనుబల్లి మండల కార్యదర్శి తెల్లూరి భాను, నాయకులు కృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా విజయకుమార్

నవతెలంగాణ-కల్లూరు



కల్లూరు మండల యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న కొడిసాని విజయకుమార్ జిల్లా కార్యదర్శిగా ఎంపికయ్యారు. గత ఆరు సంవత్సరాల నుండి యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ మండలంలో సంఘాన్ని బలోపేతం చేసేందుకు విశేష కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించి సత్తుపల్లిలో జరిగిన జిల్లా మహాసభల్లో కార్యదర్శిగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి పొందిన విజయ్ కుమార్ ను యుటిఎఫ్ మండల కమిటీ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

అక్రమ అరెస్టులను ఖండించండి

నవ తెలంగాణ-తల్లాడ

తమ సమస్యల పరిష్కారం కోసం గ్రామపంచాయతీ కార్మికులు అసెంబ్లీకి వెళ్తుంటే వారిని అక్రమంగా అరెస్టు చేయడాన్ని ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలని, టియుసిఐ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు డి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తక్షణమే గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించి, పెండింగ్లో ఉన్న వారి వేతనాలను మంజూరు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

పీడీఎస్‌యూ నాయకుల అరెస్టులను ఖండించండి

నవతెలంగాణ-ఖమ్మం

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లి తెలంగాణ అసెంబ్లీ వద్ద శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తున్న రాష్ట్ర నాయకులను, విద్యార్థులను హైదరాబాద్ పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు అన్ని వర్గాల ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలని పీడీఎస్‌యూ ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కాలేజీ అధ్యక్షులు వినయ్, సహాయ కార్యదర్శి సాదిక్‌లు కోరారు. మంగళవారం ఖమ్మంలోని ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ కళాశాల గేటు ముందు హైదరాబాదులో పిడిఎస్యు విద్యార్థి సంఘం నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు అన్వేష్, శ్రీను, అశోక్, పాల్గొన్నారు.

లక్ష్మీ భవాని దుస్థితికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఖమ్మంలో బీసీ గురుకుల పాఠశాల విద్యార్థిని లక్ష్మీ భవాని ఎలుకల దాడికి గురై, సరైన వైద్యం అందక, కాలు, చేయి చచ్చుబడిపోవడానికి రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే కారణమని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆరోపించారు. లక్ష్మీ భవాని ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఢిల్లీ నుంచి ఘటన గురించి తెలుసుకుని, విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత విద్యార్థిని హైదరాబాద్ కు తరలించి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఏడాది కాలంగా సంక్షేమ హాస్టళ్లలో సరైన సౌకర్యాలు, మంచి ఆహారం అందక విద్యార్థులు తరచూ అనారోగ్యాల బారిన పడటం ఆస్పత్రుల పాలవుతున్నా ప్రభుత్వంలో చలనం రావడం లేదని విమర్శించారు. హాస్టళ్లలో వసతుల గురించి ప్రతిపక్షంగా బీఆర్ఎస్ ప్రశ్నిస్తే.. ప్రభుత్వం ప్రతిష్టకు పోయి నిరుపేద విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి.. సంక్షేమ హాస్టళ్లలో సరైన మౌళిక సదుపాయాలు కల్పించి, నాణ్యమైన ఆహారం అందించాలని ఎంపీ రవిచంద్ర కోరారు.

పెన్షనర్లు సమాజానికి స్ఫూర్తి ప్రదాతలు

- ప్రతీ శుక్రవారం సీనియర్ సిటిజన్స్ కు ప్రత్యేక వైద్య శిబిరం
- వారం రోజులలో కలెక్టరేట్ లో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ-ఖమ్మం



పెన్షనర్లు సమాజానికి స్ఫూర్తి ప్రదాతలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం జాతీయ పెన్షనర్స్ డే సందర్భంగా ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మా కుటుంబం నాలుగు తరాలుగా ప్రభుత్వం తరపున ప్రజలకు సేవ చేస్తున్నామని, పెన్షనర్లు సమాజానికి స్ఫూర్తి ప్రదాతలని, కష్టాలు ఉన్నప్పుడు, ఆపద సమయాల్లో పెద్దలు ఇచ్చే సలహాలతోనే వాటి నుంచి బయట పడతామని తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా వేలాది మంది పడిన శ్రమ ఫలితంగా నేడు సమాజానికి ఒక చక్కటి వ్యవస్థ అందుబాటులో ఉందని అన్నారు. ఒక దరఖాస్తు మా దగ్గరికి వస్తుందంటే అది పరిష్కారమవుతుందని, గతంలో అధికారులు చూపించిన నమ్మకం మాత్రమేనని అన్నారు. జిల్లా ఆసుపత్రిలో పెన్షనర్లు, సీనియర్ సిటిజన్స్‌కు వైద్య చికిత్స అందించేందుకు ప్రతి శుక్రవారం ప్రత్యేక విభాగం పని చేస్తుందని, సీనియర్ సిటిజన్స్ కు అవసరమైన ఐదు, ఆరు రకాల ప్రత్యేక వైద్యులు ఒకే చోట అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తారని, దీనిని వినియోగించుకోవాలని, ఈ సేవలపై విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ కోరారు. సీనియర్ సిటిజన్స్ కోసం కలెక్టరేట్‌లో ర్యాంప్ పక్కన ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నామని, కలెక్టరేట్ లో సీనియర్ సిటిజన్స్‌కు ఏ శాఖతో పని ఉన్నప్పటికీ ఒకే దగ్గర దరఖాస్తులు తీసుకొని, వాటిని సంబంధిత శాఖలకు కేటాయించి పరిష్కారం అయ్యేలా చూస్తామని, వారం రోజుల వ్యవధిలో ఈ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని అన్నారు. పెన్షనర్స్, సీనియర్ సిటిజన్స్ కోసం అనువైన స్థలాన్ని ఎంపిక చేసి అప్పగించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. పెన్షనర్స్ అనుభవం ఉపయోగించుకునేందుకు ప్రతి నెలా కలెక్టరేట్ లో సీనియర్ సిటిజన్స్ టాక్ ఏర్పాటు చేస్తున్నామని, ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ వచ్చి నూతన ఉద్యోగులకు తమ అనుభవాలు అందించాలని కలెక్టర్ కోరారు. ముందుగా పెన్షనర్స్ తమ అభిప్రాయాలను తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ పెన్షనర్ లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కళావతి బాయి, జిల్లా కోశాధికారి ఎస్వీఎస్ నర్సింహా, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కళ్యాణం కష్టయ్య, రాష్ట్ర కార్యదర్శి పైడిపల్లి శరత్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సుబ్బయ్య, సబ్ ట్రెజరీ అధికారి మోదుగు వేలాద్రి , సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు వెలిగేటి చంద్రమోహన్ , జిల్లా ఆరోగ్య అధికారి నారాయణమూర్తి, రిటైర్డ్ ఉద్యోగ సంఘ జిల్లా నాయకులు తాళ్లూరి వేణు పాల్గొన్నారు.



మోడల్ పోలీస్ స్టేషన్‌గా ముదిగొండ

- పీఎస్ ఆధునీకరణ పనులు బేష్
- సిఐ మురళికి కితాబ్ ఇచ్చిన సిపి సునీల్ దత్

నవతెలంగాణ-ముదిగొండ

జిల్లాలోనే ముదిగొండ పోలీస్ స్టేషన్ మోడల్‌గా ఉందని, సీఐ మురళి స్టేషన్ ఆధునీకరణ పనులు, నూతన హంగులతో అద్భుతంగా చేసి పీఎస్‌ను తీర్చిదిద్దిన తీరు బేష్‌గా ఉందని కమిషనర్ ఆఫ్ పోలీస్ (సిపి) సునీల్ దత్ ఉద్ఘటించారు. ముదిగొండ పోలీస్ స్టేషన్‌ను సిపి సునీల్ దత్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్, సిబ్బంది పనితీరు, సెక్టర్ అధికారుల విచారణ, జనరల్ డైరీ నివేదికలుతోపాటు,స్టేషన్ పరిసరాలను ఆయన నిశితంగా పరిశీలించారు. అనంతరం సీఐ మురళి పోలీస్ స్టేషన్కు చేసిన సేవలను కొనియాడుతూ,పోలీస్ స్టేషన్ ను సీఐ మురళి ఆధునికరించిన, పని విధానాన్ని, మెచ్చుకొని సిపి సునీల్ దత్ అభినందించారు. నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని సిఐకి సూచించారు. తొలిత సిఐ మురళి, సిపి సునీల్ దత్ కు పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ ఏసిపి బి తిరుపతిరెడ్డి, ఎస్సైలు గజ్జెల నరేష్, డి అనంతరాములు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లగచర్ల రైతులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

- అంబేద్కర్ విగ్రహానికి వినతి

నవతెలంగాణ-కల్లూరు

లగచర్ల రైతులపై పెట్టిన కేసులు, వెంటనే రద్దు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ కట్టా అజయ్ కుమార్, లక్కినేని రఘు మాట్లాడుతూ రైతులపైన థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించి, రైతన్నల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ రైతులను అవమానపరిచిందని ఆరోపించారు. రైతన్నలపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి, వారిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపుమేరకు సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య ఆదేశానుసారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ పెద్దబోయిన మల్లేశ్వరరావు, సీనియర్ నాయకులు మేకల కృష్ణ, మాజీ కో ఆప్షన్ సభ్యులు షేక్ కమ్లి, పుసులూరి శ్రీనివాసరావు, నున్నా వెంకటయ్య, కొరకొప్పు ప్రసాద్, మాజీ సర్పంచ్ కుక్కా అంజారావు, కువ్వారపు విజయరావు, ఎస్టీ సెల్ సీనియర్ నాయకులు అజ్మీర జమలయ్య పాల్గొన్నారు.

కుటుంబ సర్వే గౌరవ వేతనం అందించాలి

- ఉపాధ్యాయులకు అటెండెన్స్ సర్టిఫికెట్ ఇవ్వాలి
- యూటీఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కి వినతి

నవతెలంగాణ-ఎర్రుపాలెం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సమ గ్ర కుటుంబ ఇంటింటి సర్వేను పూర్తి చేసిన ఉపాధ్యాయులకు అటెండెన్స్ సర్టిఫికెట్స్ ఇవ్వాలని తహసీల్దార్ మన్నే ఉషాశారదకు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల అధ్యక్షులు అనుమోలు కోటేశ్వరరావు వినతి పత్రం అందించారు. ఎర్రుపాలెం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉషాశారదను కలిసి ఉపాధ్యాయులకు అటెండెన్స్ సర్టిఫికెట్స్‌తో పాటు సమగ్ర కుటుంబ సర్వే సందర్భంగా ప్రభుత్వం విడుదల చేసిన గౌరవ వేతనం నిధులను వెంటనే ఉపాధ్యాయులకు చెల్లించాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండలం ప్రధాన కార్యదర్శి ఎన్. వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు కంచర్ల శ్రీనివాసరావు, కార్యదర్శి సుబ్బరామరాజు, ఆర్‌బలు రవికుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల నిరసన

- రైతన్నలపై కక్ష సాధింపులు చేస్తున్న కాంగ్రెస్
- మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య

నవతెలంగాణ-ఖమ్మం



బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు ఖమ్మంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిపై ఆ పార్టీ శ్రేణులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, ఖమ్మం నగర పార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజు మాట్లాడుతూ రైతుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వం వహిస్తున్న మొండివైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి, వారిపైన థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించి, రైతన్నల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, అమానవీయ, అణిచివేత విధానాలను ఖండించారు. రైతన్నలపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి, వారిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దాదే అమత, మక్బుల్, పల్లా రోస్ లీనా, దండా జ్యోతి, అయ్యప్ప రెడ్డి, బుర్రి వెంకట్, మాటేటి నాగేశ్వరరావు, కన్నం ప్రసన్న, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు తాజుద్దీన్, తెలంగాణ ఉద్యమకారులు బొమ్మెర రామ్మూర్తి, రఘునాథపాలెం మండల అధ్యక్షుడు వీరు నాయక్, గుత్తా రవి బిచ్చల,తిరుమలరావు, డోకుపర్తి సుబ్బారావు, మేకల సుగుణ రావు,మహిళా నాయకురాలు కొల్లు పద్మ, పల్లా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెనుబల్లి : పెనుబల్లి మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో విగ్రహానికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు లగచర్ల జరిగిన అమాయక గిరిజనులపై జరిగిన దాడికి నిరసనగా, అక్రమ అరెస్టును, బేడీలతో థర్డ్ డిగ్రీ ప్రయోగించడాన్ని ఖండిస్తూ, నిరసన తెలిపి వినతిపత్రం అందజేశారు. రైతుల మీద పెట్టిన కేసులను ఎత్తివేయ్యాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కనగాల వెంకటరావు, కొప్పుల గోవిందరావు, పసుమర్తి వెంకటేశ్వరరావు, కొప్పుల రంగారావు, భూక్య ప్రసాద్, తేజావత్ తావ్రూ నాయక్, షేక్ గౌస్ మరకాల చంటి తాళ్లూరి శేఖర్రావు బెల్లంకొండ చలపతిరావు, పొట్లపల్లి ప్రసాదు పాల్గొన్నారు.

తల్లాడ : లగచర్ల రైతులపై దాష్టీకాన్ని నిరసిస్తూ మంగళవారం బీఆర్ఎస్ శ్రేణులు, తల్లాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆర్ వీర మోహన్ రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దుగ్గిదేవర వెంకట్ లాల్, షేక్ యూసుఫ్, రుద్రాక్ష బ్రహ్మం, బద్దం కోటిరెడ్డి, పాల్గొన్నారు.

సేవకు పేదరికం అడ్డుకాదు

- గర్భిణులను ఆస్పత్రులకు తరలించేందుకు

24/365 అంటున్న లతీఫ్

నవతెలంగాణ-వైరా



సేవల్లో ఎన్నో రకాలు, ఎన్నో తీర్లుగా సేవా చేయవచ్చు అంటున్నాడు సిరిపురం(కెజి) గ్రామానికి చెందిన షేక్ లతీఫ్. గత రెండు సంవత్సరాలుగా తనకున్న ఆటోతో గర్భిణులను డెలివరీ, గర్భస్థ పరీక్షల కోసం వైరాలోని ప్రభుత్వ ప్రయివేట్ ఆస్పత్రులకు ఉచితంగా తీసుకెళ్లి మరలా ఇంటికి తీసుకొచ్చే కార్యక్రమం చేపట్టి చుట్టు పక్కల 10 గ్రామాల ప్రజల హృదయాలలో నిలిచారు. సిరిపురంలో ఆటోతో పాటు సైకిల్, మోటార్ సైకిల్ పంచర్ షాప్ నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. రోజుకు ఒకరో ఇద్దరినో తీసుకెళ్లి తీసుకొస్తున్నాడు. సిరిపురం పూసల పాడు, పుణ్యపురం, గౌండ్ల పాలెం, నారపనేని పల్లి, లక్ష్మి పురం, పినపాక గ్రామాలలో తన సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాడు. అంతే గాక సిరిపురం హై స్కూల్‌లో ఉన్న 10 తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల ఫీజ్ 3000 రూపాయలు చెల్లించి తన ఉదారతను చాటుకున్నాడు. పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లి దండ్రులు లతీఫ్ సాదరంగా సత్కరించారు.



మా టీచర్స్ మాకు కావాలంటూ విద్యార్థుల ఆందోళన

నవతెలంగాణ-కూసుమంచి

మండలంలోని గట్టుసింగారం గ్రామ శివారులో కేజీబీవీ బాలికల విద్యాలయం స్కూల్ ఎదుట మంగళవారం విద్యార్థులు ప్లకార్డులు చేత పట్టుకొని, మా టీచర్స్ మాకు కావాలంటూ విద్యార్థినిలు నినాదాలు చేశారు. సమగ్ర శిక్షణ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం గత వారం రోజుల నుండి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తుండగా పిల్లలకు చదువులు కొనసాగడం లేదు. దీంతో కేజీబీవీ బాలికలు మా చదువులు కొనసాగాలంటే మా టీచర్స్ మాకు కావాలంటూ కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సర్వ శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని విద్యార్థినిల తల్లిదండ్రులు కోరుతున్నారు.



సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన ఉపాధ్యాయులకు అటెండెన్స్ సర్టిఫికెట్స్ ఇవ్వాలి : టీఎస్ యూటీఎఫ్

నవతెలంగాణ-బోనకల్

సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన మండల పరిధిలోని ఉపాధ్యాయులకు అటెండెన్స్ సర్టిఫికెట్స్ ఇవ్వాలని తహసీల్దార్ అనిశెట్టి పున్నం చందర్‌కు టీఎస్ యూటీఎఫ్ బోనకల్ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఉన్నత అధికారులతో చర్చించి త్వరలోనే సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించిన ఉపాధ్యాయులకు అటెండెన్స్ సర్టిఫికెట్ ఇస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు సంపూర్ణంగా నిధులు మంజూరు చేయాలని ఆ వినతి పత్రంలో కోరారు. మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా అభివృద్ధి పనులు నిర్వహించిన పాఠశాల కమిటీలకు మంజూరైన మొత్తం అమౌంటును ఆయా పాఠశాల కమిటీలకు మంజూరయ్యే విధంగా కలెక్టర్ కు తగిన సిఫారసు చేయాలని మండల ఎంపీడీవో ఆఫీస్ సూపరింటెండెంట్ మిట్టపల్లి రవికుమార్‌కు కూడా వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఎంపీడీవోతో చర్చించి ఏఈతో రిఎస్టిమేషన్ వేయించి సంపూర్ణంగా నిధులు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ, జిల్లా నాయకులు సద్దా బాబు మండల అధ్యక్షులు గార్లపాటి చిన్న రంగారావు, మండల ఉపాధ్యక్షులు పి గోపాల్ రావు, మండల ఉపాధ్యక్షురాలు బి.సౌభాగ్య లక్ష్మి, మండల కార్యదర్శులు పీ నరసింహారావు, ఎన్.వెంకటేశ్వర్లు, హరికృష్ణ, కేశవరావు, నరేంద్ర సింహ, ప్రసాద్, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల పుల్లయ్యకు ఘన నివాళులు

నవతెలంగాణ-వైరా



తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మండల బీసీ సెల్ అధ్యక్షులు చిట్యాల పుల్లయ్య మంగళవారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందారు. మృతదేహానికి తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు వాసిరెడ్డి రామనాథం, నియోజకవర్గ ఇన్చార్జి చెరుకూరి చలపతిరావు, వైరా మండల అధ్యక్షులు కిలారు సురేందర్, పట్టణ అధ్యక్షులు మన్నేపల్లి ప్రదీప్, తెలుగు యువత అధ్యక్షులు నూకవరపు అయ్యప్ప చౌదరి, మందడపు మధుసూదన్ రావు, వెంకటేశ్వరరావు, మేదరమెట్ల పూర్ణచంద్రరావు, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీకి సేవలందిస్తూ, పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేసిన చిట్యాల పుల్లయ్య ఆకస్మిక మరణం బాధాకరమని అన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | డిసెంబర్ 18, 2024 | www.navatelangana.com

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై గలమెత్తిన పాయం

నవతెలంగాణ-మణుగూరు

రాష్ట్ర వ్యాప్తంగా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సింగరేణిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 30 వేల కాంట్రాక్ట్ కార్మికులు కనీస వేతనం లేకుండా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. పినపాక నియోజకవర్గంలోని మణుగూరు ఏరియాలో మాత్రమే 2000 మందికి పైగా కాంట్రాక్ట్ కార్మికులు ఉన్నారన్నారు. వీరు పర్మినెంట్ కార్మికులకు సమానంగా శ్రమ చేస్తూనే కనీస వేతనం లేకుండా పని చేస్తున్నారని, వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. కనీస వేతనం అమలు చేయడం కేవలం ఆర్థిక భద్రతే కాకుండా వారి పిల్లల విద్య, ఆరోగ్యం వంటి అంశాలకు కూడా కీలకమని వివరించారు.

పాయం వెంకటేశ్వర్లు గౌరవ సభా అధ్యక్షుల ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేత నం అమలు చేయాలని కోరారు. ఈ వేతనం అమలు చేయడం ద్వారా వారికి ఉద్యోగ భద్రత కూడా కల్పించాలని అన్నారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికు లు దశాబ్దాలుగా కృషి చేస్తూ పర్మినెంట్ కార్మికుల కన్నా ఎక్కువ శ్రమిస్తున్నా రన్నారు. కనీస వేతనం అమలు చేయడం అనేది వారి హక్కు. ప్రభుత్వం దీనిపై చర్యలు తీసుకుని కార్మికుల హక్కులను కాపాడాలని పాయం పేర్కొన్నారు.

అనారోగ్యంతో సీపీఐ(ఎం) సానుభూతిపరుడు పాపారావు మృతి



నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని బట్టి గూడెం గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) పార్టీ సానుభూతిపరుడు మడకం పాపారావు సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. పాపారావు పార్థివ మృతదేహాన్ని మంగళవారం పార్టీ మండల కార్యదర్శి కారం పుల్లయ్య సందర్శించి నివాళులు అర్పించడంతోపాటు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నివాళులు అర్పించిన వారిలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, కొర్స చిలకమ్మ, జీఎస్పీ నాయకులు ముర్రం వీరభద్రం, స్థానిక మాజీ సర్పంచ్ సరియం సీతారామయ్య, మడకం లక్ష్మి, మడకం మహేంద్ర నాథ్, తిరుపతి, కొర్స శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సంతకాల సేకరణ



నవతెలంగాణ-మణుగూరు

సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి సంతకాల సేకరణ నిర్వహించినట్టు సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ సెక్రటరీ వల్లూరు వెంకటరత్నం తెలిపారు. మంగళవారం ఓసీ-2లో సంతకాల సేకరణ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల తర్వాత జరిగిన స్ట్రక్చరల్ సమావేశంలో కార్మికులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న సొంత ఇంటి పథకం అమలు, పెర్క్స్ మీద ఇన్కమ్ టాక్స్ సమస్య, పేర్ల మార్పిడి, హాస్పిటల్, విద్యా సమస్యలపై ఎజెండానే లేకుండా చేశారన్నారు. సింగరేణి యాజమాన్యంతో గుర్తింపు సంఘం చర్చలు ప్రారంభించి కార్మికులకు నిరాశ మిగిలించిందని తెలిపారు. సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి వల్లూరు వెంకటరత్నం సంతకాల సేకరణ సందర్భంగా మాట్లాడుతూ...12 డిమాండ్లపై చర్చలు జరిపిందని, కనీసం వాటిపై కూడా ఎలాంటి పురోగతి లేకుండా చర్చలు వాయిదా పడ్డాయని కార్మికుల ఆశలను అడియాశలు చేసిందని ఆయన పేర్కొన్నారు. వచ్చే నెలలో చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ దగ్గర జరిగే చర్చలలో ప్రధానమైన డిమాండ్లు ఎన్నికల ముందు ఏఐటీయూసీ యూనియన్ మ్యానిఫెస్టోలోని 48 డిమాండ్లను నెరవేర్చేందుకు కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో. మాచారపు లక్ష్మణరావు, విల్సన్, సుమన్, సాయి కృష్ణ, శ్రీను, పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శిగా ఏవి సీతారాం



నవతెలంగాణ-దుమ్ముగూడెం

పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శిగా ఏవి సీతారాంకు నియామకపు ఉత్తర్వులు అందజేసినట్టు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కారంపూడి దశంబాబు మంగళవారం తెలిపారు. బండారు గూడెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల నందు ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న ఏవీ సీతారాం నియామకం పట్ల పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.వంశీ మోహన్, డి.శ్రీనివాసరావు, మండల కార్యవర్గ సభ్యులు బి.మల్లికార్జునరావు ఆర్.నాగరాజు, ఆర్‌కేజీయ, రాష్ట్ర నాయకులు ధనుకొండ శ్రీనివాసరావు, తన్నీరు శ్రీనివాసరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రయివేట్ ఆస్పత్రులలో జరుగుతున్న దోపిడీని అరికట్టాలి

టేకులపల్లి మండలంలోని సులానగర్ ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలను బలోపేతం చేసి, ప్రయివేటు, కార్పొరేట్ వైద్యశాలల దోపిడిని అరికట్టాలని పీఓడబ్ల్యు, పీవైఎల్ సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని మంగళవారం డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన గోడపత్రికలను ఆవిష్కరించినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి సర్వే చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాంకుడోత్ అజయ్, తెలంగాణ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి చంద్ర అరుణ, పీఓడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు యదలపల్లి సావిత్రిలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్షులు దారావత్ దేవా, జిల్లా సహాయ కార్యదర్శి పూనెం మంగయ్య, ప్రగతిశీల మహిళా సంఘం పీఓడబ్ల్యు జిల్లా నాయకురాలు ముత్తక్క పాల్గొన్నారు.

పర్ణశాలలో ఘనంగా మాస కల్యాణం



నవతెలంగాణ-దుమ్ముగూడెం

భద్రాచల క్షేత్రానికి అనుబంధ ఆలయం అయిన పర్ణశాల శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో పునర్వసు నక్షత్రం సందర్భంగా స్వామివారికి మాస కల్యాణం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి విశేష తిరుమంజనం నిర్వహించి, సాంప్రదాయాను సారంగా అన్ని వైదిక కార్యక్రమాలను అర్చక సిబ్బంది ఆచరించి స్వామివారికి కల్యాణం కనువిందుగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించడంతోపాటు స్వామివారి తీర్థ ప్రసాధములు స్వీకరించి ఆశీస్సులు అందుకున్నారు. భక్తులకు చక్కెరపొంగలి ప్రసాధమును అందించారు. అనంతరం 150 మంది భక్తులకు దాత ద్వారా అన్నప్రసాద వితరణ అందజేశారు. గ్రామానికి చెందిన చాట్ల సింహాచలం దంపతులు కల్యాణం టిక్కెట్టు పొంది కల్యాణ ఉభయదాతగా కల్యాణం నందు పాల్గొన్నారు. ఈ బృహత్కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి అనిల్ కుమార్, శేషం కిరణ్ కుమారాచార్యులు, ముఖ్య అర్చకులు భార్గవాచార్యులు, శ్రీరంగం వెంకటాచార్యులు, నదిగేల నరసింహాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశ్రామికాభివృద్ధిలో జిల్లా మసక బారుతోంది

తాగు, సాగు నీటి పథకాలలో జిల్లాకు అన్యాయం | కమ్యూనిస్టులకు బలమైన ఉద్యమ కేంద్రంగా ఇల్లందు

నూతన బొగ్గు బావులతో పూర్వ వైభవం తేవాలి

- ప్రభుత్వాలు ఏవైనా ప్రజల మేలు కోసం ఉద్యమాలు
- జిల్లా సమగ్ర అభివృద్ధి ప్రజా సమస్యలపై మహాసభలో చర్చిస్తాం
- ఆర్థిక సహకారం అందించిన ప్రజలకు కృతజ్ఞతలు
- 20, 21న జరిగే సీపీఐ(ఎం) జిల్లా మహాసభల విజయవంతనికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- విలేఖర్ల సమావేశంలో జిల్లా మహాసభల గౌరవాధ్యక్షులు సోమయ్య, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య





నవతెలంగాణ-ఇల్లందు

ప్రయివేటీకరణ, కార్పొరేటీకరన వివిధ సమస్యలతో సతమతమౌతున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పారిశ్రామికాభివృద్ధి మసకబారుతోందని సీపీఐ(ఎం) జిల్లా మహాసభల గౌరవాధ్యక్షులు పి.సోమయ్య, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. 20, 21 తేదీలలో జరగనున్న సీపీఐ(ఎం) జిల్లా మహాసభల సందర్భంగా మంగళవారం స్థానిక ఏలూరుభవన్లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జిల్లా సమగ్ర అభివృద్ధి ప్రజా సమస్యలపై మహాసభలో చర్చిస్తామన్నారు. కమ్యూనిస్టులకు బలమైన ఉద్యమ కేంద్రంగా ఇల్లందు సీపీఐ(ఎం) పార్టీ 1967లో ఏర్పడగా 57 సంవత్సరాలకు తొలిసారిగా ఇల్లందులో పార్టీ జిల్లా మహాసభలు జరుగుతున్నాయని అన్నారు. 1957లో తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికల నుండి నేటి వరకు 14 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరగగా తొమ్మిది విడతలు కమ్యూనిస్టులే ఎమ్మెల్యేలుగా గెలిచారని అన్నారు. నాటినుండి కమ్యూనిస్టులకు ఉద్యమ కేంద్రంగా విరాసిల్లుతోందన్నారు. గిరిజనులు కార్మికులు బడుగు బలహీన వర్గాలు, మైనార్టీల అభివృద్ధి కోసం వారి హక్కుల కోసం నిరంతరం పాటుపడుతోందన్నారు. బొగ్గు గనులకు పుట్టినిల్లయిన ఇల్లందులో జిల్లా మహాసభలు జరపడం చారిత్రాత్మకమన్నారు. తాగు, సాగు నీటి పథకాలలో జిల్లాకు అన్యాయం జరుగుతోందన్నారు.

జిల్లా సమగ్ర అభివృద్ధి ప్రజా సమస్యలపై మహాసభలో చర్చిస్తాం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఒక ప్రత్యేకత ఉంది. పారిశ్రామిక జిల్లా కేంద్రంగా మూడు లక్షల మంది కార్మిక వర్గం ఉందన్నారు. అత్యధికంగా గిరిజన వెనుకబడ్డ వర్గాల వారు ఉన్నారని అన్నారు. వ్యవసాయ రంగం కూడా ప్రముఖ పాత్ర పోషిస్తుంది అన్నారు. కేటీపీఎస్, స్పాంజ్ ఐరన్, సింగరేణి, ఐటీసీ ఉందన్నారు. ప్రయివేటీకరణ, టెక్నాలజీ, యాంత్రికరణ పెరిగి ఉద్యోగాలు తగ్గాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో పరిశ్రమలు మూతపడుతున్నాయన్నారు. వారి విధానాలను ప్రతిఘటిస్తూ పారిశ్రామికంగా ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం ఉందన్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లా అంతటికి సాగు తాగునీరు అందించాలని, రైతులకు నష్టపరిహారాలు, కొత్త పరిశ్రమల స్థాపన ఉపాధి కల్పన కై ఉద్యమలు నిర్వహించే ప్రణాళిక మహాసభల్లో రూపొందిస్తున్నామని తెలిపారు.

నూతన బొగ్గు బావులతో పూర్వ వైభవం తేవాలి

ప్రభుత్వాలు ఏవైనా ప్రజల మేలు కోసం ఉద్యమాలు

బొగ్గు గనులకు పుట్టినిల్లు అయిన బొగ్గుటకు గొప్ప చరిత్ర ఉందన్నారు. నాడు 20,000 మంది ఉన్న కార్మికులు నేడు 750కి తగ్గటం బాధాకరమన్నారు. పూర్వ వైభవానికి నూతన బొగ్గు బావులు తీసి పారిశ్రామిక అభివృద్ధి చేయాలన్నారు. ప్రభుత్వాలు ఏవైనా ప్రజా సమస్యలపైనే ఉద్యమాలు చేస్తామన్నారు. ఆశ, భోజన వర్కర్లు, తదితర అనేక స్కీమ్ వర్కర్ల సమస్యలపై అలుపెరగని పోరాటం సీపీఐ(ఎం), సీఐటీయూ, ప్రజా సంఘాలు చేస్తున్నాయన్నారు. ఇల్లందు అభివృద్ధి, స్కీమ్ వర్కర్ల సమస్యలపై కూడా మహాసభలో చర్చిస్తామన్నారు.

ఆర్థిక సహకారం అందించిన ప్రజలకు కృతజ్ఞతలు

20, 21న జరిగే సీపీఐ(ఎం) జిల్లా మహాసభల విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

ఇల్లందులో 20, 21న జరిగే సీపీఐ(ఎం) జిల్లా మహాసభలకు వేలాదిమంది ప్రజలు వారికి తోచినంత ఆర్థిక సహాయం చేశారని వారందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. రెండు రోజులు జరగనున్న మహాసభలకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర నాయకులు, వందలాది మంది మహాసభల ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు.

మహాసభలకు 10 కమిటీలు వేశామని విజయవంతనికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపుని చ్చారు. పార్టీ మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు మచ్చ వెంకటేశ్వర్లు, ఏజే రమేష్, జిల్లా నాయకులు అబ్దుల్ నబీ, కొండపల్లి శ్రీధర్, రేపాగుల శ్రీనివాస్, మండల నాయకులు తాలూరి కృష్ణ, అబ్బాస్ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.



ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి

నవతెలంగాణ-బూర్గంపాడు

ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నిటినీ అమలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి అన్నారు. మంగళవారం సీపీఐ(ఎం) మండల కమిటీ సమావేశం సారపాక కార్యాలయంలో పాపినేని సరోజన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన అన్నారు. మహిళలకు బస్సు ఫ్రీగా అనేది తప్ప బస్సుల్ని పెంచలేదని, మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు. రూ.2500 ప్రతి మహిళలకు నెలకు ఇస్తానని అమలు చేయలేదని, ఉపాధి కార్మికులకు రూ.12 000 ఇస్తానని అమలు కాలేదని ఆయన అన్నారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన అన్నారు. లేని పక్షంలో ప్రజలతో పెద్ద ఎత్తున రానున్న కాలంలో పోరాటాలు ఉద్యమాలు చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, మండల కమిటీ సభ్యులు భయ్యా రాము, పాండవుల రామనాథం, ఎస్.కె అబిదా, గుంటక కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి బ్యాంకర్లు సహకరించాలి

- అడిషనల్ సెక్రటరీ డీఎఫ్ఎస్, జీఓఐ డాక్టర్ ఎంపీ తంగిరాల





నవతెలంగాణ-పాల్వంచ

జిల్లాలో వివిధ ఆర్థిక మద్దతు పథకాల లక్ష్య సాధనకు రుణాల అందించడంలో అన్ని బ్యాంకులు సహకరించాలని డాక్టర్ ఎంపీ తంగిరాల, అడిషనల్ సెక్రటరీ డీఎఫ్ఎస్, జీఓఐ అన్నారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో నీతి అయోగ్ ఆకాంక్షిత జిల్లా కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ, ప్రయివేటు బ్యాంకు అధికారులు, జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌తో కలిసి నిర్వహించారు. సమీక్ష సమావేశంలో భాగంగా కలెక్టర్ ఆకాంక్షిత జిల్లా అభివృద్ధిలో భాగంగా విద్య వైద్య ఆరోగ్యశాఖ, సంవర్ధక శాఖ, గ్రామీణాభివృద్ధి సంస్థ, వ్యవసాయ శాఖ తదితర శాఖలలో జిల్లాలో చేపడుతున్న అన్ని కార్యక్రమాలను శాఖల వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేంద్ర సభ్యులకు వివరించారు. జిల్లాలో నీటి కుంటలు, కెనాల్ బండ్ ప్లాంటేషన్, మునగ సాగు, మట్టితో ఇటుకల తయారీ వంటి కార్యక్రమాల గురించి కలెక్టర్ సభ్యులకు వివరించారు. ఎస్ఐడీబీఐ బ్యాంకు వారు ఎంఎస్ఎంఈలకు కంపారిజన్ బయో గ్యాస్ ప్లాంట్ కోసం కెనరా బ్యాంక్, తేనెటీగల పెంపకం, డ్రాగన్ ఫ్రూట్ సాగు, జీడి పంట వంటి పంటల విస్తరణ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, చిన్న తరహా పరిశ్రమలు, కమ్యూనిటీ పశువుల షెడ్లు తదితర అభివృద్ధి పనులు చేపట్టడానికి సహాయ సహకారం అందించాలని అడిషనల్ సెక్రటరీ, డీఎఫ్ఓ వారిని కోరారు. ఆకాంక్షిత క్రమంలో భాగంగా ఏఎంసీ రిజిస్ట్రేషన్, ఆసుపత్రులలో డెలివరీ, ఇప్పుడే పుట్టిన శిశువులకు తల్లిపాలు తాగించడం వంటి తదితర అంశాలలో పురోగతిపై అడిషనల్ సెక్రటరీ అధికారులను అభినందించారు.

అనంతరం డాక్టర్ ఎంపీ తంగిరాల అడిషనల్ సెక్రటరీ డీఎఫ్ఎస్, జీఓఐ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, పీఎం జనరల్ యోజన, ముద్ర రుణాలు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో ముద్ర లోన్ మంజూరు ఎందుకు తక్కువగా ఉందని బ్యాంక్ అధికారులను అడిగారు. ఆర్థిక మద్దతు పథకాలకు సంబంధించి 100శాతం లక్ష్యసాధనకు బ్యాంకర్లు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఆకాంక్షిత జిల్లా అభివృద్ధిలో భాగంగా జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, నిన్న తరహా పరిశ్రమలు స్థాపించాలని అన్నారు.

ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకంలో భాగంగా జిల్లాలో ప్రధానమంత్రి సురక్ష యోజన, అటల్ పెన్షన్ యోజన, పీఎం జనధన్ యోజన పథకాలను పంచాయతీ సెక్రటరీలు అత్యధిక లక్ష సాధన చేసిన పదిమందికి జనవరి 26 రిపబ్లిక్ డే రోజున సన్మానం ప్రశంసా పత్రాలు అందజేపడతాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సీపీఓ సంజీవరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ రెడ్డి, అన్ని బ్యాంకుల అధికారులు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



భూ సేకరణ చేసి ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందజేస్తాం

- సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు ప్రత్యేక ఉప కలెక్టర్ జె.కార్తీక్

నవతెలంగాణ-బూర్గంపాడు

కాలువలకు భూసేకరణ చేసి ప్రభుత్వ నుంచి వచ్చినటు వంటి నష్టపరిహారాన్ని అందించడం జరుగుతుందని సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు ప్రత్యేక ఉప కలెక్టర్ జె.కార్తీక్ అన్నారు. మండల పరిధిలోని కృష్ణసాగర్, మోరంపల్లి బంజర్, సోంపల్లి గ్రామ పంచాయతీలలో మంగళవారం పీసా గ్రామ సభలు ప్రశాంతంగా ముగిశాయి. సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు ప్రత్యేక ఉప కలెక్టర్ జె.కార్తీక్ అధ్యక్షతన పీసా గ్రామసభలు నిర్వహించారు. సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ ప్యాకేజీ వన్ కాలువ నిర్మాణం గురించి పీసా చట్టం సెక్షన్ 4, భూసేకరణ చట్టం సెక్షన్ 41 ఎల్ ఏ యాక్ట్ 2013 ప్రకారం పీసా గ్రామ సభలు నిర్వహించి పీసా కమిటీ అనుమతి తీసుకొనటానికి గ్రామ సభలు నిర్వహించి సంబంధిత వ్యక్తుల నుండి అభిప్రాయాలు సేకరించడం జరిగిందని కార్తిక్ తెలిపారు. ప్రాజెక్టు నుండి పిల్ల కాలువలు తీసి సాగునీరు అందించే క్రమంలో కాలువలకు భూసేకరణ చేసి ప్రభుత్వ నుంచి వచ్చినటు వంటి నష్టపరిహారాన్ని అందించడం జరుగుతుందన్నారు. కాలువలు తవ్వే క్రమంలో రైతుల భూమి నష్టం విలువ అంచనావేసి నష్టపరిహారం అందించడమే కాకుండా అడ్డువచ్చిన బోర్లకు, చెట్లకు సపరేటు ప్యాకేజీ చెల్లించడం జరుగుతుందన్నారు. అనంతరం పలువురు రైతులు మాట్లాడుతూ ఎకరం, అరెకరం భూములు ఉన్న రైతుల భూముల నుండి మధ్యలో రెండు భాగాలు చేస్తూ పంట కాలువ తీస్తే తమకి తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. అట్టి పొలానికి మొత్తం నష్టం చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. తమ విలువైన భూములకు ఎక్కువ మోతాదులో నష్టం పరిహారం అందించే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. మరి కొంతమంది రైతుల నుండి కొన్ని సమస్యలను పరిగణంలో తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ శ్యాం బాబు, ఆర్ఐ నరసింహారావు, సర్వేరు సంజీవ్, మూడు గ్రామపంచాయతీ సెక్రటరీలు భవాని, నాగిరెడ్డి, వెంక టేశు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మంచి ఫలితాలతో ఉత్తీర్ణత సాధించాలి

- ఇంటర్మీడియట్ విద్యాధికారి వెంకటేశ్వరరావు



నవతెలంగాణ-దుమ్ముగూడెం

కళాశాల విద్యార్థులకు ప్రణాళిక బద్ధంగా విద్యా బోధన జరిపి, సత్ఫలితాలను సాధించాలని ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటర్మీడియట్ కమిషన్ ఇచ్చిన ఆదేశాల మేరకు విద్యార్థులు అధిక ఉత్తీర్ణత సాధించే దిశగా అధ్యాపకులు 90 రోజుల ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల ప్రతిభాపాటవాలను పరీక్షించారు. రాబోయే పరీక్షల దృశ్య ఏ విధంగా సన్నద్ధం కావాలన్న విషయంపై విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. ప్రాక్టికల్ పరీక్షల సమీపిస్తున్న దృశ్య విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా ఒక టైం టేబుల్ తయారు చేసుకొని వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం కళాశాల రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలపై కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ కృష్ణవేణిను ప్రశ్నించారు. విద్యార్థులందరూ శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని, విద్యార్థుల హాజరు శాతం పై కూడా తల్లిదండ్రులతో ఎప్పట ికప్పుడు మాట్లాడుతున్నట్లుగా కళాశాల ప్రిన్సిపాల్ ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్



నవతెలంగాణ-టేకులపల్లి

టేకులపల్లి మండలంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను అదనపు జిల్లా (రెవిన్యూ) అదనపు కలెక్టర్ వేణుగోపాల్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఇండ్లు లేని, నిరుపేదలకు ప్రభుత్వం నీడ కల్పించాలనే ఉద్దేశ్యంతో ఇందిరమ్మ ఇండ్లు అందిస్తుందన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న, దరఖాస్తుదారుల వివరాలను, ఇందిరమ్మ ఇండ్ల యాప్‌లో పొరపాట్లు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగ భవాని, ఎంపీడీవో రవీంద్రరావు, ఎంపీఓ గాంధీ, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



చిలక నర్సింహారావుకు మెచ్చా నివాళి

నవతెలంగాణ-దమ్మపేట

దమ్మపేటకు చెందిన చిలకా నర్సింహారావు గుండెపోటుతో సోమవారం రాత్రి మరణించారు. విషయం తెలుసుకున్న అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు చిలకా నర్సింహారావు పార్థీవ దేహాన్ని మంగళవారం సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయనతో పాటు నాయకులు పాకనాటి శ్రీను, అబ్దుల్ జిన్నా, యార్లగడ్డ శ్రీను, దారా జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

1000 మంది ఆదివాసీలకు దుప్పట్లు పంపిణీ

- సేవలు మరింత విస్తరింజే చేస్తాం : గంటా రాధ



నవతెలంగాణ-మణుగూరు

ధానధర్మ ట్రస్ట్ చైర్‌పర్సన్ గంటా రాధ ఆధ్వర్యంలో 1000 మంది ఆదివాసులకు ఉచిత దుప్పట్లు పంపిణీ చేశారు. మంగళవారం మండలంలోని అన్నారం గ్రామంలో దుప్పట్ల కార్యక్రమం ఆమె చేపట్టారు. శ్రీ దత్త హ్యూమెన్ సర్వీసెస్ సేవాదళ్, హైదరాబాద్ వారి సహకారంతో దుప్పట్ల పంపిణీ నిర్వహించామని చైర్మెన్ తెలిపారు. ఈ సందర్భంగా రాధా మాట్లాడుతూ మణుగూరు సబ్ డివిజన్‌లోని అశ్వాపురం, మణుగూరు, పినపాక, కరకగూడెం, తదితర మండలాల్లో ఆదివాసీ గ్రామాలలో రోడ్డు, కరెంటు, విద్యా, వైద్య సౌకర్యాలు లేవన్నారు. పాఠశాల సౌకర్యాలు లేక చిన్న పిల్లలు తల్లిదండ్రులతో వేటకు వెళుతున్నారని అన్నారు. పాఠశాల సౌకర్యాలు ఏర్పాటు చేసి చదువు అందించాలని కోరారు. పెద్దల సహకారంతో ఉచిత బట్టల పంపిణీ, కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో వాలంటీర్లు, సుమారు వెయ్యి మందికి పైగా ఆదివాసులు గ్రామస్తులు పాల్గొన్నారు. పీహెచ్సి డాక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. సుమారు 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించామని డాక్టర్ శివకుమార్ తెలిపారు. హైదరాబాద్ సేవాదళ్ బృందం తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | డిసెంబర్ 18, 2024 | www.navatelangana.com

రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి : రేగా



నవతెలంగాణ-మణుగూరు

లగచర్ల రైతులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు డిమాండ్ చేశారు. మంగళవారం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం బలవంతంగా రైతుల భూములు లాక్కుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేకనే ఇలాంటి ఘటనలను సృష్టిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అభిమానాన్ని కోల్పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ కన్వీనర్లు కుర్రి నాగేశ్వరరావు, కుంట లక్ష్మణ్, కో కన్వీనర్లు నూకల రమేష్, బొలిశెట్టి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం రూరల్ : గచర్ల భూసేకరణ బాధితులకు అండగా బీర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో లగచర్ల రైతాంగానికి న్యాయం చేయాలని రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ భద్రాచలం మండల పార్టీ కన్వీనర్ ఆకోజు సునీల్ కుమార్ మాట్లాడారు. జైల్లో ఉన్న రైతులను తక్షణమే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ కో కన్వీనర్ రేపాక పూర్ణచంద్రరావు, మండల పార్టీ నాయకులు జయ ప్రేమ్ కుమార్, మండల నాయకులు అయినాల రామకృష్ణ, ఏడుకొండలు, నరసింహులు, సోషల్ మీడియా అధ్యక్షులు నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

కొత్తగూడెంలో నిరసన

కొత్తగూడెం : రైతులకు బేడీలు వేయడం రైతులను తీవ్రంగా అవమానించడమేనని, ఇదేనా కాంగ్రెస్ ప్రజా పాలన అని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా లగచర్ల సంఘటనకు నిరసనగా జరిగిన కార్యమంలో భాగంగా కొత్తగూడెంలో నిరసన కార్యక్రమం జరిగింది. స్థానిక పోస్టాఫీస్ సెంటర్‌లోని విగ్రహం వద్ద నిరసన చేశారు. అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ కొత్తగూడెం నియోజకవర్గం ఇంచార్జ్, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్ యాదవ్, మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, పాల్వంచ సొసైటీ ఉపాధ్యక్షులు కాంపెల్లి కనకేష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం రాజ్యాంగ విరుద్ధంగా ఫార్మా కంపెనీల కోసం నిర్బంధంగా వ్యవసాయ భూములను లక్కోవడాన్ని వ్యతిరేకించిన రైతులకు బేడీలు వేసి జైలుకు పంపించారని వెంటనే రైతులను బేషరతుగా విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్, కోకన్వీనర్ కణితి రాముడు, ఎండి జానీ పాషాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ ములకపాడు గ్రామంలో గల అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రేసు మండల ఉపాధ్యక్షులు అపక వీర్రాజు, నాయకులు కణితి లక్ష్మణ్, నక్క శిలువ కుమార్, లంక శివ, జుంజూరి జయసింహ, మడకం భూపతి, జిలకర గంగరాజు, మాజీ సర్పంచ్ భూక్యా చందు, వెంకటేష్, నాగరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆఫీస్ చుట్టూ కాదు మీ ఇంటి వద్దకే ఇంటి నెంబర్

- బృహత్తర కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- మున్సిపల్ చైర్మెన్ డీవీ



నవతెలంగాణ-ఇల్లందు

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి నెంబర్ ఇచ్చేందుకు శాసనసభ్యులు కోరం కనకయ్య సూచన మేరకు మున్సిపల్ పాలకవర్గం ప్రత్యేక కార్యచరణ చేపట్టింది. అందులో భాగంగానే మొదటగా 12, 13 వార్డులలో అర్హులుగా ఉండి ఇంటి నెంబర్ లేనివారికి వెంటనే నెంబర్ ఇచ్చేందుకు ఆర్ అండ్ ఆర్ కాలనీలోని ట్యాంకు కింద మంగళవారం ప్రత్యేక క్యాంపు ఏర్పాటు ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని ఇల్లందు మున్సిపల్ చైర్మెన్ దమ్మలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్ ప్రారంభించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డులో అర్హులైన ప్రతి ఇంటికి ఇంటి నెంబర్ ఇచ్చేందుకు ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అర్హులై ఇంటి నెంబర్ లేని వారు తమ తమ డాక్యుమెంట్స్ అన్నీ తమ దగ్గర పెట్టుకొని మీ వార్డులో క్యాంపు ఏర్పాటు చేసినప్పుడు ఇంటి నెంబర్ కోసం అప్లై చేసిన వెంటనే ఇంటి నెంబరు కేటాయిస్తామని తెలిపారు. బృహత్తర కార్యక్రమాన్ని ఇల్లందు పట్టణ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోగలరని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కటకంచి పద్మ, జిల్లా కాంగ్రెస్ నాయకులు మడుగు సాంబమూర్తి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు సిలివేరి సత్యనారాయణ, కడకంచి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు

- టీపీసీసీ జిల్లా మీడియా అండ్ కమ్యూనికేషన్ కన్వీనర్ దేవా



నవతెలంగాణ-దుమ్ముగూడెం

ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు అందజేయడం జరుగుతుందని టీపీసీసీ జిల్లా మీడియా అండ్ కమ్యూనికేషన్ కన్వీనర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కనుబుద్ధి దేవా అన్నారు. మంగళవారం పెద్ద నల్లబెల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సంగెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే గ్రామ పంచాయతీ సెక్రెటరీ మల్లికార్జునతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా, ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చే విధంగా ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాయం అరుణ, మట్టా లక్ష్మి, పాయం వెంకటేష్, పంచాయతీ సిబ్బంది, మడకం నరసింహారావు, చంటి లక్ష్మీపతి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తమ ఫలితాలు



టేకులపల్లి : టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతి సంవత్సరం ఉత్తమ ఫలితాలు విద్యార్థులు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ సులోచన రాణి తెలిపారు. మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులకు సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కళాశాలలో చదివే విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై, తమ పిల్లల ప్రగతి నివేదికను, వారు ఎలా చదువుతున్నారని అడిగి తెలుసుకున్నారని తెలిపారు. ప్రిన్సిపాల్ సులోచన రాణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బసవమ్మ, సత్యవతి, ముంతాజ్ అలీ, శంకర్రావు, వేణుగోపాల్, శ్రీనివాసరావు, వరలక్ష్మి, ప్రమోద్ కుమార్, నాగేశ్వరరావు, అధ్యాపకేతర సిబ్బంది పుల్లారావు, రమేష్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు క్వార్టర్స్ కౌన్సెలింగ్

నవతెలంగాణ-ఇల్లందు

జీఎం వీసం కృష్ణయ్య ఆదేశానుసారం మంగళవారం ఎస్ఓటు జీఎం కార్యాలయంలో ఏరియా సింగరేణి ఉద్యోగులకు క్వార్టర్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సిలింగ్‌లో ఫ్రెష్ ఎలాట్ మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్ కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన ఉద్యోగులకు క్వార్టర్లు కేటాయించారు. ఈ సందర్భంగా ఎస్వోటు జీఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... అర్హత కలిగిన వారికి క్వార్టర్ అలాట్మెంట్ ఉత్తర్వులు జారీచేయబడతాయని, అలాగే క్వార్టర్ ఎలాట్ మెంట్ కమిటీ వారు పూర్తి పారదర్శకంగా, ఎలాంటి సిఫార్సులకు తావు లేకుండా నిబంధనలకు అనుగుణంగా క్వాటర్లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. డీజీఎం (పర్సనల్) జీవి.మోహనరావు, జూనియర్ అసిస్టెంట్ జి.వీరన్న, ఉద్యోగులు పాల్గొన్నారు.

ముగిసిన బాస్కెట్ బాల్ జిల్లా జట్ల ఎంపికలు



నవతెలంగాణ-కొత్తగూడెం

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం కప్-2024 పోటీలలో భాగంగా బాస్కెట్ బాల్ జిల్లా జట్ల ఎంపికలు మంగళవారం ముగిశాయి. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశం మేరకు, జిల్లా యువజన క్రీడల అధికారి పరదామ రెడ్డి అధ్యక్షతన ఎంపికలు నిర్వహించారు. సీనియర్ బాస్కెట్ బాల్ క్రీడాకారులు జాన్సన్ డేవిడ్ (బాబు) మనీ నాయుడు ఆధ్వర్యంలో కొత్తగూడెం ప్రగతి మైదానంలో జిల్లా బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహించి, సీఎం కప్-2024 రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలో పాల్గొనే జట్టును ఎంపిక చేశారు. పటిష్టమైన జిల్లా బాస్కెట్ బాల్ పురుషుల, స్త్రీల జట్లను ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. ఈ జిల్లా పోటీలకు గాను జిల్లా నలుమూలల నుండి సుమారు 120 బాస్కెట్ బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో నుండి అత్యద్భుతమైన ఆటను ప్రదర్శించిన క్రీడాకారులను ఎంపిక చేసి ఈనెల 27 నుండి 30 వరకు హైదరాబాదులో నిర్వహించు రాష్ట్ర స్థాయి సీఎం కప్-2024 పోటీలకు పంపించనున్నట్లు జిల్లా క్రీడల అధికారి పరందామ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ సిబ్బంది తిరుమల రావు, లక్ష్మణ్, సీనియర్ బాస్కెట్ బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

జీతాలు పెంచకపోతే సమ్మె చేస్తాం

- మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి.పద్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె. బ్రహ్మచారి
- రాత్రి చలిలోనూ కొనసాగిన నిరసన దీక్ష
- నిరసన దీక్షకు సీపీఐ(ఎం) మద్దతు
- డీఈఓకు వినతి పత్రం అందజేత





నవతెలంగాణ-పాల్వంచ

ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానం ప్రకారం రూ.10వేల వేతనాన్ని అమలు చేయకపోతే నిరవధిక సమ్మె చేస్తామని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు యూనియన్ సీఐటీయూ హెచ్చరించింది. 48 గంటల దీక్షలో భాగంగా కలెక్టరేట్ ఎదుట రెండో రోజు నిరసన కార్యక్రమం కొనసాగింది. మంగళవారం నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి.పద్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మచారి మాట్లాడారు. ప్రభుత్వం మాట తప్పకుండా ఇచ్చిన హామీ ప్రకారం రూ.10 వేల వేతనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వంటగ్యాస్‌ను ప్రభుత్వమే సప్లై చేయాలని డిమాండ్ చేశారు. జీతాలు పెంచకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. స్వీపర్లు, స్కావెంజర్లకు బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అమ్మ ఆదర్శ కమిటీలు అతి జోక్యం వల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని అమ్మ ఆదర్శ కమిటీల జోక్యాన్ని నివారించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మేనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటమే మార్గమని పోరాటాల ద్వారానే ప్రభుత్వాలు దిగి వస్తాయని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చ చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలందరూ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావన చేయాలని విజ్ఞప్తి చేశారు. 48 గంటల నిరసన దీక్షలో భాగంగా మొదటి రోజు రాత్రి 400 మంది వర్కర్లు తీవ్రమైన చలిలో సైతం కలెక్టరేట్ ధర్నా చౌక్‌లో నిద్రించారు. మా సమస్యల ముందు చలి తీవ్రత పెద్ద లెక్కేం కాదని నినాదాలు చేశారు. రెండో రోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నా వద్దకు జిల్లా విద్యాశాఖ అధికారి వచ్చి కార్మికుల వద్ద నుంచి వినతిపత్రం స్వీకరించారు. సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేస్తామని హామీ ఇచ్చారు. కోడిగుడ్ల ప్రభుత్వం సప్లై చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని త్వరలోనే ఆ సమస్య పరిష్కారం అవుతుందని హామీ ఇచ్చారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్, జిల్లా సహాయ కార్యదర్శి కె.సత్య పిట్టల అర్జున్, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుల్తానా, యూనియన్ నాయకులు రామలక్ష్మి, సమ్మక్క, వెంకట నరసమ్మ, కమల, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల పోరాటానికి అండగా ఉంటాం

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య

జీతాలు పెంచాలని ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్న వర్కర్లకు సీపీఐ(ఎం) జిల్లా కమిటీ మద్దతు తెలియజేసింది. కలెక్టరేట్ వద్ద నిరసన దీక్షలో పార్టీ జిల్లా కార్యదర్శి సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలచేసి తన చిత్తశుద్ధిని ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థ అభివృద్ధికి, ప్రభుత్వ విద్యా రంగం పరిరక్షణ కోసం మధ్యాహ్న భోజన పథకం కార్మికుల శ్రమ కీలకంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోసం మధ్యాహ్న భోజన పథకం కార్మికులు చేస్తున్న పోరాటాలకు సీపీఐ(ఎం) అన్ని విధాల అండగా ఉంటుందని, ప్రత్యక్ష భాగస్వామ్యం అవుతామని హామీ ఇచ్చారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు, ఎమ్మెల్యేలు అసెంబ్లీలో సమస్యలను ప్రస్తావించి మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలకు సంఘీభావం తెలిపినవారిలో సీపీఐ(ఎం) నాయకులు లిక్కి బాలరాజు, భుక్యా రమేష్ తదితరులు ఉన్నారు.



కార్పొరేషన్ ఏర్పాటు ప్రక్రియ వేగవంతం చేయాలి

- అసెంబ్లీ సమావేశంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని



నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలు, పరిసర గ్రామాలను కలుపుతూ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్న తన ప్రతిపాదలపై ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టేవిధంగా చర్యలు తీసుకోవాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అసెంబ్లీ స్పీకరును కోరారు. మంగళవారం జరిగిన అసెబ్లీ సమావేశాల్లో కూనంనేని మాట్లాడుతూ కొత్తగూడెం, పాల్వంచ, పరిసర గ్రామాలను కలుపుతూ కార్పొరేషన్ ఏర్పాటుపై 1/70 చట్టం అడ్డుగా ఉందని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డరుపై గత పాలకులకు, అధికారులకు సరైన అవగాహన లేకపోవడం, ఆర్డర్ అర్ధంచేసుకోవడంలో లోపంవల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని సభకు వివరించారు. అదేవిధంగా పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికల నిర్వహణకు ఆటంకంగా మారిందన్నారు. ఇలాంటి సాంకేతిక లోపాలను అధిగమించి కార్పొరేషన్ ఏర్పాటు, పాల్వంచ మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాల్సివుందన్నారు. పాల్వంచ కేటీపీఎస్‌లో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని త్వరితగతిన ప్రారంభించాలని సభా ముఖంగా స్పీకర్‌ని కోరారు. కార్పొరేషన్ ఏర్పాటు విషయై పలుమార్లు జిల్లా మంత్రుల సహకారంతో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, కార్పొరేషన్ ఏర్పాటుతో పారిశ్రామిక ప్రాంతాలైన కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలతోపాటు పరిసర గ్రామాలు మరింత అభివృద్ధి సాధించేందుకు దోహదపడుతుందని వివరించారు.

క్షయ వ్యాధి నిర్మూలనే ప్రభుత్వాల దృఢ సంకల్పం

నవతెలంగాణ-మణుగూరు

భారతదేశంలో క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంలో నిర్వహిస్తున్న 100 రోజుల ముమ్మర కృషి కార్యక్రమం నిక్షయ్ షివిర్‌లో భాగంగా మంగళవారం మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డా.శివ కుమార్ సార్ ఎన్టీఆర్ నగర్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పరిధిలోని గిరిజన ఆశ్రమ బాలికల వసతి గృహంలో పిల్లలకు క్షయ వ్యాధి పై అవగాహన, అనుమానితుల గుర్తింపు, శాంపిల్ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన క్షయ వ్యాధి తీవ్రంగా ఉన్న 347 జిల్లాల్లో తెలంగాణ రాష్ట్రంలో తొమ్మిది జిల్లాలు ఉన్నాయని అందులో మన జిల్లా ఒకటి అని, కాబట్టి క్షయ వ్యాధిపై సమాజంలోని ప్రతి ఒక్కరూ చర్చించుకుని అవగాహన పెంచుకొని దానిని పూర్తిగా నిర్మూలించడంలో సహకరించాలని ఈ సందర్భంగా కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మణుగూరు పరిధిలో గల ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలలో హెల్త్ క్యాంప్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా.శివ కుమార్ డాక్టర్ నిశాంత్ రావు, డాక్టర్ సునీల్, హెల్త్ అసిస్టెంట్లు సుమ, విజయ, ప్రమీల, రవి, శ్రీకాంత్, హెచ్.వి.సత్యవతి, ఎన్టీ ఈపీ స్టాఫ్ హెచ్ ఏ.రాంప్రసాద్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

కార్మికులపై జులూం...ప్రయివేట్ ట్రావెల్స్‌కి గులాం

ఆర్టీసీలో అంత నా ఇష్టం...2

- ఆర్టీసీ అధికారుల తీరుపై సర్వత్ర విమర్శ
- నవతెలంగాణ కథనాల ఆధారంగా ఈడీఓకి ఫిర్యాదు చేసిన విశ్రాంత ఆర్టీసీ అధికారులు
- ఆర్ఎం ఆలోచనలే ఆర్టీసీకి తిరోగమనలా..?





నవతెలంగాణ-భద్రాచలం రూరల్

పై అధికారులు మెప్పుకోసం ప్రొడక్టివిటీ పెంచామని చూపటం కోసం మస్టర్లను తగ్గించామని చెప్పడం కోసమో కార్మికులపై పనిభారాలను పెంచుతూ కార్మికుల మానసిక, శారీరక ఒత్తిడీలకు పరోక్షంగా ఉపకరిస్తూ కార్మికుల కనీస హక్కులను కాలరాస్తూ ఆర్టీసీ కార్మికులపై జులుం ప్రదర్శించ డమే కాకుండా పరోక్షంగా ప్రయివేట్ ట్రావెల్స్‌కి గులాం గిరి చేస్తున్నట్టుగా భద్రాచలం ఆర్టీసీ అధికారుల తీరు స్పష్టమవుతుంది. 40, 50 సంవత్సరాల చరిత్ర గల భద్రాచలం ఆర్టీసీ డిపోకి గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రక్షాళన పేరుతో సర్వీసులను తగ్గించిన ఫలితంగా భద్రాచలం నుండి హైదరాబాద్ బీహెచ్ఈఎల్ కూకట్ పల్లికి ప్రయివేట్ సర్వీసులు 20 నుండి 25 వరకు నడిచే అవకాశాన్ని పరోక్షంగా ప్రభుత్వ అధికారులు కల్పిస్తున్నారని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

చర్ల కేంద్రం నుండి కూడా నాలుగు ప్రయివేట్ ట్రావెల్ బస్సులు హైదరాబాద్ కూకట్ పల్లికి నడుస్తున్నాయి అంటే ఆర్టీసీ అధికారుల వైఫల్యం ఇంతకన్నా ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. స్థానిక రాజకీయ పార్టీలు ప్రజాప్రతినిధులు భద్రాచలం నుండి బీహెచ్ఈఎల్ సర్వీసులు కొనసాగించాలని విన్నవించినా ఆదేశించిన ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్య వైఖరి ఫలితంగా ఏజెన్సీ ప్రాంత ప్రయాణికులు ప్రయివేట్ దోపిడీకి గురవుతున్నారు. శని, ఆదివారాలలో కూకట్ పల్లి బిహెచ్ఎల్ వెళ్లే ప్రయాణికులను లక్ష్యంగా చేసుకొని భద్రాచలం నుండి వెళ్లే ప్రయివేట్ ట్రావెల్స్ మూడింతల చార్జీలు ఒక్కొక్కరికి సుమారు రూ.2000 నుండి 3000 వరకు వసూలు చేయడమే కాకుండా పండగల సీజన్‌లో అంతకంటే ఎక్కువే దోచుకుంటున్నారంటే ప్రధాన కారణం ఆర్టీసీ అధికారుల నిర్వాహకమే అని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. రోడ్ ట్రాన్స్పోర్ట్ నిబంధన ప్రకారం ఆర్టీసీ డిపో నుండి కనీసం 100 మైళ్ళ దూరం వరకు ఎటువంటి ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు లు నిలిపేందుకు అనుమతి లేనప్పటికీ భద్రాచలం ఆర్టీసీ ఇన్ గేట్ నుండి అవుట్ గేటు వరకు పదుల సంఖ్యలో ప్రయివేట్ ట్రావెల్ బస్సులు నిలిపి ఉంచ డమే కాకుండా ఆర్టీసీ బస్టాండ్‌లోకి వెళ్లే ప్రయాణికు లను లక్ష్యంగా చేసుకొని రవాణా వ్యాపారాన్ని నిర్వహి స్తున్నారంటే ప్రయివేట్ ట్రావెల్స్ పట్ల భద్రాచలం ఆర్టీసీ అధికారుల తీరు బట్టబయలు అవుతుంది.

ఆర్టీసీ అధికారుల తీరుపై సర్వత్ర విమర్శ

సర్వీసుల కుదింపుదుపై ప్రయాణికుల నుండి వ్యతిరేకత వచ్చినా స్థానిక ప్రజాప్రతినిధులు పునర్దించాలని ఆదేశించినా రాజకీయ పార్టీలు ప్రజల తరఫున సమస్యను అధికార దృష్టికి తీసుకు వచ్చినప్పటికీ స్పందించకపోగా అంతా మా ఇష్టం అన్నట్టుగా వ్యవహరిస్తున్న ఆర్టీసీ అధికారుల తీరుపై సర్వత్ర విమర్శలు వెలబడుతున్నాయి. ఓ పక్క మూడు మస్టర్లు ఇవ్వాల్సి వస్తుందన్న నేపంతో బిహెచ్ఎల్ కూకట్ పల్లి సర్వీస్‌ని రద్దుచేసి భద్రాచలం టు హైదరాబాద్ రెండు మాస్టర్లతోనే సర్వీసులు నిర్వహించడంతో కార్మికుల పై పని భారం పెరిగి డ్యూటీలకు పూర్తిస్థాయిలో హాజరుకాని నేపథ్యంలో వారికి ఛార్జ్ షీట్ వేసి ఇంక్రిమెంట్లు కట్ చేపించి గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ మూడు నెలల కాలంలోనే అత్యధికంగా కార్మికులను వేధిస్తున్నారన్న విమర్శలు వినబడుతున్నాయి.

భద్రాచలం ఆర్టీసీ డిపోలో ఓపక్క ప్రయాణికుల ఇక్కట్లతో పాటు కార్మికులపై జరుగుతున్న వేధింపులకు పై ఆర్ఎం స్థాయి అధికారులు స్పందించకపోవడం 1000 డాలర్ల ప్రశ్నగా మిగులుతుంది. గత ప్రభుత్వం కార్మిక యూనియన్‌లను రద్దు చేసిన ఫలితంగానే అధికారులు ఇష్టానుసారంగా ఆర్టీసీలో వ్యవహరిస్తున్నారన్న ప్రచారం జోరుగా సాగుతుంది. భద్రాచలం ఆర్టీసీ సేవలు సామాన్య ప్రయాణికులకు దూరమవ్వటానికి రీజనల్ మేనేజర్ అనాలోచితం నిర్ణయాలే కారణమని తెలుస్తుంది.

నవతెలంగాణ కథనాల ఆధారంగా ఈడీఓకి ఫిర్యాదు చేసిన విశ్రాంత ఆర్టీసీ అధికారులు

బీహెచ్ఈఎల్ కుకట్ పల్లి సర్వీసుల రద్దు పై గతంలో సీపీఐ(ఎం) పార్టీ ఇచ్చిన వినతిపత్రంతో పాటు స్థానిక ఎమ్మెల్యే సైతం ఆ సర్వీసులను పునర్దించాలని ఆదేశించినప్పటికీ ఆర్టీసీ అధికారులు స్పందించని ఫలితంగా మంగళవారం నవతెలంగాణలో ప్రచురించిన "అంతా నా ఇష్టం" కథనాలపై విశ్రాంత డిపో మేనేజర్ స్థాయి అధికారులు స్పందించారు. వారికున్న అనుభవం భద్రాచలం ఆర్టీసీ డిపోకున్న చరిత్రను కూడికరిస్తూ నవతెలంగాణ కథనాలను జతపరిచి ఇప్పటికే ఈడీఓకి ఆన్లైన్లో ఫిర్యాదు చేశారని తెలిసింది. నవతెలంగాణ కథనంపై సోషల్ మీడియా వేదిక పలువురు ఆర్టీసీ తాజా మాజీ ఉద్యోగస్తులు సైతం చర్చలు జరిపి నవతెలంగాణ వాస్తవ కథనాలపై ఆర్ఎం స్థాయి అధికారులు స్పందించాలని ఆయా సామాజిక మాధ్యమాలలో విన్నపించారు. ఇప్పటికైనా స్థానిక ప్రజలు రాజకీయ పార్టీలు లేవనెత్తిన అంశాలను పరిగణంలో తీసుకొని ఈ ప్రాంత ప్రయాణికుల సౌలభ్యం దృష్టిలో పెట్టుకొని బిహెచ్ఇఎల్ కుకట్ పల్లి సర్వీసును పునర్దించకపోతే పలు రాజకీయ పార్టీలు ఉద్యమానికి సిద్ధమవుతున్నాయని తెలుస్తుంది.

విద్యార్థుల కనీస సామర్థ్యాలను మెరుగుపరిచేందుకే ఉద్దీపకం వర్క్ బుక్స్

- ఐటీడీఏ పీఓ బి.రాహుల్



నవతెలంగాణ-దుమ్ముగూడెం

జీపీఎస్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు ఇంగ్లీష్, గణితంలో కనీస సామర్థ్యాలను మెరుగుపరిచేందుకే ఉద్దీపకం వర్క్ బుక్స్ ప్రవేశ పెట్టడం జరిగిందని ఉపాధ్యాయులు ఆచరణలో పెట్టడం లేదని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని బండారు గూడెం, రేగుంట జీపీఎస్ పాఠశాలలను, ఆర్లగూడెం ఏహెచ్ఎస్ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించి, ఎస్ఆర్పి పనితీరును, ఉద్దీపకం వర్క్ బుక్స్‌కు సంబంధించిన పాఠ్యాంశాలను విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నది, పిల్లలను అడిగి వారి చేత బోర్డుపై రాయించి ఒక్కొక్క విద్యార్థిని లేపి వర్క్ బుక్‌లోని సారాంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మూడవ తరగతి నుండి 5వ తరగతి వరకు చదువుతున్న గిరిజన పిల్లలు ఇంగ్లీష్ గణితం చదవడం, రాయడంలో వెనుకబడి పోతున్నందున గణితంలో గణిత ప్రాథమిక స్థాయి సంఖ్యల నుండి కూడికలు, తీసివేతలు, గుణకారాలు, బాగా హారాలు, చిత్రాలతో విద్యార్థి పాఠశాలల్లో ఆనందం, ఆహ్లాదంగా నేర్చుకొనుటకు అనుకూలంగా ఉద్దీపకం వర్క్ బుక్స్ తయారు చేసినట్టు తెలిపారు. ఎస్ఆర్పీ పనితీరు మెరుగుపరచుకునీ ప్రతిరోజూ తన పరిధిలోని పాఠశాలలను పర్యవేక్షించి ఉపాధ్యాయులకు ఉద్దీపకం వర్క్ బుక్ సంబంధించిన కృత్యాలు పిల్లల చేత చేయిస్తున్నది, లేనిది పర్యటించాలన్నారు. రేగుంట పాఠశాల ఉపాధ్యాయురాలు వసంత అనాధికారిక సెలవు పై వెళ్ళినందున, వెంకన్న, సత్తెమ్మ టీచింగ్ డైరీ నిర్వహణ సరిగా లేనందున షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఏసీఎమ్ఓ రమణయ్యను ఆదేశించారు. అనంతరం ఆర్లగూడెం ఏహెచ్ఎస్ పాఠశాలలు సందర్శించి వేదిక్ మ్యాథ్స్ గదులను పరిశీలించారు. నూతనంగా ప్రవేశపెట్టిన మెనూ ప్రకారం తప్పనిసరిగా పిల్లలకు బ్రేక్ ఫాస్ట్ నుండి డిన్నర్ వరకు వేడిగా ఉన్నప్పుడే పిల్లలకు పెట్టాలని, హెచ్ఎం వార్డెన్ ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని, మెనూ సరిగా అమలు చేయకపోతే సంబంధిత హెచ్ఎం, వార్డెన్లకు కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సోమశేఖర్, ఎస్సీఆర్పీ రామారావు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ నిజమేనా..?

- లబ్దికోసం సంఘం ఏర్పాటు
- మాజీ క్రీడా కారులు తీవ్ర ఆరోపనలు



నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొంత మంది క్రీడా సంఘాలను నెలకొల్పి పబ్బం గడుపుకుంటుంన్నారని కొంత మంది సీనియర్ క్రీడాకారులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి ఎన్నికలు లేకుండానే సంఘం నిర్వహిస్తున్నారని, ఇది పూర్తిగా సొంత లాభం కోసమేనని బలమైన ఆరోపనలు చేస్తున్నారు. ఏజన్సీ జిల్లా కావడం, అడిగే వారు లేక పోవడంతో యదేచ్ఛగా సంఘం పేరుతో పబ్బం గడుపుకుంటున్నారని, అధికారులను బురిడి కొట్టించి కాలం వెళ్లదీస్తున్నారని ఆరోపనలు వినిపిస్తున్నాయి. తెలంగాణలో ఉన్న 33 జిల్లాలు ఉన్నప్పటికీ కేవలం పూర్వ 10 ఉమ్మడి జిల్లాలకు మాత్రమే జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఏర్పాటుకి తెలంగాణ రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఈ మధ్య కాలంలో అన్ని జిల్లాలతో పాటు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలను కలిపి ఉమ్మడి జిల్లాగా ఒలింపిక్ జిల్లా అసోసియే షన్‌ని ఎలక్షన్స్ ద్వారా ఎన్నుకున్నారు. రాష్ట్ర అసోసియేషన్‌కి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా తు తు మంత్రంగా ఎన్నిక నిర్వహించారని కొంత మంది వెటరన్ క్రీడాకారులు ఆరోపిస్తున్నారు. కలెక్టర్, క్రీడా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

స్వలాభం కోసం ఏర్పాటు : ఎండి.బాబ్జి, సీనియర్ జాతీయ అథ్లెటిక్స్ క్రీడాకారుడు

ఒలింపిక్ అసోసియేషన్‌ని కొంత మంది స్వార్ధ పరులు స్వలాభం కోసం ఏర్పాటు చేసుకున్నారు. జిల్లాలో ఒలింపిక్ అసోసియేషన్ పేరుతో ఒక అసోసియేషన్‌ని రిజిస్టర్ చేయించి రాష్ట్ర అసోసియేషన్‌కి అనుసంధానం లేకుండా అధికారిక కార్యక్రమాల్లో పాల్గొని జిల్లా అధికారులను, జిల్లా నాయకులకు తప్పుడు సమాచారంతో అసోసియేషన్‌లో వున్నా కొంత వారి లబ్ది పొందేలా వ్యవహరిస్తున్నారు.

ఇటీవలే ఎన్నికలు జరిగాయి

ఒలంపిక్ అసోసియోషన్‌ను జిల్లాకు చెందిన కొంత మంది క్రీడాకారులు సంఘంగా ఎన్నుకున్నారు. ఈ విషయంలో రాష్ట్ర సంఘానికి సామాచారం ఉంది. ఈ అసోసియోషన్ పేరుతో ఎలాంటి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం లేదు. జిల్లాలో ఎలాంటి క్రీడాలు నిర్వహించనప్పటికీ ఒలంపిక్ అసోసియోషన్ సంఘం వారు క్రీడ నిర్వహనకు సహకరిస్తున్నారు. క్రీడా సంఘం ఎన్నికను రాష్ట్ర సంఘం గుర్తింపుకు వారు ప్రయత్నం చేస్తున్నారని సమాచారం.

సింగరేణి దినోత్సవం సందర్భంగా మహిళలకు క్రీడా పోటీలు

నవతెలంగాణ-ఇల్లందు

సింగరేణి దినోత్సవంలో భాగంగా మంగళవారం సింగరేణి మహిళా ఉద్యోగులకు జనరల్ మేనేజర్ ఆఫీసు అవరనంలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ క్రీడలలో మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు డిసెంబర్ 23న జరిగే సింగరేణి దినోత్సవ వేడుకలలో జీఎం చేతుల మీదగా బహుమతులు అందజేస్తారు.
ఈ కార్యక్రమంలో ఏరియా సీనియర్ పర్సన్ ఆఫీసర్ సాయి స్వరూప్, సేవా సమితి కో ఆర్డినేటర్ బి.కే సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం | డిసెంబర్ 18, 2024 | www.navatelangana.com



రైతన్నకు బేడీలు వేసి, వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం సిగ్గుమాలిన చర్య

- మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ

నవతెలంగాణ-ఇల్లందు

దేశానికి అన్నం పెట్టే రైతన్నకు బేడీలు వేసి, వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం సిగ్గుమాలిన చర్యని మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మంత్రులకేమో జల్సాలు, రైతులకు ఏమో బేడీలు అన్న చందంగా కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన నడుస్తుందన్నారు. సోషల్ మీడియాలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ పోస్టులు పెడితే మా సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడం సిగ్గుమాలిన చర్యన్నారు. లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నిలదీస్తే నిర్బంధాలు, అడిగితే అరెస్టులు, ప్రశ్నిస్తే దాడుల పర్వంతో పాలన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగ బద్ధంగా కాకుండా పోలీసులతో సీఎం రేవంత్ రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని విమర్శించారు.

ఆల్ పెన్షనర్స్ ఆధ్వర్యంలో ఘనంగా పెన్షనర్స్ డే

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ భద్రాచలం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పెన్షన్స్ కార్యాలయంలో మంగళవారం పెన్షన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బందు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈనాడు విశ్రాంత ఉద్యోగులు పెన్షన్ పొందటానికి డీఎస్ నకారా కారకుడు అని ఆయన పెన్షన్ దారుల కోసం చేసిన న్యాయపోరాటం, విశేష మైన గుర్తింపు లభించుటకు కారణం అయ్యిందన్నారు. వారి పోరాట ఫలితమే ఈనాడు పెన్షనర్లు పెన్షన్ పొందుట జరుగుతుందని అన్నారు. అనంతరం గంజి బాబు, గండేపల్లి సీతారత్నంను పూలదండలతో శాలువలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎస్ రాజబాబు, బద్రీనాథ్, గంజి బాబు తదితరులు కూడా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కెఎస్ఎల్వి ప్రసాద్, కోశాధికారి డి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వనవాసీ విద్యార్థులకు రగ్గుల పంపిణీ

నవతెలంగాణ-చర్ల

చర్ల వాస్తవ్యులు చింతలపూడి రామకృష్ణ – లక్ష్మి దంపతుల మనవడు హైదరాబాద్ వాసి శిరికోటి ఉపేందర్ – రవళిక దంపతుల ద్వితీయ వివాహ వార్షికోత్సవం సందర్భంగా చర్లలోని వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం విద్యార్థి నిలయ విద్యార్థులకు రగ్గులను పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక వనవాసీ నిలయంలో జరిగిన కార్యక్రమంలో రామకృష్ణ దంపతులు విద్యార్థులకు రగ్గులను అందచేశారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు. ఇక్కడి విద్యార్థుల క్రమ శిక్షణ తమను ఎంతో ఆకట్టుకున్నదని అన్నారు. వనవాసీ ప్రాంత మహిళా సహ ప్రముఖ్ పెద్దాడ ఆశాలత మాట్లాడుతూ విద్యార్థులకు రగ్గులను అందచేసిన ఉపేందర్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిలయ కమిటీ సభ్యులు గొంది శోభన్ బాబు, జవ్వాది మురళీకృష్ణ, గోగికార్ రాంలక్ష్మణ్, వేములపల్లి ప్రవీణ్ బాబు, గొంది ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

- వేధింపులే కారణం : కుటుంబ సభ్యుల ఆరోపణ

నవతెలంగాణ - ఆళ్ళపల్లి



అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మడల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన పరమ రమేష్ అలియాస్ మెషక్ (38) మిర్చి సాగు, కలప రవాణా, మొబైల్ ఆన్ లైన్ గేములు, చిట్టీ వ్యాపారంలో డబ్బు వెచ్చించి తీవ్రంగా నష్టపోయాడు. దాంతో అప్పు ఇచ్చిన వారు డబ్బులు కట్టమని వెంటపడి అడగటంతో తలకు మించిన భారమై మనస్థాపానికి గురైన మెషక్ ఈనెల 11న సాయంత్రం గడ్డి మందు తాగాడు. విషయం ఆలస్యంగా తెలుసుకున్న కుటుంబ సభ్యులు రాత్రి సుమారు 7 గంటల సమయంలో ఆళ్ళపల్లిలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అదే రోజు అర్ధరాత్రి కొత్తగూడెంలోనే ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. గురువారం ఖమ్మంలోని మరో ప్రయివేట్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. మూడు రోజుల పాటు చికిత్స అనంతరం మెషక్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వైద్యుడి సూచన మేరకు కుటుంబ సభ్యులు స్వగ్రామం తీసుకుని వచ్చారు. బంధువుల సూచన మేరకు మరోమారు కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యానికి మెషక్ నిరాకరించడంతో తిరిగి ఆళ్ళపల్లిలోని తన ఇంటికి తీసుకొచ్చారు. సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య మౌనిక, ముగ్గురు కొడుకులు ఉన్నారు. ఎస్సై ఈ.రతీష్ కేసు నమోదు చేసి, పోస్ట్ మార్టం నిమిత్తం ఇల్లందు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్ట్ మార్టం అనంతరం ఎస్సై మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మెషక్ బలవన్మరణం వెనుక అప్పు ఇచ్చిన వారు వెంట పడి పదే పదే అప్పు కట్టమని వేధించడమే ప్రధాన కారణంగా కుటుంబ సభ్యులు, సమీప బంధువులు చెప్పుకొస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వడ్డీ వ్యాపారిపై కేసు నమోదు చేశారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

- టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు గుగులోత్ హరిలాల్ నాయక్

నవతెలంగాణ-పాల్వంచ

సమగ్ర శిక్షా ఉద్యోగులు గత 8 రోజులుగా కలెక్టరేట్ వద్ద గల ధర్నా చౌక్ లో చేస్తున్న సమ్మెకు తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) జిల్లా అధ్యక్షులు గుగులోత్ హరిలాల్ నాయక్ మద్దతు, సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు 8 రోజులుగా సమ్మె చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించుటలో భాగంగా చర్చలకు పిలవకుండా తాత్సారం చేయడం సరైనది కాదన్నారు. సీఎం వారిని చర్చలకు పిలిచి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, కేజీబీవీలో చదువుతున్న పేద విద్యార్థినీలకు విద్యాపరంగా నష్టం జరగకుండా, సమస్యలను పరిష్కరించి సిబ్బంది విధులకు హాజరై నాణ్యమైన విద్య అందించేటట్లు చూడాలన్నారు. ఈ శిబిరంలో టిపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రమేష్, ఎస్ఎస్ఏ జిల్లా అధ్యక్షులు మోహన్ భూక్య ప్రధాన కార్యదర్శి చందు భట్టు, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.సిద్ధు, ముఖ్య సలహాదారు వనమా సురేష్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదా ఘాతంతో యువకుడు మృతి

నవతెలంగాణ-తల్లాడ

పొట్ట కూటి కోసం వచ్చి మృత్యువాత పడిన ఓ యువకుని దీనగాధ. తల్లాడ -కొత్తగూడెం రహదారిలో వెంచర్, కాంపౌండ్ వాల్ కాంక్రీట్ వేస్తుండగా మంగళవారం విద్యుదా ఘాతంతో అలుగుల వెంకటేశ్వర్లు(35) మృతి చెందాడు. బంధువుల కథనం ప్రకారం, మూడు నెలల క్రితం ఆంధ్రప్రదేశ్ పల్నాడు జిల్లా, రొంపిచర్ల మండలం బుచ్చి పాపన్న పాలెం గ్రామానికి చెందిన అలుగుల వెంకటేశ్వర్లు, మరికొందరు సిమెంటు పని కోసం వెంచర్ కు వచ్చారు. వెంచర్‌లోనే నివాసం ఉంటున్నారు. మంగళవారం మిక్సర్ లో సిమెంటు కంకర కలిపి, కాంపౌండ్ వాల్ కు కాంక్రీట్ పోస్తుండగా మిక్సర్ పైకి లేపడంతో, 33 కెవి మెయిన్ లైన్ మిక్సర్ కు తగిలింది. దీంతో బకెట్ పట్టుకొని ఉన్న వెంకటేశ్వర్లు విద్యుదాఘాతంతో కుప్పకూలిపోయాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడని బంధువులు వాపోయారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

యాత్రికులను ఆకర్షించే విధంగా గిరిజన మ్యూజియం : పీవో

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి వచ్చే భక్తులు స్వామివారి దర్శనం చేసుకుని నేరుగా ట్రైబల్ మ్యూజియంను సందర్శించుకునే విధంగా అందరి సహకారం తీసుకొని ముమ్మరంగా ప్రచారం గావించి అత్యధికంగా పర్యాటకులు వచ్చేలా సన్నాహాలు చేస్తున్నామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. మంగళవారం ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియంను ఆయన సందర్శించి, సుందరీకరణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పాత తరం ఇండ్ల నిర్మాణం, గుడిసెలు, వారి కల్చర్, ఆదివాసీ వంటకాలు టూరిస్టులకు కనువిందు కలిగేలా చేపడుతున్న పనులు ముగింపు దశకు వచ్చాయని, ఈ మ్యూజియంను చూపరులకు ఆకర్షించే విధంగా డిజైనింగ్, మ్యూజియం ఎంట్రెన్స్ నుండి చుట్టుపక్కల మొత్తం సోలార్ లైట్లతో విద్యుత్ కాంతులు వెదజల్లేలా ఏర్పాట్లు చేస్తున్నామని, ఉదయం నుండి సాయంత్రం వరకు ఆదివాసి గిరిజనులకు సంబంధించిన వంటకాలు, పిల్లలు పెద్దలు సరదాగా గడపడానికి ఆట స్థలాలు బోటింగ్ షికారు విలువిద్య క్రీడలకు సంబంధించిన ఏర్పాట్లు చేసి రాత్రిపూట గిరిజన సంస్కృతి సంప్రదాయాలకు సంబంధించిన కల్చరల్ ప్రోగ్రామ్స్ ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఎఫ్డిసి ఉదయ్ కుమార్, ఏసీఎంఓ రమణయ్య, ఐటిసి జీఎం చంగల్ రావు, జేడీఎం హరికృష్ణ, జీపిఈఓ శ్రీనివాసరావు, ట్రైబల్ మ్యూజియం ఇంచార్జ్ వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వలస ఆదివాసీలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది

- అడవిరామవరం గ్రామాన్ని సందర్శించిన ఎస్పీ రోహిత్ రాజు
- గ్రామంలోని 35 కుటుంబాలకు ఉచిత వైద్య శిబిరం
- గుత్తికోయ ప్రజలకు నిత్యావసర వస్తువులు పంపిణీ

నవతెలంగాణ - ఆళ్ళపల్లి





ఛత్తీస్ గఢ్ రాష్ట్రం నుంచి కొన్నేళ్ల క్రితం వలస వచ్చిన ఆదివాసీలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. ఈ మేరకు ఎస్పీతో పాటు జిల్లా అడిషనల్ ఎస్పీ (ఓఎస్డి) సాయి మనోహర్, ఇల్లందు డీఎస్పీ చంద్రభాను ఆళ్ళపల్లి మండలంలోని మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన అడవిరామవరం గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. ముందుగా గ్రామంలోని 35 గుత్తి కోయ కుటుంబాలకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆళ్ళపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి కె.వి.సంఘమిత్ర ఆధ్వర్యంలో పోలీసులు ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది రోగులను పరీక్షించి, తగిన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. దీనికి ముందు ఎస్పీ వాహనంలో ఆళ్ళపల్లి మీదుగా నడిమిగూడెం గ్రామం చేరుకొని, అక్కడి నుండి ద్విచక్ర వాహనాలపై దట్టమైన అటవీ ప్రాంతం గుండా ఎస్పీతో పాటు అధికారులు అడవిరామవరం గ్రామానికి చేరుకున్నారు. అక్కడికి చేరుకున్న ఎస్పీ ముందుగా గ్రామ పరిసర ప్రాంతాలను నిశితంగా పరిశీలించి, గుత్తి కోయ ప్రజల జీవన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ ప్రజలకు సికింద్రాబాద్ ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ సభ్యులు సోందు పాషా(కరకగూడెం) సౌజన్యంతో గుండాల పోలీసులు దుప్పట్లు, సోలార్ లైట్లు, నిత్యావసర వస్తువులను ఎస్పీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలోని మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే వలస ఆదివాసీ ప్రజల అభివృద్ధి కోసం పోలీస్ శాఖ ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ కృషి చేస్తుందని తెలిపారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని జిల్లా యంత్రాంగం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. మావోయిస్టులు వారి స్వార్థ ప్రయోజనాల కోసం ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వాలు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకొని ఆదివాసీ ప్రజలను కనీస సౌకర్యాలకు దూరం చేయడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. అనంతరం 120 మంది గ్రామ ప్రజలకు ఏర్పాటు చేసిన సహపంక్తి విందులో అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఘనంగా ఏర్పాటు చేసిన టేకులపల్లి సీఐ టి.సురేష్, గుండాల సీఐ, ఆళ్ళపల్లి ఎస్సై ఈ.రతీష్, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. వైద్య సేవలు అందించడానికి వచ్చిన ఆళ్ళపల్లి, గుండాల వైద్యులు సంఘమిత్ర, సుదీప్ బృందానికి, ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ సభ్యులు సొందు పాషాలను ఎస్పీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఆళ్ళపల్లి, గుండాల పోలీసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దంతెవాడ జిల్లాలో దుర్ఘటన

- ఐఈడీ బాంబు పేలి గ్రామస్తుడు మృతి

నవతెలంగాణ-చర్ల

సరిహద్దు చత్తీస్‌గఢ్ దండివాడ జిల్లాలో భద్రతా బలగాలే లక్ష్యంగా బార్సూర్‌లోని కోసల్నార్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన మందు పాతర పేలి మనూర్ అకాలి అనే యువకుడు మృతి చెందాడు. వెదురు కోసేందుకు అడవిలోకి వెళ్లి మందు పాతరకు బలైన మనూర్ అకాలి ఘటనా స్థలంలో సెర్చింగ్ ఆపరేషన్ బాంబు డిస్పోజల్ స్క్వాడ్ నిర్వహిస్తున్నట్లు దంత్యవాడ ఎస్పీ గౌరవరాయ్ ప్రకటించారు.

జీపీ కార్మికులు ఖమ్మంలో అరెస్ట్

నవతెలంగాణ-కల్లూరు

కల్లూరు గ్రామపంచాయతీ కార్మికులు చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళుతుండగా సోమవారం రాత్రి ఖమ్మం బస్టాండ్లో రైల్వే స్టేషన్లో పోలీసుల అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. కల్లూరు గ్రామపంచాయతీ వర్కర్ల సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఓడల కృష్ణమూర్తి, వజీర్ మియా ఆధ్వర్యంలో హైదరాబాద్ వెళుతుండగా ఖమ్మంలో అరెస్ట్ చేశారు. అరెస్టు అయిన వారిలో ఓడల కృష్ణమూర్తి, గారపాటి రాజు, ఖమ్మంపాటి మరియమ్మ కే.రాణి, కే.ఎలేసమ్మ, వరమ్మ, లక్ష్మి, యశోద, కే మరియమ్మ, వజీర్మియా, చార్లెస్, రాము, డ్రైవర్లు రాంబాబు, శ్రీను, బాలరాజు, తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులన్నీ పెండింగ్

- ఎనిమిదేండ్లు గడిచినా పూర్తికాని గిరిజన భవనం
- పట్టింపులేని పాలకులు

నవతెలంగాణ-వైరా



అభివృద్ధికి తామే కేరాఫ్ అని గొప్పలు చెప్పుకునే పాలకులకు కొదవే లేదు. కాని అభివృద్ధి శిలాఫలకాల దగ్గర, పూర్తి కాని భవనాల దగ్గర ఆగిపోయినా ఎవరికీ పట్టటం లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొలి శాసనసభ బీఆర్ఎస్ నాయకత్వంలో ఏర్పడి, గిరిజన నియోజకవర్గం అయిన వైరాకు కోటీ 10 లక్షల రూపాయలతో గిరిజన భవనం మంజూరు చేసింది. గిరిజన ఎంఎల్ఏగా బానోత్ మదన్‌లాల్ చొరవకూడా అందుకు దోహదపడింది. బీఆర్ఎస్ మొదటి ప్రభుత్వం 3వ సంవత్సరంలో గిరిజన భవనానికి శంఖుస్థాపన చేశారు. మొదటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో మూడేండ్లు, రెండవ బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఐదేండ్లు, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక సంవత్సరం మొత్తం 8 సంవత్సరాలు పూర్తి అయినా గిరిజన భవనం పూర్తి కాలేదు. ఎంఎల్ఏ క్యాంపునకు ముందు విశాలమైన ఐబి స్థలంలో నిర్మించిన నియోజకవర్గ గిరిజన భవనం ఇప్పట్లో పూర్తి అయ్యే లక్షణాలే కనిపించటం లేదు. ఈ నిర్మాణం నాసిరకం, కాలం చెల్లిన సిమెంటుతో నిర్మిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లేక, కాంట్రాక్టర్ ఆచూకీ లేక వర్కర్స్‌తో గడ్డలు కట్టిన సిమెంటుతో ప్లాస్టింగ్ పనులు చేస్తున్న విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్యా వీరభద్రం ఆధ్వర్యంలో కొద్ది నెలల క్రితం సిపిఎం బృందం పనులను పరిశీలించింది. గడ్డలు కట్టిన సిమెంటును, నాసిరకం సిమెంటును పత్రికా ముఖంగా బయట పెట్టింది. దాదాపు అప్పటి నుండి భవన నిర్మాణం నిలిపి వేశారు. రెండు ప్రభుత్వాలు మారి మూడో ప్రభుత్వం వచ్చి సంవత్సరం గడిచి ప్రజా పాలన విజయోత్సవ సంబరాలు జరుపుకుంటున్నా గిరిజన భవనం మాత్రం పూర్తి కాలేదు. అలాగే షాదీఖానా, వైరా చెరువు బజారులో ఫిషరిష్ ఆఫీస్ నిర్మాణం చేపట్టినా దానిని కూడా 15 వసంతాలు గడిచినా పూర్తి చేయాలన్న తలంపు ప్రభుత్వాలకు లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో ఏర్పడిన ప్రభుత్వం కూడా శిలాఫలకాలు భారీగానే వేసింది. వేసిన శిలాఫలకాల వద్ద ఎక్కడా పనులు ప్రారంభం కాలేదు. గతం అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు స్వంత భవనాలు ఉండాలన్న లక్ష్యంతో ఎక్సైజ్ కార్యాలయానికి ప్రభుత్వం స్థలం కేటాయించారు. భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోవటంతో, ఆ స్థలాన్ని ప్రవేటు వ్యక్తులే కాక, వైరా మునిసిపాలిటీ కూడా ఆక్రమణకు పూనుకున్నట్లు వార్తలు వచ్చినవి. అలాగే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి మంత్రులు శంకుస్థాపన చేసి శిలాఫలకం వేశారు. అది కార్యరూపం దాల్చకుండానే శిలాఫలకాన్ని తొలగించారు. గత ప్రభుత్వ హయాంలో వెలసిన క్రీడా ప్రాంగణాలు ఇప్పుడు కనబడవు. కాని ఈ ప్రభుత్వం వైరా ప్రాజెక్టు కుడి ఎడమ కాలువల ఆధునీకరణ పనులకు, వైరాలో 100 పడకల ఆసుపత్రికి శంఖుస్థాపనలు చేసింది. పాతవి, కొత్తవి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలకు వితరణ

నవతెలంగాణ-ముదిగొండ



మండల పరిధిలో పెద్దమండవ గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారస్తులు కోటపర్తి తిరుపతిరావు తన తండ్రి కోటపర్తి రంగయ్య మూడో వర్ధంతి సందర్భంగా జ్ఞాపకార్థంగా ప్రాథమిక పాఠశాలకు రూ 8 వేలు విలువచేసే మైకు, మౌత్‌ను మంగళవారం వితరణగా రంగయ్య కుమారుడు, కోడలు కోటపర్తి తిరుపతిరావు, ఉషారాణిలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.బాబుకు అందజేశారు. దాతృత్వంతో పాఠశాలకు మైకు, మౌత్‌ను వితరణగా అందజేసిన కోటపర్తి తిరుపతిరావు దంపతులకు హెచ్ఎం గద్దల బాబు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వసంతలక్ష్మి, గ్రామ పెద్దలు జాలాది కొండలు, బొడ్డు భాస్కరరావు, ప్రశాంత్, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

అమెరికన్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో 'హార్వెస్ట్' విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-ఖమ్మం



ప్రపంచ వ్యాప్తంగా విద్యార్థినీ, విద్యార్థులలో గణిత శాస్త్రానికి సంబంధించి ప్రతిభను వెలికి తీసేందుకు అమెరికన్ మ్యాథ్స్ ఒలింపియాడ్ వారు (ఎ.ఎమ్.సి) ఆన్లైన్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మ్యాథ్స్ ఒలింపియాడ్లో తమ విద్యార్థినీ, విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి రెండవ రౌండుకు ఎంపికైనట్లు హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపల్ ఆర్.పార్వతీ రెడ్డి తెలిపారు. గత నెల 6న ఆన్లైన్లో నిర్వహించిన మ్యాథ్స్ ఒలింపియాడ్ మొదటి రౌండ్లో తమ విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని పరీక్ష రాయడం జరిగిందన్నారు. ఈ నెల 16న వెలువరించిన ఫలితాలలో రెండవ రౌండ్ అయినటువంటి ఎఐఎమ్ఇ (అమెరికన్ ఇన్విటేషన్ మ్యాథ్స్ ఎగ్జాం)కు ఐదుగురు విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. తమ విద్యార్థులు ఎస్.కె.రియాన్ అరాఫత్, టి.శ్రీజిత్, కె.రిషిత్, ఎన్.రుష్యేంద్రమణి, ఎమ్.జయరాం రెండవ రౌండుకు ఎంపిక కావడం జరిగిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 8, 9, 10 తరగతుల విద్యార్థినీ, విద్యార్థులు అమెరికన్ మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షకు హాజరు కావడం జరుగుతుందన్నారు. మంగళవారం హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపల్ ఆర్.పార్వతీరెడ్డి విద్యార్థులను అభినందించి భవిష్యత్తులో కూడా మంచి ఫలితాలు సాధించాలని అభిలాషించారు. ఈ కార్యక్రమంలో ఐఐటి బ్రాంచ్ ఇంచార్జు జి.ఉమా మహేశ్వరరావు, కె.నాగరాజు పాల్గొన్నారు.

కొండల్లో గిరిజనుల అరిగోస

- పోడు పంట చేతికి తెచ్చుకోకుండా పొలాల చుట్టూ ట్రెంచ్‌లు
- గిరిజనులకు అండగా సీపీఐ(ఎం) గిరిజనులంత కలిసి ట్రెంచ్ పూడ్చివేత

నవతెలంగాణ-అశ్వాపురం



అడవిలో గిరిజనులు అరిగోస పడుతున్నారు. పోడు వ్యవసాయం చేసి అరుగాలం కష్టించి పండించిన పత్తి, వరి చేలా చుట్టూ అటవీ అధికారులు ట్రెంచ్‌లు కొట్టారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న వారికి సీపీఐ(ఎం) అండగా నిలబడింది. గత వారం గిరిజనులతో సీపీఐ(ఎం) పోరుబాటను సైతం పట్టించారు. పోడు వ్యవసాయం చేసుకుంటున్న తమను ఫారెస్ట్ అధికారుల భారి నుండి కాపాడాలని కోరుతూ మండల కేంద్రంలో భారీ ర్యాలీ తీశారు. ర్యాలీ అనంతరం తహసీల్దార్‌కు ఫారెస్ట్ అధికారులు గిరిజనుల పట్ల వ్యవహరిస్తున్న తీరుపై న్యాయం చేయాలని ఓ వినతి పత్రం ఇచ్చారు. ఆ పార్టీ మాజీ ఎంపీ మిడియం బాబురావు, ఆనాడు ఫారెస్ట్ అధికారులను హెచ్చరించారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు సర్వే పూర్తి అయిందని, పట్టాలకు జాప్యం జరుగుతుందని, సర్వే చేసిన భూములలో పంట సాగుచేసుకునే హక్కు గిరిజనులకు ఉందన్నారు. అటవీ అధికారులు ట్రెంచ్ లు కొట్టవద్దని కోరారు. వారం రోజుల గడువు ఇస్తామని అధికారులు ట్రెంచ్ పుడ్చకపోతే గిరిజనులే ట్రెంచ్ పూడ్చి వారి పంటలు తెచ్చుకుంటారని అన్నారు. అదే పద్ధతిలో మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో మనుబోతుల గూడెంలోని గిరిజనులు అందరూ ఏకమై ఫారెస్ట్ అధికారులు తీసిన ట్రెంచ్ ను పూడ్చి వేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గద్దల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం సర్వే చేసిన భూములలో గిరిజనులు పోడు సాగు చేస్తే పంట తీసుకు పోకుండా చుట్టూ ట్రెంచ్‌లు కొడుతున్న అధికారులు అటవీ హక్కుల చట్టం గురించి తెలుసుకొని మెలగాలన్నారు. సర్వే చేసిన పోడు పట్టాలకు వెంటనే ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మడివి రమేష్, మండేపూడి సాంబశివరావు, మోకాళ్ళ రమేష్, పవన్, పద్దం లక్ష్మయ్య, సీతమ్మ, చిన్నయ్య, ముస్కి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



రైతులను నిలువునా మోసం చేస్తున్న సొసైటీ : సీపీఐ(ఎం)

- గోనె సంచులు లేక కాంటాలు నిలిపివేత

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

గోనె సంచులు లేక కాంటలు నిలిపివేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ(ఎం) పాలేరు డివిజన్ కమిటీ సభ్యుడు భూక్య నాగేశ్వరరావు అధికారులను నిలదీశారు. మండలంలోని కస్నాతండా గ్రామంలోని ఐకెపి సెంటర్‌లో గల కొనుగోలు కేంద్రాన్ని సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా భూక్య నాగేశ్వరరావు మాట్లాడారు. గోనె సంచులు లేక కాంటాలు నిలిపివేయడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి గోనె సంచులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తేమ శాతం ఎక్కువగా ఉందని, ఎక్కువ కిలోలు ధాన్యం తరుగు తీయడం మంచి పద్ధతి కాదన్నారు. శీతాకాలంలో మబ్బులు పట్టి, వర్షాలు వస్తుండడంతో ధాన్యం సరిగా ఎండక, తేమ కొంచెం ఎక్కువగా ఉన్న ఆ పేరుతో ఎక్కువ మొత్తంలో తరుగు తీయడం రైతులను నిలువునా మోసం చేయడమేనన్నారు. అధికారులు, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సొసైటీలల్లో అక్రమాలను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో రైతులు బానోత్ కిషన్, రవి, మాలోత్ వీరన్న, శ్రీను, లక్ష్మయ్య గురవయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులతో ముఖాముఖి సమావేశం

నవతెలంగాణ-ఎర్రుపాలెం

బనిగండ్లపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులు అధ్యాపకులు ముఖాముఖి సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి 30 మంది విద్యార్థుల తల్లి దండ్రులు హాజరైనారు. తమ పిల్లల ఉత్తీర్ణత శాతాన్ని, కళాశాలలో హాజరు శాతాన్ని తెలుసుకొని రాబోయే పరీక్షలకి తమ పిల్లల్ని సన్నద్ధం చేయటానికి తమ వంతుగా ప్రయత్నం చేస్తామని తల్లిదండ్రులు తెలిపారు. మార్చి ఐదువ తారీకు నుండి జరగనున్న పరీక్షలకు విద్యార్థులను కార్యోన్ముఖులను చేయాలని కళాశాల ప్రిన్సిపల్ రవికుమార్ తల్లిదండ్రులు సూచించారు.

ఐటీసీ ఐఎన్టీయూసీలో భారీ చేరికలు

గుర్తింపు యూనియన్ టీఎస్టీయూసీకి ఎదురు దెబ్బ

నవతెలంగాణ-బూర్గంపాడు



సారపాకలోని ప్రముఖ పేపర్ పరిశ్రమ 'ఐటీసీ – పిఎస్‌పిడి'లో తాజాగా గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు ఎన్నికల ప్రక్రియ, షెడ్యూల్‌లో భాగంగా ఈనెల 21న డీసీఎల్‌తో అన్ని ట్రేడ్ యూనియన్ నాయకులు సమావేశం నిర్వహించనుంది. ఆ రోజు ఎన్నికల తేదీ ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇది ఇలా ఉండగా 13వ వేతనం ఒప్పందంలో భాగస్వాములైనటు వంటి ముగ్గురు టిఎస్టియుసికు చెందిన ఆఫీస్ బేరర్స్ విజయ భాస్కర్ రెడ్డి రెడ్డం రామకృష్ణారెడ్డి సుతార్ నరేష్ కుమార్ అనే కార్మిక నాయకులు టిఎస్టియుసికు కార్యవర్గానికి రాజీనామా చేశారు. ఈ క్రమంలో సోమవారం ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు మారం వెంకటేశ్వర రెడ్డి, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్య క్షులు గోనెదారుగా సమక్షంలో ఐఎన్‌టియుసి యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక మంచి వేతనం ఒప్పందం జరగాలంటే ఐఎన్‌టియుసి పక్షాలను అత్యధిక మెజార్టీతో గెలవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. పార్టీ పరంగా తాము ఎప్పుడూ అండగా ఉంటామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లుల ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కనీసవేతనాల సలహా మండలి (మినిమమ్ వేజెస్ అడ్వైజరీ బోర్డ్) సభ్యులు యారం పిచ్చిరెడ్డి, ఐఎన్టియుసి ఐటిసి సారపాక అధ్యక్షులు గొనె రామా రావు, ఐఎన్‌టియుసి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సభా పర్వం

రాష్ట్రంలో అన్ని వ్యవస్థలూ దిగజారుతున్నాయి

- అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద సూర్యాపేట ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో అని వ్యవస్థలూ దిగజారుతున్నాయని సూర్యాపేట ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన మాట్లాడారు. పోలీసులను అడ్డుపెట్టుకుని పాలన సాగిస్తున్నారని విమర్శించారు. శాసనసభను కాంగ్రెస్ వారి అబద్ధాలు చెప్పుకునే వేదికగా మార్చారన్నారు. రూల్ బుక్ పాటించడం లేదని, ప్రభుత్వానికి దీనిపై చర్చ చేసే దమ్ములేదని విమర్శించారు. లగచర్ల రైతులకు మద్దతుగా మాట్లాడటానికి తమకు సమయం ఇవ్వలేదన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలు, విద్యార్థుల దగ్గరకి, హైడ్రా బాధితుల దగ్గరికి కాంగ్రెస్ నాయకులు వెళ్లరన్నారు. లీకులు ఇచ్చి కేటీఆర్ గురించి మాట్లడించడం కాదని, రేవంత్‌కు దమ్మంటే శాసనసభలో చర్చ పెట్టాలని సవాల్ విసిరారు. స్పష్టంగా కేటీఆర్ వచ్చి సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. దొంగ రాతలు రాయించడం బంద్ చేయాలన్నారు. బిల్లులు పాస్ చేయడానికి మాత్రమే శాసన సభ అన్నారు. 15 రోజులు శాసనసభ నిర్వహించాలంటే భయపడి వాయిదా వేసుకుని పోతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ వైఫల్యాలపై చర్చకు సిద్ధమా..? తమ ప్రతి పనిపై తాము చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. అసెంబ్లీని పక్కదారి పట్టించినా.. ప్రజా క్షేత్రంలో తప్పించుకపోలేరన్నారు.

సమావేశాల తీరు విస్మయం : జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

అసెంబ్లీ సమావేశాల తీరు విస్మయంగా ఉందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బీఏసీ మీటింగ్ జరగలేదని, బీఏసీ లేకుండా బిల్లులు ప్రవేశపెట్టడం అసెంబ్లీ సమావేశాల సంప్రదాయాలకు విరుద్ధమని అన్నారు. ఉన్న పద్ధతులు పాటించడం లేదన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతున్నారన్నారు. రూల్ బుక్‌ను పక్కన పెట్టారని విమర్శించారు. లగచర్ల రైతులకు వెంటనే బెయిల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అడ్జర్న్ మోషన్ ఇస్తే ఉలుకు పలుకూ లేదని, దీన్ని తాము ఖండిస్తున్నామని చెప్పారు.

ఆరు గ్యారంటీలకు ఏడాది : ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చి ఏడాది గడిచిందని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రజలను మోసం చేసిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిపై 420 కేసు పెట్టాలని, ప్రజలకు వారు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తమకు చర్చకు అవకాశం ఇవ్వకుండా గొంతు నొక్కుతున్నారన్నారని, ఇది ప్రజా పాలన అవుతుందా..? అని ప్రశ్నించారు. ఏడాదిపాటు అధికారం అనుభవించి సంబురాలు చేసుకుంటున్నారని విమర్శించారు.

నియోజవర్గాలకు సీడీపీ ఫండ్ లేదు : ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

ఏడాది గడిచినా నియోజకవర్గాలకు సీడీపీ ఫండ్ ఇవ్వడం లేదని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మీడియా పాయింట్ వద్ద అన్నారు. ఆరు గ్యారంటీల పేరు చెప్పి అన్ని వర్గాల వారినీ మోసం చేశారన్నారు.

గ్యారంటీలకు చట్టబద్ధతేదీ : ఎమ్మెల్యే పాయల్ శంకర్

కాంగ్రెస్ ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత ఏమైందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రశ్నించారు. బీఆర్ఎస్‌కు జరిగిన శాస్తే కాంగ్రెస్‌కూ జరుగుతుందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేసే వరకూ కాంగ్రెస్‌ను నిలదీస్తామన్నారు.

క్రీడలు, పర్యాటక పాలసీలపై మద్దతు ఇవ్వకుండా తప్పించుకున్నారు

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



నవతెలంగాణ-సిటీబ్యూరో

బీఆర్ఎస్ విస్మరించిన క్రీడలకు ఒక పాలసీతోపాటు పర్యాటక రంగం అభివృద్ధి కోసం తాము పాలసీ తీసుకొస్తే.. మద్దతు ఇచ్చేదిపోయి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తప్పించుకున్నారని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. మంగళవారంకాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. రైతులకు, తల్లులకు బేడీలు వేసిన చరిత్ర మీదని, ప్రజల్లో అలజడి సృష్టించాలనేది మీ పని అని విమర్శించారు. రైతుల సమస్యలు పరిష్కరించని బీజేపీ వారు మొసలికన్నీరు కారుస్తున్నారన్నారు. ప్రతి అంశంపైనా తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని, మీరు సిద్ధమా అని సవాల్ విసిరారు. బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు.

సభను అడ్డుకోవడం శోచనీయం : ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

క్రీడా, టూరిజం పాలసీలు తెస్తే మద్దతు తెలపాల్సిందిపోయి సభను అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. కనీసం స్పీకర్‌పై గౌరవం లేకుండా వ్యవహరిస్తున్నారన్నారు. గతంలో దళితుడైన సంపత్ కుమార్‌ని సభ నుంచి శాశ్వతంగా బహిష్కరించారని గుర్తు చేశారు. తమ జిల్లాకు అన్ని విధాలుగా అన్యాయం చేసిన పార్టీ బీఆర్ఎస్ అని విమర్శించారు. ఇప్పుడు అభివృద్ధిని చూసి ఓర్వలేక సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.

అన్ని వ్యవస్థలను చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నాం : ఎమ్మెల్యే సీహెచ్.విజయరమణారావు

గత ప్రభుత్వం నాశనం చేసిన అన్ని వ్యవస్థలనూ చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నామని, కానీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే సీహెచ్.విజయరమణారావు తెలిపారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారన్నారు. కేసీఆర్ అసెంబ్లీకి రారు.. ఫాంహౌస్‌లో ఉంటారని, కానీ, దళిత నాయకుడైన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పది నిమిషాలు లేట్ అయితే ప్రశ్నిస్తున్నారని అన్నారు. ఒక్కరోజన్నా ప్రతిపక్ష నాయకులు కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చ చేశారా? సూచనలు చేశారా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు అబద్ధాన్ని నిజం చేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

బీఆర్ఎస్ నాయకుల బతుకులు బస్టాండ్.. : ఎమ్మెల్యే శంకరయ్య

బీఆర్ఎస్ నాయకుల బతుకులు బస్టాండ్ అయ్యాయని, సభకు అడ్డుపడుతున్నారని ఎమ్మెల్యే శంకరయ్య అన్నారు. వీధి కుక్కల్లా ప్రవర్తిస్తున్నారని, లగచర్లలో గోరంత ఘటనను కొండంత చేశారని విమర్శించారు. ఖమ్మంలో మిర్చి రైతులకు బేడీలు వేసింది మర్చిపోయి మాట్లాడుతున్నారన్నారు. అధికారంలో ఉంటేనే అసెంబ్లీకి వస్తారా? ప్రతిపక్ష నేతగా ఉంటే రారా? అని ప్రశ్నించారు. ఈరోజు మీరు బేడీలు వేసుకొని వచ్చి నాటకాలు చేస్తున్నారని, రేపు మీకు అవే శాశ్వతం అని ప్రజలు అనుకుంటున్నారని అన్నారు. బీజేపీ నాయకులు కేంద్రం నుంచి రాష్ట్రానికి ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలన్నారు. జన్ ధన్ ఖాతాల్లో ఎన్ని డబ్బులు వేశారో చెప్పాలని ప్రశ్నించారు.

ప్రాయశ్చిత్తం కావాల్సిందే.. : ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

బీఆర్ఎస్ నాయకులు చేసిన పాపాలకు ప్రాయశ్చిత్తం కావాల్సిందేనని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఒక్కొక్కరు అక్రమంగా వేల కోట్ల రూపాయలు సంపాదించారని, అది నిజం కాదా? అని ప్రశ్నించారు. మీరు చేసిన పాపాలకు జైళ్లు సరిపోవన్నారు. మీకు కావాల్సింది సభ నడవొద్దు.. మీ దొంగ లెక్కలు బయటపడొద్దు అని విమర్శించారు. రైతులకు బేడీలు వేసిన ఘనత మీదేనని గుర్తు చేశారు.

నిరసనల మధ్యే మూడు కీలక బిల్లులకు ఆమోదం

ఓ వైపు బిజినెస్.. మరోవైపు ఆందోళనలు

- అసెంబ్లీలో లగచర్ల ఘటనపై చర్చకు రెండోరోజూ విపక్షాల పట్టు
- సభావేదికగా ఇరుపక్షాల 'రాజకీయం'



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర శాసనసభ సమావేశాలు మంగళవారం రసవత్తరంగా సాగాయి. ఒకవైపు సర్కారు బిజినెస్ నడిపిస్తుండగా, మరోవైపు విపక్షాలు లగచర్లతోపాటు ఆరు గ్యారెంటీలపై చర్చకు పట్టుబట్టాయి. వాయిదా తీర్మానాల కోసం బీఆర్ఎస్, బీజేపీ డిమాండ్ చేశాయి. ప్రతిపక్షాల నిరసనల మధ్యే అసెంబ్లీ మూడు కీలక బిల్లులను ఆమోదించింది. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ యూనివర్సిటీ బిల్లు, విశ్వవిద్యాలయాల చట్ట సవరణ బిల్లుతోపాటు తెలంగాణ జీఎస్టీ సవరణ బిల్లుకు సైతం అసెంబ్లీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఎలాంటి చర్చ లేకుండానే ఈ మూడు బిల్లులకు సభ ఆమోదం తెలిపింది. రాష్ట్ర పర్యాటక విధానంపై స్వల్పకాలిక చర్చ అనంతరం సభ బుధవారానికి వాయిదా పడింది. దాదాపు 50 నిమిషాలు సభ జరగగా, బీఆర్ఎస్ సభ్యులు నిలబడే ఉన్నారు. ఇరుపక్షాలు పోటాపోటీ పేపర్ క్లిప్పింగులను ప్రదర్శించాయి. బీఆర్ఎస్ లగచర్ల ఘటనని, కాంగ్రెస్ ఖమ్మం రైతుల బేడీలకు సంబంధించి పేపర్ క్లిప్పింగులను సభలో చూపించాయి.ప్రశ్నోత్తరాలు, జీరో అవర్ అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు సభ తిరిగి ప్రారంభమైంది. స్పీకర్ ప్రసాద్‌కుమార్ వచ్చిరాగానే బీఆర్ఎస్ సభ్యులు 'హెలో స్పీకర్ సర్.. ఎలా ఉన్నారు..తిన్నారా ' అంటూ వ్యాఖ్యానాలు చేశారు. దీనికి స్పీకర్ నవ్వుతూ 'ప్రభుత్వ బిల్లులకు సహకరించాలి. మీకు మైక్ ఇస్తాను. సీట్లల్లో కూర్చోండి.. నిలబడటం సరికాదు' అని పదే పదే చెప్పారు. ఉదయమే నల్లచొక్కాలతో వచ్చిన బీఆర్ఎస్ సభ్యులు స్పీకర్ రాగానే నిరసనను తిరిగి కొనసాగించారు. నినాదాలు చేశారు. వారికితోడు బీజేపీ సభ్యులు సైతం ఆరు గ్యారెంటీలకు చట్టరూపం ఎప్పుడు కల్పిస్తారంటూ ప్రశ్నించారు. లగచర్ల ఘటన, ఆరు గ్యారెంటీలపై ప్రతిపక్షాలు పట్టుబడుతూ స్టాండింగ్ పొజిషన్ తీసుకున్నాయి. కొద్దిసేపటి తర్వాత బీజేపీ సభ్యులు బైటాయించారు. మళ్లీ స్పీకర్ స్పందిస్తూ సభా కార్యకలాపాలను కొనసాగించేందుకు సహకరించాలనీ, బిల్లులపై చర్చలో పాల్గొనాలని సూచించారు. అయినా పట్టు వీడకుండా స్పీకర్ పోడియం వద్దకు వచ్చేందుకు ఇరుపక్షాలు ప్రయత్నించాయి. దీంతో స్పీకర్ మార్షల్స్‌ను సభలోకి పిలిచి బీఆర్ఎస్, బీజేపీ పక్షాలను నిలువరించారు. ముందుకు రాకుండా అడ్డుకున్నారు.

మూడు బిల్లులకు ఓకే

సభలో స్పీకర్ యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ బిల్లును ప్రవేశపెట్టాల్సిందిగా మంత్రి కొండా సురేఖను కోరారు. ఆ మేరకు ఆమె సంబంధిత బిల్లును సభకు చదివి వినిపించారు. అలాగే యూనివర్సిటీ బిల్లులను మంత్రి దామోదర రాజనర్సింహ్మ, జీఎస్టీ సవరణ బిల్లును మంత్రి శ్రీధర్‌బాబు సభలో ప్రతిపాదించారు. వీటికి స్పీకర్ అంగీకరించి ఆమోదానికి సభ ముందుంచారు. ఎలాంటి చర్చ లేకుండానే సభ ఓకే చేసింది.

పర్యాటక రంగం అంటే సాంస్కృతిక వారసత్వం :జూపల్లి

పర్యాటక రంగ అభివృద్ధిపై స్వల్పకాలిక చర్చకు స్పీకర్ అనుమతించారు. దీంతో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ పర్యాటకం అంటే సాంస్కృతిక వారసత్వమన్నారు. సృష్టిలోని అందాలతో మమేకం కావడమనీ, వినోదం కోసం ప్రయాణమని చెప్పారు. కొత్తగా ఉద్యోగాలను సృష్టించడానికి అవకాశమున్నదని వివరించారు. దుబాయ్, సింగపూర్ దేశాల్లో పర్యాటక రంగం ద్వారా ఆ దేశ ఆర్థిక వ్యవస్థలు బలోపేతమయ్యాయని చెప్పారు. దేశీయంగా మన పర్యాటక రంగం తొమ్మిదో స్థానంలో ఉండగా, అంతర్జాతీయంగా 12వ స్థానంలో ఉందని తెలిపారు. గత పదేండ్ల బీఆర్ఎస్ పరిపాలనలో పర్యాటక రంగం పూర్తిగా నాశనమైంద న్నారు. ఆ విషయాలన్ని మరిచి అర్థంపర్థం లేకుండా సభలో గొడవ చేస్తున్నారని విమర్శిం చారు. ప్రభుత్వం వ్యాపారం చేయదనీ, పర్యాటకులకు సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. సముద్ర విమానాన్ని తెచ్చేందుకు సైతం చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ విషయమై కాంగ్రెస్ సభ్యులు రాజ్ ఠాకూర్, ఆది శ్రీనివాస్ మాట్లాడారు. ఖమ్మంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం లో రైతులకు బేడీలు వేసిన చరిత్రను మరిచిపోతే ఎలా అని ప్రశ్నించారు. పర్యాటక రంగంలో ఉపాధి అవకాశాలు భారీగా ఉన్నాయని చెప్పారు. జన్‌ధన్ ఖాతాలు తెరిచి రూ. 15 లక్షలను మోడీ ప్రభుత్వం వేసిందా అని బీజేపీ సభ్యులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను గొప్పగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని చెప్పారు. సభ జరగనివ్వకుండా స్పీకర్‌ను అవమానిస్తున్నారని విమర్శించారు.

పబ్లిసిటీ కోసమే.. : శ్రీధర్‌బాబు విమర్శ

బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు ప్రచారం కోసమే తప్ప ప్రజల కోసం కాదని మంత్రి డి. శ్రీధర్‌బాబు చర్చలో జోక్యం చేసుకుంటూ వ్యాఖ్యానించారు.బీఏసీలో ఆమోదించిన బిజినెస్ ప్రకారమే సభ నడుస్తున్నదన్నారు. చర్చచేసే ఉద్దేశం బీఆర్ఎస్, బీజేపీకి లేదన్నారు.కేవలం ప్రెస్‌లో రావడానికి మాత్రమే ప్రాధాన్యతను ఇస్తున్నారని గుర్తు చేశారు. సభను అడ్డుకోవడం సరికాదన్నారు. సభ్యులు లేవనెత్తిన అంశాలను చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. భూనిర్వాసితులకు కచ్చితంగా న్యాయం చేస్తామని ప్రకటించారు. రూ. 2 లక్షల రుణమాఫీ విషయం లో ఇప్పటికే సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి తుమ్మల స్పష్టంగా చెప్పారని వివరించారు.లక్ష రుణమాఫీ చేయడానికి బీఆర్ఎస్ పదేండ్ల సమయం తీసుకుందని విమర్శించారు.

రూల్స్‌ను తుంగలో తొక్కారు : సీతక్క

అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రూల్స్‌ను తుంగలో తొక్కారని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. వాళ్లు తెచ్చిన రూల్స్‌ను వారే అతిక్రమిస్తున్నారని చెప్పారు. లగచర్ల రైతుకు బేడీలు ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి సంబంధిత అధికారిని సస్పెండ్ చేశారని వివరించారు. సభలో అందరికీ ఒకే నిబంధనలు వర్తిస్తాయనీ, చర్చ రూల్స్ ప్రకారమే జరుగుతుందని చర్చ సందర్భంగా చెప్పారు. సరైన పద్ధతిలో చర్చకు రావాలని సూచించారు.

ఇరుపక్షాల రాజకీయం

అసెంబ్లీ వేదికగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ రాజకీయానికి తెరలేపాయి. బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేస్తే ఆపార్టీకి ప్రజల్లో పలుకుబడి పెరుగుతుందనే భావనలో కాంగ్రెస్ ఉంది. అయితే ప్రభుత్వాన్ని రెచ్చగొట్టి సస్పెండ్ చేయించుకునే ఆలోచనలో బీఆర్ఎస్ ఉన్నట్టు అసెంబ్లీ లాబీల్లో గుసగుసలు వినిపించాయి. బీఆర్ఎస్ వ్యూహాన్ని పసిగట్టిన సర్కార్ ఆ అవకాశం బీఆర్ఎస్‌కు ఇవ్వకుండా ముందుకు సాగింది. ఒకవైపు నిరసనగా జరుగుతుండగానే, మరోవైపు బిజినెస్‌ను నడిపించి సభను వాయిదా వేయడం గమనార్హం.

ఫుడ్ పాయిజనింగ్ ఘటనలపై అనుమానాలు

విచారణ జరిపి కుట్రలను బయటికి తీస్తాం

- ఆ సెక్రెటరీ బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా విమర్శలు చేశారు
- ఆ పార్టీ నాయకులు పాత ట్వీట్‌లు చూసుకోండి : మంత్రి సీతక్క



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గురుకులాలు, హాస్టళ్లు, విద్యాలయాల్లో ఫుడ్ పాయిజనింగ్ ఘటనలపై కుట్రలు ఉన్నట్టు తమకు అనుమానాలున్నాయని మహిళా, శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క తెలిపారు. మంగళవారం శాసనమండలిలో ప్రభుత్వ, ఆశ్రమ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం విషయంపై బీఆర్ఎస్ నేత మధుసూదనాచారి సిరికొండ తదితరులు అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు. గురుకులాల కార్యదర్శిగా గతంలో పని చేసి బయటికి వచ్చాక ఆ అధికారి వరస ట్వీట్‌లతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంపైనే ఆరోపణలు చేశారని గుర్తుచేశారు. ప్రస్తుత ఘటనలపై విచారణ జరిపించి నిజాలను బయటికి తీస్తామని తెలిపారు. దీంతో తమ పేర్లను మంత్రి ప్రస్తావిస్తున్నారంటూ బీఆర్ఎస్ సభ్యులు టి.రవీందర్‌రావు అభ్యంతరం తెలుపగా, మంత్రి తానెవరి పేర్లు ప్రస్తావించలేదనీ, విచారణ అంటే భుజాలెందుకు తడుముకుంటున్నారని ఎదురు ప్రశ్నించారు.

అంతకు ముందు మధుసూదనాచారి మాట్లాడుతూ గురుకులాల్లో విద్యార్థుల సమస్య తీవ్రంగా ఉందనీ, ఏడాదిలో 800 మంది ఫుడ్ పాయిజనింగ్‌కు గురి కాగా, 53 మంది చనిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి నెలా నలుగురైదుగురు మరణిస్తున్నారని చెప్పారు. వాంకిడి ఆశ్రమ పాఠశాల విద్యార్థినిని అనేక ఆస్పత్రుల చుట్టూ తిప్పారనీ, మీడియాను కవర్ చేయనీయకుండా ఫెన్సింగ్ వేశారనీ, నేను రాను బిడ్డో ఆశ్రమ పాఠశాలకు అనే పరిస్థితి రాకుండా చూడాలని కోరారు. సభ్యులు ఎం.ఎస్.ప్రభాకర్ రావు మాట్లాడుతూ, ఒక ఐపీఎస్ అధికారి ఐదేండ్లపాటు గురుకులాల్లో కార్యదర్శిగా ఉంటూ ఒక సొంత సంస్థ ద్వారా సామ్రాజ్యం ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. దీంతో గురుకులాల్లో జరుగుతున్న వాటిపై అనుమానాలు వస్తున్నాయని చెప్పారు. రాజకీయంగా కాంగ్రెస్‌ను అప్రతిష్టపాలు చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఏసీబీతో విచారణ జరిపించాలనీ, పేద పిల్లల జీవితాలతో ఎవరు ఆటలాడుతున్నారో బయటికి వెలికి తీయాలని డిమాండ్ చేశారు.

మంత్రి సీతక్క బదులిస్తూ, గతంలో కూడా అనేక మరణాలు జరిగాయని తెలిపారు. వాంకిడి విద్యార్థినీ శైలజ మరణం చివరి మరణం కావాలని ఆకాంక్షిం చారు. నిత్యావసర, ఆహార పదార్థాల సరఫరాదారులపై నిఘా పెట్టాల్సి ఉందన్నారు. గురుకులాలకు, ఆశ్రమ పాఠశాలల్లో చేరేందుకు డిమాండ్ లేదన్న బీఆర్ఎస్ సభ్యుల వాదనలో నిజం లేదనీ, ఐదో తరగతిలో చేరేందుకు 78 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. శైలజకు మెరుగైన చికిత్సనందించామనీ, ముఖ్యమంత్రి, పలువురు మంత్రులు పర్యవేక్షించారనీ, కుటుంబానికి ఇల్లు, తండ్రికి అవుట్ సోర్సింగ్ ఉద్యోగం ఇచ్చినట్టు తెలిపారు. తాను కూడా ములుగు గర్ల్స్ హాస్టల్ విద్యార్థినీ తనకు అక్కడి పరిస్థితులపై అవగాహన ఉందని చెప్పారు. సెక్రెటరీగా పని చేసిన తర్వాత ఆ అధికారి బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేసి అక్కడే ఉన్నారని గుర్తు చేశారు. గురుకులాలు, కేజీబీవీలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాదిలో 386 ఫుడ్ పాయిజన్, 2 పాముకాటు, 2 ఎలుక కరిచిన ఘటనలు జరిగాయని చెప్పారు. ఏండ్ల తరబడి పెంచని డైట్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలను తమ ప్రభుత్వం పెంచిందని సీతక్క తెలిపారు.దీనికి మధుసూదనా చారి అభ్యంతరం చెబుతూ, తమ వద్ద 800కు పైగా ఘటనలు జరిగి, 53 మంది చిన్నారులు చనిపోయి నట్టు సమాచారం ఉందని కామెంట్ చేశారు.

బీసీ గురుకుల పాఠశాల విద్యార్థినికి తీవ్ర అస్వస్థత

- 15 సార్లు కొరికిన ఎలుకలు
- ఎలుకలు కొరికిన ప్రతిసారి వ్యాక్సిన్
- రెండు కాళ్లూ చచ్చుబడి మంచానికే పరిమితం
- తరుచూ వ్యాక్సిన్ వల్లే కాళ్లు చచ్చుబడినట్టు అనుమానాలు
- ఖమ్మంలోని మమత ఆస్పత్రిలో వైద్యచికిత్సలు



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఖమ్మం దాన్వాయిగూడెంలోని బీసీ గురుకుల పాఠశాల విద్యార్థిని ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని లక్ష్మీభవాని కీర్తి (15)ని గత రెండు నెలల నుంచి 15 సార్లు ఎలుకలు కొరికాయి. పలుమార్లు ఆస్పత్రికి వచ్చి వైద్య సేవలు పొందింది. వారం రోజుల క్రితం తన కాళ్లు, చేతులు లాగుతున్నాయని తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పింది. వెంటనే ఖమ్మంలోని మమత జనరల్ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయిస్తున్నారు. ఆమె రెండు కాళ్లూ చచ్చుబడి పోయాయని వైద్యులు చెప్పారు. కొన్ని నెలల క్రితం నుంచి ఎలుకలు కొరికిన ప్రతిసారీ వ్యాక్సిన్ వేయిస్తుండటం వల్లనే విద్యార్థిని కాళు పడిపోయాయని అనుమానిస్తున్నారు.15 సార్లు లక్ష్మీ భవాని కీర్తిని ఎలుకలు కొరకగా 15 వాక్సిన్‌ల వరకు వేసినట్టు తెలుస్తోంది. ఈ సందర్భంగా బాధిత విద్యార్థిని లక్ష్మీభవానీకీర్తి మాట్లాడుతూ.. హాస్టల్‌లో ఎలుకలు బాగా ఉన్నాయని, ప్రతిరోజూ ఎవరినో ఒకర్ని కొరుకుతున్నాయని తెలిపారు. హాస్టల్ వాతావరణం కూడా అంత బాగోలేదని, అపరిశుభ్రతతోనే ఎలుకలు ఎక్కువయ్యాయన్నారు.ఈ విషయంపై పర్యవేక్షకులకు కంప్లైంట్ చేస్తే పట్టించు కోవడం లేదని, పైగా ఉంటే ఉండండి.. లేకపోతే టీసీ తీసుకుని వెళ్లిపోండని అంటున్నారని వాపోయారు. కాగా, ఆ విద్యార్థిని ఆరోగ్యపరిస్థితి గమనిస్తే కోలుకోవడం కష్టంగానే కనిపిస్తోంది. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థినిని ఎలుకలు కరుస్తున్నాయని బీఆర్ఎస్ రాజ్యసభ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఆరోపించారు.బీఆర్ఎస్ హయాంలో గురుకుల, రెసిడెన్షియల్ హాస్టల్స్‌పై పెట్టిన శ్రద్ధ నేడు కనిపించడం లేదన్నారు.

'లగచర్ల' పై చర్చించాల్సిందే

మండలిలో బీఆర్ఎస్ సభ్యుల నిరసన

సభను వాయిదా వేసిన చైర్మెన్ గుత్తా



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

లగచర్ల సమస్యపై చర్చించాల్సిందేనని బీఆర్ఎస్ సభ్యులు పట్టుబట్టారు. ప్లకార్డులను ప్రదర్శించి నినాదాలు చేశారు. శాసనమండలి సమావేశాల్లో భాగంగా మంగళవారం భోజన విరామం తర్వాత 2.40 గంటలకు సభ ప్రారంభమైంది. ఈ సందర్భంగా మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి మాట్లాడుతూ లగచర్ల సమస్య తీవ్రమైందని అన్నారు. గిరిజన రైతుకు గుండెపోటు వస్తే బేడీలు వేసి తీసుకురావడం సరైంది కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించిందని విమర్శించారు. ఆ సమస్యపై చర్చించాలని డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జోక్యం చేసుకుని మాట్లాడుతూ వ్యవసాయం, రైతాంగ సమస్యపై స్వల్పకాలిక చర్చ ఉందన్నారు. అందులో వ్యవసాయం, రైతులకు సంబంధించిన ఏ అంశమైనా మాట్లాడొచ్చని చెప్పారు. ఇప్పుడు సభ సజావుగా జరిగేలా సహకరించాలని కోరారు. భట్టి సమాధానంపై సంతృప్తి చెందని బీఆర్ఎస్ సభ్యులు లగచర్ల సమస్యపై చర్చించాల్సిందేనని పట్టుబట్టారు. చైర్మెన్ పోడియం వద్దకు వచ్చి నిరసన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శించారు. బీఆర్ఎస్ సభ్యులు సంయమనం పాటించాలనీ, ప్లకార్డులను ప్రదర్శించొద్దని చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కోరారు. వారి స్థానాల్లో కూర్చోవాలని విజ్ఞప్తి చేశారు. అయినా పోడియం ముందు కవిత, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, శంభీపూర్ రాజు, కోటిరెడ్డి తదితరులు నిరసన చేపట్టారు. బీఆర్ఎస్ సభ్యుల నిరసనతో సభలో గందరగోళం ఏర్పడింది. మధ్యాహ్నం 2.55 గంటలకు సభను బుధవారం ఉదయం పది గంటలకు వాయిదా వేస్తున్నట్టు చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు.

లగచర్ల బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం : మధుసూదనాచారి

లగచర్ల బాధితులకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వంపై పోరాటం చేస్తామని శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి చెప్పారు. సభ వాయిదా పడిన వెంటనే బీఆర్ఎస్ సభ్యులు శాసనమండలి ఆవరణలో నిరసన చేపట్టారు. 'గిరిజన రైతుకు బేడీలా సిగ్గుసిగ్గు, ఇదేమి రాజ్యం ఇదేమి రాజ్యం కేడీల రాజ్యం, బేడీల రాజ్యం, లగచర్ల రైతులను విడుదల చేయాలి, ఇది ప్రజాపాలన కాదు ప్రజాపీడన, రైతు పీడన'అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం మీడియా పాయింట్ వద్దకు ప్రదర్శనగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లగచర్ల బాధితుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. భూమి కోసం పోరాడిన వారి పట్ల అమానుషంగా వ్యవహరించి కేసులు పెట్టి అరెస్టు చేసి జైలుకు పంపిందని అన్నారు. ఈ అంశంపై చర్చించాలని పట్టుబడితే ప్రభుత్వం అందుకు సిద్ధంగా లేదన్నారు. వారికి న్యాయం జరిగే వరకు అడుగడుగునా ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు.

భయపడుతున్న ప్రభుత్వం : కవిత

లగచర్ల సమస్యపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భయపడుతున్నదని బీఆర్ఎస్ సభ్యులు కల్వకుంట్ల కవిత అన్నారు. రైతులను అక్రమంగా అరెస్టు చేసి బేడీలు వేయడం సిగ్గుచేటన్నారు. ఈ సమస్యపై భవిష్యత్తులోనూ ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు.

ఇది ప్రజాపీడనా ప్రభుత్వం : దేశపతి శ్రీనివాస్

రైతుకు గుండెపోటు వస్తే స్ట్రెచర్ మీద తీసుకొస్తారా?, బేడీలు వేసి తీసుకొస్తారా?అని బీఆర్ఎస్ సభ్యుడు దేశపతి శ్రీనివాస్ ప్రశ్నించారు. ఇది ప్రజాపాలన ప్రభుత్వం కాదనీ, ప్రజాపీడన ప్రభుత్వమని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యంలో ఇనుపకాళ్ల కింద రైతులు నలిగిపోతున్నారని అన్నారు. పర్యాటక రంగ విధానం తప్పులతడకగా ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో పర్యాటక రంగంలో అభివృద్ధి లేదంటూ ప్రభుత్వం ప్రచారం చేస్తున్నదని చెప్పారు. కరోనా సమయంలో పర్యాటకరంగం అభివృద్ధి చెందుతుందా? ఎవరైనా ఇంటి నుంచి బయటికి వచ్చారా?అని ప్రశ్నించారు.

నియోజక వర్గ సమస్యలు పరిష్కరించండి

- జీరో అవర్‌లో ఎమ్మెల్యేలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తమ నియోజకవర్గాల్లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని పలువురు ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని కోరారు. సంబంధిత అంశాలను వారు సభ దృష్టికి తీసుకొచ్చారు. మంగళవారం జీరో అవర్‌లో భూపాల పల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో సంభవించిన తుఫాను, వరదల ఉధృతి వల్ల నియోజక వర్గంలో పలు వంతెనలు, రోడ్లు తెగిపోయాయని గుర్తు చేశారు. వాటిని మరమ్మతు చేయించటంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు. ఇదే క్రమంలో కొందరు చనిపోయారని తెలిపారు. ఆ కుటుంబాలకు కనీసం నష్టపరిహారం కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఆయా కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల ఓవర్‌సీస్ స్కాలర్ షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలన్నారు. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ ఉస్మానియా ఆస్పత్రిని ప్రస్తుతం ఉన్న స్థలంలోనే పునర్ నిర్మించాలన్నారు. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని చెనెంబర్ ప్రాంతంలో ఐదేండ్లుగా ఫ్లైఓవర్ పనులు జరుగుతున్నాయనీ, తక్షణం వాటిని పూర్తి చేయాలన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ 20ఏండ్లనుంచి పాల్వంచలో ఎన్నికలు జరగటం లేదనీ, అందుకు అడ్డంకిగా ఉన్న సమస్యలను పరిష్కరించి,మున్సిపాల్టీని ఏర్పాటు చేయాలని కోరారు.

బాలునిపై ఎలుగుబంటి దాడి

- గాయపడటంతో ఆస్పత్రికి తరలింపు
- నిజామాబాద్ జిల్లా ఎడపల్లిలో ఘటన

నవతెలంగాణ-ఎడపల్లి



ఉదయం పూట కాలకృత్యాలకు వెళ్లిన బాలునిపై ఎలుగుబంటి దాడి చేసిన ఘటన నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం కుర్నాపల్లి గ్రామ శివారులో మంగళవారం ఉదయం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన అశ్విత్ కుమార్ చెరువు కట్ట వద్ద కాలకృత్యాల కోసం వెళ్లగా.. ఎలుగుబంటి దాడి చేసింది. ఈ ఘటనలో బాలుడు అశ్విత్ తప్పించుకునే ప్రయత్నంలో మోకాలి భాగంలో తీవ్రంగా గాయమైంది. గాయపడిన బాలుడిని స్థానికులు వెంటనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని అటవీశాఖ అధికారులు పరిశీలించారు. ఎలుగుబంటి సంచారంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. కాగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సెలవులు పెడితే పేషెంట్ల పరిస్థితేంటి..?

- కలెక్టర్ హనుమంతరావు ఆగ్రహం
- రామన్నపేట ప్రభుత్వాస్పత్రి ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-రామన్నపేట

ఆస్పత్రిలో అందుబాటులో ఉండాల్సిన వారు ఎక్కువ మంది సెలవులు పెడితే.. పేషంట్లకు వైద్యం ఎవరు చేస్తారంటూ యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రామన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిని మంగళవారం ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. సుమారు రెండు గంటలపాటు ఆస్పత్రి మొత్తం కలియదిరిగారు. ప్రతి పేషెంట్‌నూ కలిసి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓపీ దగ్గర ఉన్న పేషెంట్లతో మాట్లాడి.. అక్కడికక్కడే వైద్యులకు చెప్పి సంబంధిత వైద్యం చేయించారు. కొంతమంది పేషెంట్ల విషయం ఆరోగ్యశ్రీ విభాగం వారికి అప్పజెప్పి.. మెరుగైన వైద్యం అందేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అటెండెంట్ రిజిస్టర్‌లను పరిశీలించి ఒక్కో ఉద్యోగి గురించి పరిశీలించారు. లీవ్ లెటర్లు ఉన్నాయని తెప్పించుకొని పరిశీలించారు. సుమారు 60శాతం ఉద్యోగులు సెలవులో ఉండటాన్ని చూసి అసహనం వ్యక్తం చేశారు. డ్యూటీలో ఉండాల్సిన వారు సెలవులు పెట్టారని, అంతగా ప్రాముఖ్యత లేని వారు డ్యూటీలో ఉన్నారని తెలిపారు. లీవ్ లెటర్లలోని సంతకాలు వారివేనా అని ప్రశ్నించారు. రిజిస్టర్‌లో ఒకరకంగా.. సెలవు చీటీలపై మరో రకంగా ఉండటంపై ఆరా తీశారు. గైనకాలజిస్ట్ పోస్ట్ ఖాళీగా ఉండటంతో ఫోన్‌లో డీసీహెచ్ఎస్‌తో మాట్లాడారు. వెంటనే ఇక్కడ గైనకాలజిస్టును నియమించాలని ఆదేశించారు. ఆస్పత్రిలో పెట్టే భోజనాన్ని పరిశీలించారు. ఫుడ్ కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి నాణ్యమైన పౌష్టికాహార భోజనాన్ని పెట్టాలని సూచించారు. మంచినీటి సౌకర్యం లేకపోవడంతో మిషన్ భగీరథ ఉద్యోగులను పిలిపించి వెంటనే నీటిని అందించడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. హెచ్చీసీఎల్ అధికారులతో మాట్లాడి రెండు వాటర్ ఫిల్టర్‌లను అందించాలని కోరారు.

అలసటగా వుందా..?



కొందరు మహిళలు తరచూ అలసటకు గురవుతుంటారు. ఒక్కసారిగా కలిగిన అలసట.. చాలా రోజుల వరకు వారిని వీడదు. చిన్నపని చేసుకోవడానికి కూడా బద్ధకంగా అనిపిస్తుంది. కాలు కదపకుండా హాయిగా విశ్రాంతి తీసుకోవాలనిపిస్తుంది. ఇలా అకస్మాత్తుగా మహిళలను అలసట ఆవరించి.. రోజుల తరబడి బద్ధకస్థులని చేయడానికి గల కారణమేంటో తెలుసా..

సమయం: కొందరు ప్రతి నిమిషం విలువైనదిగా చూస్తారు. దాంతో తీరిక లేకుండా పని చేయడానికి ప్రాధాన్యం ఇస్తారు. ఇది శరీరం, మెదడు పైన తెలియని ఒత్తిడి కలిగిస్తుంది. అప్పుడే విరామం అవసరమని అర్థం చేసుకోవాలి. కాసేపు నిద్రకు సమయాన్ని కేటాయించి చూడండి.

కలిసిమెలిసి: కొందరు ఒంటరిగా ఉండటానికి ఇష్టపడతారు. దాంతో ఫోన్ వినియోగం ఎక్కువ. దీని ప్రభావం అకస్మాత్తుగా శరీరంలో శక్తి అంతా తగ్గిపోయినట్లుగా అనిపిస్తుంది. కుటుంబ సభ్యులతో గడిపితే మనసు తేలికవుతుంది.

ఒత్తిడికి దూరంగా: తెలియకుండానే మనసుని ఒత్తిడికి గురి చేస్తాం. అనవసర విషయాలకి ప్రాధాన్యం ఇస్తాం. ఇవన్నీ చెడు ప్రభావాన్ని కలిగిస్తాయి. ఏది ముఖ్యం అనే అవగాహన ఉంటే చాలు.

వ్యాయామం: రోజూ అరగంటసేపు చేసే వ్యాయామం, ధ్యానం వంటివి చేస్తే మనసును ప్రశాంతంగా మారుస్తాయి. ఉదయంపూట, అలాగే రాత్రి నిద్రపోయేముందు పది నిమిషాలు చేసే ధ్యానం మంచి నిద్రను తెచ్చిపెడుతుంది.

అలవాటు: ప్రతి ఒక్కరికీ అభిరుచులు ఉంటాయి. చిత్రలేఖనం, పుస్తకపఠనం, క్రీడలు, మొక్కల పెంపకం వంటివెన్నో ఉంటాయి. వాటిలో మనసుకు నచ్చింది ఎంచుకొని రోజూ కొంత సమయాన్ని కేటాయించుకోవాలి. ఈ అలవాటు మనసుకు వ్యాయామంగా మారుతుంది.

ప్రయాణం: కొత్త ప్రాంతాన్ని పర్యటించి రావడం లేదా బాల్యంలో తిరిగిన ప్రాంతాలను చూసి రావడం వంటివి మనసును తేలికపరుస్తాయి. అలాగే స్నేహితులను కలవడం, వారితో చిన్నప్పటి జ్ఞాపకాలను చర్చించడం చేస్తే మానసిక సంతోషం దరి చేరుతుంది. ■



అనాథ పిల్లలకు హోమ్ ఆఫ్ హోప్

కర్నూలు నగరంలోని ఓ మారుమూల ప్రాంతంలో ఓ చిన్న ఆశ్రమం. కానీ అది అసాధారణమైన ప్రయత్నం చేస్తోంది. సుమారు 300 మందికి పైగా అనాథలు, నిరాశ్రయులు, పేద పిల్లలకు ఆశాకిరణంగా మారింది. ఈ గొప్ప ప్రయత్నం వెనుక ఇద్దరు పోస్ట్ గ్రాడ్యుయేట్ సోదరీమణులు ఉన్నారు. వారే బ్లెస్సీ, బ్లిస్సీ. చనిపోయిన వారి తండ్రి ప్రారంభించిన మిషన్‌ను ముందుకు తీసుకువెళుతున్నారు. ఆయన స్థాపించిన హోప్ అనాథాశ్రమాన్ని నిర్వహించడానికి తమ జీవితాలను అంకితం చేసిన ఆ అక్కచెల్లెళ్ల సేవా కార్యక్రమాల గురించి నేటి మానవిలో...

కంపాషన్ సొసైటీ పేరుతో 2010లో స్థాపించబడిన ఈ అనాథాశ్రమం రాజభూషణం, అతని భార్య ప్రమీలా దేవి ఆలోచనల నుండి పుట్టుకొచ్చింది. ఇది నిరుపేద పిల్లల కోసం స్థాపించిన ఓ ఆశ్రమం. జగన్నాథ గట్టుకు వెళ్లే దారిలో జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఉన్న ఈ అనాథాశ్రమంలో కుటుంబ వాతావరణాన్ని తలపించేలా బాలబాలికలకు వేర్వేరుగా వసతి ఉంది.

తల్లి మార్గదర్శకత్వంలో

తండ్రి కోవిడ్‌తో మరణించినప్పుడు బ్లెస్సీ, బ్లిస్సీ ఆయన కలను కొనసాగించడానికి గొప్ప సంకల్పంతో అడుగుపెట్టారు. వారి సేవా స్ఫూర్తిని పంచుకునే తల్లి మార్గదర్శకత్వంలో ఈ సోదరీమణులు తమ సేవా కార్యకలాపాలను విస్తరించారు. 'మా ఆశ్రమానికి వచ్చారంటే ఈ పిల్లలు నిజమైన కుటుంబంలో భాగమైనట్లే. ప్రేమ, విలువైన అనుభూతిని అందించే ఓ అందమైన స్థలాన్ని సృష్టించాలని మేము కోరుకుంటున్నాం' అని బ్లెస్సీ చెప్పారు. ఆహారం, ఆశ్రమంతో పాటే ఈ హోమ్ ఆఫ్ హోప్ ఖైదీలకు విద్య, వృత్తి శిక్షణ, భావోద్వేగ మద్దతును అందిస్తుంది. వారి భవిష్యత్తును గౌరవం, స్వావలంబన భావంతో రూపొందిస్తుంది. టైలరింగ్, క్రాఫ్ట్‌లు వంటి ఇంటి వృత్తిపరమైన కార్యక్రమాలతో పాటు పిల్లలకు అవసరమైన నైపుణ్యాలను కూడా అందిస్తుంది. ఆశ్రమంలోని పిల్లలకు 18 ఏండ్లు నిండిన తర్వాత వారిని స్వతంత్ర జీవితాలకు సిద్ధం చేస్తాయి.





కొత్త జీవితం

ప్రస్తుతం అనాథాశ్రమం పనులు దాని నాలుగు గోడలకు మించి విస్తరించాయి. కొన్నేండ్లుగా ఈ ఆశ్రమం తరపున సుమారు ఐదుగురు యువతులకు వివాహాల జరిపించి వారికంటూ ఓ సొంత కుటుంబాన్ని ఏర్పాటు చేశారు. వారు తమ కొత్త జీవిత ప్రయాణాన్ని ప్రేమ, గౌరవం, భద్రతతో ప్రారంభించేలా చేయూత నిచ్చారు. 'అనాథలకు సేవ చేయడం గొప్ప బహుమతిగా భావిస్తున్నాం. ప్రతిరోజూ కొత్త వ్యక్తులను కలవడం, వారి జీవితాల్లో శాశ్వత ప్రభావాన్ని చూపడానికి మాకు దొరికిన మంచి అవకాశం ఇది' అని బ్లిస్సీ పంచుకున్నారు.

కలలను కొనసాగించడంలో...

అక్కచెల్లెళ్ల నిబద్ధత ఆ పిల్లల చిరునవ్వుల్లో ప్రతిబింబిస్తుంది. ప్రియా (పేరు మార్చాం) అనే అమ్మాయి గుర్తు చేసుకుంటూ 'నేను ఇక్కడికి వచ్చిన రోజును ఎప్పటికీ మరచిపోలేను. ఈ ఇల్లు నాకు కుటుంబాన్ని ఇచ్చింది. నా కలలను కొనసాగించడంలో నాకు సహాయపడింది. హోమ్ ఆఫ్ హోప్ లేకుంటే ఈరోజు నేను ఇలా మిగిలేదాన్ని కాదు' అంటూ పంచుకుంది. ఆరేండ్ల పాటు హోం ఇన్‌చార్జిగా పనిచేసిన బి సతీష్ మాట్లాడుతూ 'మేము వారిని మా సొంత పిల్లల్లాగే చూస్తాము. వారు ప్రపంచంలోకి అడుగు పెట్టడానికి ముందు వారు మానసికంగా, సామాజికంగా, ఆర్థికంగా సిద్ధంగా ఉన్నారని మేము నిర్ధారిస్తాము' అని పంచుకున్నారు. ■

ఇంట్లోనే మందు...

ప్రస్తుతం చాలా మంది.. చర్మ ఛాయ తగ్గడం, నల్లని మచ్చలు, ఇలా చాలా రకాల పిగ్మెంటేషన్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. అయితే కాస్త జాగ్రత్త తీసుకుంటే ఈ సమస్య పరిష్కారానికి ఇంట్లోనే మందును తయారు చేసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

- విటమిన్ సి తగినంతగా మన శరీరానికి అందినప్పుడు పిగ్మెంటేషన్ సమస్య అదుపులో ఉంటుంది. రెండు చెంచాల నిమ్మరసంలో కాస్త గంధం కలిపి ముఖానికి రాసుకుని ఆరనివ్వండి. ఆపై నీళ్లతో శుభ్రం చేసుకుని గులాబీ నీళ్లల్లో ముంచిన దూదితో మరోసారి తుడవండి. ఇలా వారంలో రెండు, మూడు సార్లైనా చేస్తుంటే ఫలితం ఉంటుంది.
- పాలల్లో ఉండే లాక్టిక్ యాసిడ్ చర్మానికి తగిన పోషణ అందిస్తుంది. పాలల్లో చెంచా గులాబీరేకల పొడి, కొద్దిగా తేనె, చెంచా సెనగపిండి కలిపి మెత్తని పేస్ట్‌లా చేసుకోవాలి. దీన్ని ముఖం, మెడ, చేతులకు రాసుకుని స్క్రబ్‌లా రుద్దుకోవాలి. ఇలా చేస్తే మచ్చలు పోతాయి. మృతకణాలూ తొలగిపోతాయి.
- సమాన పరిమాణంలో బొప్పాయి, కలబంద గుజ్జుల్ని తీసుకుని దానికి చెంచా ఓట్స్ పొడిని కలపాలి. దీన్ని ముఖానికి రాసి ఆరనివ్వాలి. ఆపై చేతుల్ని తడుపుకొని సవ్య, అపసవ్య దిశల్లో మునివేళ్లతో మర్దన చేయాలి. దీనివల్ల ముఖం కాంతిమంతంగా మారుతుంది. మచ్చలూ క్రమంగా పోతాయి. ■



బీజేపీది అప్రజాస్వామ్య పాలన

(మొదటిపేజీ తరువాయి)


కాలంగా సందర్శించేందుకు ప్రధాని సిద్ధంగా లేరని అన్నారు. అలాగే రాజ్యాంగంపై చర్చను వినడానికీ ఆయన పార్లమెంటులో లేరని తెలిపారు. ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, ఫెడరలిజం భారత రాజ్యాంగానికి మూలస్తంభాలని, బీజేపీ అప్రజాస్వామికంగా ఫిరాయింపులు చేస్తోందని ధ్వజమెత్తారు. 830 మంది ప్రజాప్రతినిధులు బీజేపీలోకి ఫిరాయించారని, దీంతో వారంతా 'పవిత్రులు' అయ్యారని ఎద్దేవా చేశారు. 95 ఏండ్ల విదేశీయుడు జార్జ్ సోరోస్‌పై బీజేపీ వారం రోజుల పాటు పార్లమెంట్‌ను అడ్డుకుందని, అయితే సోరోస్ డబ్బు ఎవరికి వస్తుంది? జేపీసీ విచారణ జరిపితే ప్రధాని కార్యాలయం గుమ్మం వరకు చేరుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. సోరోస్ సంస్థకు భారతదేశం నుంచి డబ్బు పొందుతోందని చెబుతున్న బీజేపీ, దీన్ని ఆపగలదా? ఆపే ఆలోచన దీనికి ఉందా? అంటూ ఆయన ప్రశ్నల వర్షం కురిపించారు. ఫెడరలిజాన్ని దెబ్బతీసేలా బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిర పరిచేందుకు గవర్నర్‌షిప్‌ను దుర్వినియోగం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వానికి గవర్నర్లు తోడుగా మారారని విమర్శించారు. 'ఒకే దేశం.. ఒకే ఎన్నికలు' అనేది 'ఒకే దేశం... ఒకే నాయకుడు..ఒకే ఆలోచన'కు మార్గమని విమర్శించారు. దేశంలో అప్రకటిత అత్యవసర పరిస్థితి ఉందని జాన్ బ్రిట్టాస్ ఎత్తిచూపారు.

'జులై 19' కటాఫ్ డేట్

నవతెలంగాణ-సిటీబ్యూరో/కూకట్‌పల్లి

ఈ ఏడాది జులై 19 తర్వాత చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాల కూల్చివేతలతో హైడ్రా పేరు సంచలనంగా మారిన విషయం తెలిసిందే. పార్కులు, నాలాలు, చెరువులు, ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి ఇండ్లు కట్టిన అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన హైడ్రా నుంచి తాజాగా కీలక ప్రకటన వచ్చింది. మంగళవారం మేడ్చల్ జిల్లా కూకట్‌పల్లి మండలం ఖైతలాపూర్ పరిధిలోని కాముని చెరువుతో పాటు మైసమ్మ చెరువును హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ చెరువులో నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని హెచ్చరిం చారు. హైడ్రా 2024 జులైలో ఆవిర్భవించిందని, అప్పటికే నివాసం ఉంటే ఆ నివాసాల జోలికి హైడ్రా వెళ్లదని చెప్పారు. అయితే ఈ నిబంధన వాణిజ్య సముదాయాలకు వర్తించదని స్పష్టం చేశారు. అలాగే సంబంధిత ప్రభుత్వ విభాగాల అనుమతులున్న నిర్మాణాల జోలికి కూడా హైడ్రా వెళ్లదన్నారు. హైడ్రా ఆవిర్భవించిన తర్వాత జరిగిన అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని, దాంతోపాటే ఎలాంటి పర్మిషన్స్ లేకుండా కడుతున్న వాటిని సైతం కూల్చేస్తామని తెలిపారు. నూతనంగా తీసుకున్న అనుమతులను సైతం పరిశీలిస్తామన్నారు. సర్కారు విధానాలకు అనుగుణంగా చెరువుల పరిరక్షణ కోసం హైడ్రా పని చేస్తోందన్నారు. పేదల జోలికి హైడ్రా వెళ్లదని, వాళ్ల ఇండ్లను కూల్చేస్తామనే ప్రచారాలను నమ్మొద్దని రంగనాథ్ స్పష్టం చేశారు. కాగా, హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో కాముని చెరువుని పర్యాటకంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో హెచ్‌ఎండీఏ, హైడ్రా అధికారులు పరిశీలించారు.

నల్ల చొక్కాలు.. చేతులకు బేడీలు..



(మొదటిపేజీ తరువాయి)

బీఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయానికి చేరుకున్న తమ చేతులకు సంకెళ్లు వేసుకుని... 'రైతులకు బేడీలు, మంత్రులకు జల్సాలా...?' అంటూ నినదించారు. అక్కడి నుంచి అసెంబ్లీ లాబీల్లోకి చేరుకుని అక్కడ కూడా తమ నిరసనను కొనసాగించారు. మరోవైపు శాసనమండలిలో సైతం బీఆర్ఎస్ సభ్యులు కల్వకుంట్ల కవిత, సత్యవతి రాథోడ్ నల్లచీరెలు ధరించి నిరసన తెలిపారు. మాజీ మంత్రి మహమూద్ అలీ, శంభీపూర్ రాజు, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు తదితరులు నల్లచొక్కాలు ధరించి వచ్చారు.

జమిలీ బిల్లు రాజ్యాంగ విరుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

బిల్లును ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ ఓటింగ్ కోరాయి. ఈ ఓటింగ్‌లో 269 మంది సభ్యులు రాజ్యాంగ సవరణ బిల్లును సమర్థించడానికి మద్దతు ఇచ్చారు. దీనికి మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. 198 మంది సభ్యులు బిల్లును ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకించారు. ప్రజెంటేషన్ దశలోనే తీవ్ర వ్యతిరేకత రావడంతో, వివాదాస్పద బిల్లులను సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపిస్తామని కేంద్ర ప్రభుత్వం సభకు హామీ ఇచ్చింది. నిబంధనల మేరకు తీర్మానం తీసుకురానున్నట్టు న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ అన్నారు. మనీష్ తివారీ, గౌరవ్ గొగొయ్ (కాంగ్రెస్), అమ్రారామ్ (సీపీఐ(ఎం), ధర్మేంద్ర యాదవ్ (ఎస్పీ), టిఆర్ బాలు (డీఎంకే), కళ్యాణ్ బెనర్జీ (టీఎంసీ), సుప్రియా సూలే (ఎన్సీపీ), అనిల్ దేశాయ్ (శివసేన ఠాక్రే), మహ్మద్ బషీర్ (ఐయూఎంఎల్), అసదుద్దీన్ ఓవైసీ (ఎంఐఎం), ఎన్‌కె ప్రేమ్‌చంద్రన్ (ఆర్ఎస్పీ) వంటి ప్రతిపక్ష ఎంపీలు దీనిని తీవ్రంగా వ్యతిరేకించారు. టీడీపీ, శివసేన శిండే వర్గం బిల్లుకు మద్దతు పలికాయి. కేంద్ర హెూం మంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రి కిరణ్ రిజుజు, పెమ్మసాని చంద్రశేఖర్ (టీడీపీ), శ్రీకాంత్ ఏక్‌నాథ్ శిండే (శివసేన శిండే) మాట్లాడుతూ బిల్లును సమర్థించారు.

బిల్లుకు మద్దతుగా మాట్లాడని జేడీయూ

ఎన్డీఏ ప్రభుత్వంలో ప్రధాన భాగమైన జేడీయూ నుంచి ఎవరూ బిల్లుకు మద్దతుగా మాట్లాడలేదు.'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' అనే భావన రాజ్యాంగంలోని ఫెడరలిజంతో సహా ప్రాథమిక సూత్రాలకు విరుద్ధమని ప్రతిపక్ష సభ్యులు అన్నారు. 'బిల్లులోని నిబంధనలు చట్టాన్ని రూపొందించే సభ అధికార పరిధిని ఉల్లంఘిస్తాయి. లోక్‌సభ పదవీకాలం ప్రకారం శాసన సభల పదవీకాలం నిర్ణయించబడదు. చట్టసభలు విడివిడిగా ఉంటాయి. ఈ బిల్లుతో అధిక కేంద్రీకరణ అమలులోకి వస్తుంది. ఒక వ్యక్తి కోరికల నెరవేర్పు కోసమే ఈ బిల్లులను తెస్తున్నారు. ' అని ప్రతిపక్ష ఎంపీలు విమర్శించారు. సమగ్ర అధ్యయనం, విస్తృత చర్చల తర్వాతే బిల్లు తీసుకొచ్చామని న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిందని తెలిపారు. కమిటీ రాజకీయ పార్టీల అభిప్రాయాలను కూడా కోరిందని, 31 పార్టీలు అనుకూలంగా నిలిచాయని, కేవలం 15 పార్టీలు మాత్రమే వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధం కాదని మేఘ్వాల్ అన్నారు. బిల్లులు క్యాబినెట్ పరిశీలనకు వచ్చినప్పుడు జేపీసీ పరిశీలనకు వదిలేయాలని ప్రధాని ఇప్పటికే చెప్పారని హెూం మంత్రి అమిత్ షా అన్నారు.

బిల్లు రాజ్యాంగ విరుద్ధం : డీఎంకే ఎంపీ కనిమొళి

'ఒకే దేశం, ఒకే ఎన్నిక' బిల్లు రాజ్యాంగ విరుద్ధమని, దీనిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని లోక్‌సభలో ఖరాఖండిగా చెప్పినట్టు డీఎంకే ఎంపీ కనిమొళి తెలిపారు. ఈ బిల్లు సమాఖ్య హక్కులకు, ప్రజల ఆకాంక్షలకు కూడా విరుద్ధమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలను ప్రజలు ఐదేండ్ల కాలానికి ఎన్నుకుంటారని, కానీ మీరు వాళ్ల హక్కును దూరం చేస్తారని అనుకోవడం లేదని ఆమె వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ఎన్నేళ్లు ఉండాలనే అధికారాన్ని ప్రజల నుంచి లాక్కుని కేంద్ర ఎన్నికల సంఘానికి ఇవ్వడం కరెక్ట్ కాదని అన్నారు. అలా చేయడం రాష్ట్రాలకు, సమాఖ్య స్ఫూర్తికి, రాజ్యాంగానికి వ్యతిరేకమని తెలిపారు. కేంద్రం ఆ బిల్లును అమల్లోకి తీసుకొస్తే రాజ్యాంగ ప్రాథమిక సూత్రాలకు విఘాతం కలుగుతుందని అన్నారు. కావున తాము ఈ బిల్లును అంగీకరించబోమని స్పష్టం చేశారు.

రాష్ట్రాల హక్కులను ఎలా లాక్కొంటారు?

(మొదటిపేజీ తరువాయి)



ఎంపీ అమ్రారామ్, సీపీఐ(ఎం)ప్రభుత్వానికి సంబంధించినవని, కానీ ఈ బిల్లుతో కేంద్ర ప్రభుత్వం చేతుల్లో వెళ్లిపోతాయని పేర్కొన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో వివిధ విధానాలు, భాషలు, అధికారాలు ఉన్నాయని, వాటిని కేంద్రం ఎలా లాక్కొంటుందని విమర్శించారు. కేవలం ఫాసిస్ట్ విధానాలతో ఈ బిల్లును తీసుకొస్తున్నారని ధ్వజమెత్తారు.

సాయుధ పోరాట కొదమసింహం దర్గ్యానాయక్

నవతెలంగాణ-దేవరుప్పుల

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కొదమసింహం దర్గ్యా నాయక్ అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మంగళవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం ధర్మపురం గ్రామంలో దర్గ్యా నాయక్ (107) భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సభ అనంతరం అంతిమయాత్రగా శ్మశానవాటికకు చేరుకొని అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సంతాపసభలో తమ్మినేని మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఫిరంగులై దేశ్‌ముఖ్ రాపాక రామచంద్రారెడ్డిని ఉరికించిన గొప్ప యోధుడు దర్గ్యానాయక్ అని కొనియాడారు. దర్గ్యా అన్న ఠానునాయక్ కూడా సాయుధ పోరాటంలోనే అమరుడయ్యాడని గుర్తుచేశారు. మరో సోదరుడు శాంక్రూను బతికుండగానే చితిపేర్చి విస్నూరుదొరలు కాల్చి చంపారని, ఆ త్యాగాల కుటుంబంలో జన్మించిన గొప్ప వీరుడు దర్గ్యా నాయక్ అని, అలాగే ఇంటి పెద్ద కోడలు పూలమ్మతో పాటు సోదరులందరూ యుద్ధ వీరులై కదంతొక్కి, రామచంద్రారెడ్డిని గడగడలాడించారని తెలిపారు. వీర తెలంగాణ పోరాట యోధురాలు ఐలమ్మ పోరాటానికి కూడా దర్గ్యానాయక్ అండగా నిలిచారని గుర్తు చేశారు. విస్నూరు దేశ్‌ముఖ్ కుమారుడు జగన్మోహన్ రెడ్డిని జనగామ రైల్వే స్టేషన్‌లో దర్గ్యానాయక్ నరికి చంపారని తెలిపారు. 2015 సెప్టెంబర్ 10న పాలకుర్తిలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్‌తో కలిసి వీరనారి అయిలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారని గుర్తుచేశారు. దర్గ్యానాయక్ పోరాట పటిమను నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు ధర్మానాయక్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు శోభాన్ నాయక్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు సాంబరాజు యాదగిరి, సింగారపు రమేష్, ఇర్రి అహల్య, బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, చిట్యాల సోమన్న, జోగు ప్రకాష్, మండల కార్యదర్శులు ఇంటి వెంకటరెడ్డి, మాచర్ల సారయ్య ఏదునూరి మదర్ తదితరులు పాల్గొన్నారు.

మీరంటే..మీరే

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వేతర రంగాలకు గ్యారంటీ ఇచ్చింది రూ. 51,277.71 కోట్లు, డ్రా చేసిన మొత్తం రూ.51,891,44 కోట్లు, 2023 డిసెంబర్ నుంచి 2024 నవంబర్ వరకు డ్రా చేసిన ఎఫ్ఆర్‌బీఎం రుణాలు రూ.52,118 కోట్లు, అదే సమయంలో కార్పొరేషన్లు, ఎస్పివిలు డ్రా చేసిన ఎఫ్ఆర్‌బీఎం యేతర రుణాలు రూ.61,991 కోట్లు, ప్రభుత్వ పూచీ లేకుండా ప్రభుత్వ రంగ సంస్థలు నవంబర్ 30వరకు తీసుకున్న రుణాలు రూ.10,099.70 కోట్లు అని వివరించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ..ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1,27,208 కోట్ల అప్పు చేసిందనీ, ఇలాగైతే ఐదేండ్లలో రూ.6,37,047 కోట్లకు చేరుకుంటుందని వివరించారు. ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు క్షేమకరం కాదని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్ల కాలంలో చేసిన అప్పు 4,17,496 కోట్లు మాత్రమే అని చెప్పారు. అంత అప్పు కావడానికి వరుసగా రెండేండ్లు కరోనాతో ఆర్థిక సంక్షోభం నెలకొనడం, 1.7 శాతం అదనంగా తీసుకునేందుకు కేంద్రం అనుమతి ఇవ్వడం వల్లనే చేరిందని చెప్పారు.

ప్రశ్నోత్తరాల సమయంలో ఉపన్యాసాలేంటి? రూల్స్ బుక్‌ను మార్చేశారు : మంత్రి భట్టి

మంత్రి భట్టి జోక్యం చేసుకుని మాట్లాడుతూ..'ఇది క్వశ్చన్ అవర్. స్వల్పకాల చర్చ మాదిరిగా హరీశ్‌రావు ఉపన్యాసమేంటి? ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు మాత్రమే ఇస్తారు. చర్చ ఉండదు. కావాలంటే ఇదే అంశంపై సభలో ప్రత్యేకంగా చర్చ పెడుదాం. ప్రతి పైసాకు జవాబుదారీగా ఉంటాం. గతంలోనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేశాం' అని అన్నారు. హరీశ్‌రావు సత్యదూరపు మాటలు మాట్లాడటం తగదన్నారు. బహుషా నిజాలు మాట్లాడితే వారి తలలు పగిలిపోతాయో ఏమో? అని చురకలు అంటించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శాసనసభ రూల్స్ బుక్ నిబంధనలను మార్చేశారని విమర్శించారు. సభలో ప్లకార్డులు ప్రదర్శించొద్దు..నినాదాలు చేయొద్దు అని స్పష్టంగా ఉన్నా ఇదేం పద్ధతి అని ప్రశ్నించారు. 'సభాసాక్షిగా గత సీఎం దళితులకు మూడెకరాల భూమి ఇస్తామన్నారు..ఇచ్చారా? డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చారా? ఉద్యోగాలు ఇచ్చారా?' అని కడిగిపారేశారు. బీఆర్ఎస్ సభ్యులు సభా నియమాలు, నిబంధనలు గురించి మాట్లాడితే విడ్డూరంగా ఉందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు, వడ్డీలకు రూ.66 వేలు కట్టామనీ, ఈ విషయాన్ని బహిరంగంగా చెబుతున్నామని అన్నారు. వ్యవసాయ కూలీలకు 12 వేలు ఇవ్వొద్దా? దానిపై ప్రివిలైజ్ మోషన్ ఏంటి? అప్పులు తీసుకున్న ప్రతి పైసాకూ లెక్క ఉంది. గత ప్రభుత్వం మాదిరిగా మేం దాచిపెట్టలేదు. కార్పొరేషన్ల ద్వారా తీసుకున్న రుణాలు ఏనాడైనా చూపెట్టారా? రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఎప్పుడైనా తాము చర్చకు సిద్ధం ' అని ప్రకటించారు. తమ ప్రభుత్వం తీసుకున్న అప్పు రూ.52 వేల కోట్లే అని చెప్పారు. గత ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు బకాయి పడితే తాము చెల్లిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన రూ.40 వేల కోట్ల రూపాయలను పెండింగ్ పెట్టిందని విమర్శించారు. తాము వాటిని క్లియర్ చేస్తూ పోతున్నామన్నారు. రైతుల నుంచి ప్రతి గింజా కొంటున్నామనీ, సన్నాలకు రూ.500 బోనస్ కూడా చెల్లిస్తున్నామని చెప్పారు. రైతుల ఖాతాల్లో మూడు రోజుల్లోనే డబ్బులు వేస్తున్నామని చెప్పారు.

ప్రసాద్ కుమార్ స్పీకర్ కాదా? ఆయనకు నిర్ణయాధికారం లేదా? : భట్టి

'బీఏసీ సమావేశం ఏనాడైనా గత ప్రభుత్వం సక్రమంగా నిర్వహించిందా? సభను ఎన్ని రోజులు నడపాలి? ఏయే అంశాలు చర్చించాలి? అనే దానిపై కాగితంపై రాసిస్తే స్పీకర్ ఫైనల్ చేసిన విషయం వాస్తవం కాదా? గతంలో ఆ స్థానంలో పోచారం ఉన్నారు..ఇప్పుడు ప్రసాద్ కుమార్ వచ్చారు. అవే నిబంధలను పాటిస్తున్నారు. దీనిని తప్పుబడుతూ బీఏసీలో బీఆర్ఎస్ పక్షం వాళ్లు పేపర్లు విసిరేసి పోవడమేంటి? ఇదేం పద్ధతి? ప్రసాద్‌కుమార్ స్పీకర్ కాదా? ఇది కరెక్టు కాదు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ అటాక్ చేయడం మంచి పద్ధతి కాదు. అన్నీ నిబంధనల మేరకే నడుస్తాయి. మేం చెప్పినట్టు సభ నడవాలనుకోవడం సరిగాదు' అంటూ హరీశ్‌రావుకు చురకలు అంటించారు. 'మాకు నీతులు చెబుతున్నారు. వికారాబాద్ ప్రజలు చూస్తున్నారు. మా హక్కులు కాపాడండి స్పీకర్‌సార్' అని హరీశ్‌రావు అన్న మాటలపై స్పీకర్ ప్రసాద్‌కుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు.

తప్పుడు లెక్కలు.. తప్పుదోవ.. : హరీశ్‌రావు

ఉచిత విద్యుత్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా చెల్లించలేదన్న ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు ఖండించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉచిత విద్యుత్‌కు రూ. 65 వేల కోట్లు విద్యుత్ శాఖకు చెల్లించామని స్పష్టం చేశారు. కానీ మంత్రి భట్టి విక్రమార్క తప్పుడు లెక్కలు చెబుతూ సభను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలో రూ. 1,27,208 కోట్లు అప్పు చేసి కొత్తగా ఒక్క ప్రాజెక్టు కూడా కట్టలేదని విమర్శించారు. తమ హయాంలో అనేక సాగునీటి ప్రాజెక్టులు నిర్మించామనీ, మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందించామని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆస్తులను సృష్టించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాత్రం అప్పులు చేసి కమీషన్లు పంచుకు తింటున్నారని ఆరోపించారు. ప్రజలకు వాస్తవాలు చెప్పాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. తాము అడిగిన ప్రశ్నలకు సమాధానాలు లేక మంత్రులు భుజాలు తడుముకుంటున్నారని విమర్శించారు. తమ హయాంలో వడ్లు కొనలేదా? రైతులకు డబ్బులు ఇవ్వలేదా?అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉచిత కరెంటు ఇవ్వలేదని మంత్రి మాట్లాడటం తగదన్నారు. తాము కూడా విద్యుత్ సంస్థలకు బకాయిలు చెల్లించామని స్పష్టం చేశారు. భట్టి విక్రమార్క వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

ఇక్కడ మెడిసిన్ చేసిన వాళ్లు స్థానికులే

148,149 జీవోలు చెల్లవు : హైకోర్టు

నవతెలంగాణ-హైదరాబాద్



తెలంగాణలో బ్యాచిలర్ ఆఫ్ మెడిసిన్ అండ్ బ్యాచిలర్ ఆఫ్ సర్జరీ(ఎంబీబీఎస్), బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదం మెడిసిన్ అండ్ సర్జరీ(బీఏఎంఎస్), బ్యాచిలర్ ఆఫ్ హెూమియోపతిక్ మెడిసిన్ అండ్ సర్జరీ(బీహెచ్ఎంఎస్) కోర్సులు పూర్తి చేసిన వాళ్లు స్థానికులుగా పరిగణించాలని హైకోర్టు తీర్పు వెలువరించింది. వారిని మెడికల్ పీజీ సీట్ల భర్తీలో 'స్థానికులు'గా పరిగణించాలంది. తెలంగాణలో ఎంబీబీఎస్, బీహెచ్ఎంఎస్/బీఏఎంఎస్ చేసినవారికి స్థానిక కోటా పరిధిలోనే అడ్మిషన్‌లు కల్పించాలని తేల్చి చెప్పింది. రాష్ట్రం వెలుపల చదివిన, ఇన్‌సర్వీసు అభ్యర్థులకు సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం అడ్మిషన్‌లు కల్పించాలని పేర్కొంది. ప్రభుత్వానికి నిబంధనలు తీసుకురావడంతోపాటు సవరణ తీసుకువచ్చే అధికారం ఉందనీ, అయితే అది చట్టానికి అనుగుణంగా ఉండాలని పేర్కొంది. తెలంగాణ స్థానికతతో ఇతర ప్రాంతాల్లో ఇదే కోర్సులు పూర్తి చేసిన వారిని కూడా 'లోకల్' కిందే కౌన్సిలింగ్ నిర్వహించాలంది. అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టాక నిబంధనలను మార్పు చేయడాన్ని తప్పుపట్టింది. ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 148, 149లను కొట్టేస్తూ తీర్పు వెలువరించింది. ఈ జీవోలు చట్ట వ్యతిరేకమని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాథే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371డి, పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 95, రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం స్థానికత వంటి వాటిని ధర్మాసనం తన తీర్పులో ఉదహరించింది. తెలంగాణ మెడికల్ కాలేజీల (పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల అడ్మిషన్ల) నిబంధనలు 2021లోని రూల్ 8(2)ను, తెలంగాణ అడ్మిషన్ పోస్టుగ్రాడ్యుయేట్(ఆయుష్) కోర్సుల నిబంధనలు 2024లోని రూల్ 8 (2)ను ప్రభుత్వం సవరించింది. గత అక్టోబర్‌లో 28న 148, 149 జీవోలను జారీ చేసింది. ఈ జీవోలు చట్టవిరుద్ధమని తీర్పులో పేర్కొంది.

ఇదే హైకోర్టు గత ఏడాది ఇచ్చిన తీర్పుకు విరుద్ధంగా జీవోలు ఉన్నాయని తేల్చింది. రాష్ట్ర విభజన తర్వాత ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లో జాతీయ కోటా (15 శాతం) పోను మిగిలిన కన్వీనర్ కోటా సీట్లు (85 శాతం) స్థానిక విద్యార్థులకే కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 72ను సమర్థిస్తూ గత సెప్టెంబర్‌లో తీర్పు ఇచ్చింది. ఆ తీర్పు రాష్ట్రపతి ఉత్తర్వులు 1974ను ఉల్లంఘించలేదని పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371డి, పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 95కి కూడా జీవో 72 విరుద్ధం కాదంది. పీజీ మెడికల్ అడ్మిషన్ల రూల్స్‌ను మార్పు చేయడాన్ని సవాలు చేస్తూ హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ రజిత, మంచిర్యాలకు చెందిన సత్యనారాయణ, స్థానికత వ్యవహారంపై సుమారు వంద మంది వేర్వేరుగా వేసిన పిటిషన్లపై హైకోర్టు ఈ కీలక తీర్పును వెలువరించింది.

పెద్దల భూ దందా



(మొదటిపేజీ తరువాయి)

పద్ధతుల్లో ఓఆర్‌సీ పొందిన వాళ్లు ఆ భూముల్ని నారాయణరావు, రాజన్న లోహడే, ఛాయ లోహడేలకు విక్రయించారు. వివాదస్పదమైన రియల్ ఎస్టేట్ వ్యాపారి నారాయణరావుపై అప్పట్లో ఫిర్యాదులు చేయడంతో అసెంబ్లీలో హౌస్ కమిటీ ఏర్పాటు చేశారు. హౌస్ కమిటీ సూచనల మేరకు సుల్తాన్‌పూర్ ఓఆర్‌సీ వ్యవహారాన్ని తేల్చాలని 1993లో సీసీఎల్‌ఏ అధికారిగా ఉన్న మహంతికి బాధ్యతలు అప్పజెప్పారు. ఆయన రికార్డుల్ని పరిశీలించి విచారణ జరిపారు. అప్పట్లో ఇచ్చిన ఓఆర్‌సీలు తప్పు పద్ధతిలో జారీ అయ్యాయని తేల్చారు. సీసీఎల్‌ఏ అధికారి మహంతి సూచనల మేరకు 1984లో అప్పటి మెదక్ జిల్లా జాయింట్ కలెక్టర్ 432.25 ఎకరాలకు సంబంధించిన భూముల ఓఆర్‌సీ సర్టిఫికెట్లను రద్దు చేశారు. అయితే 83.27 ఎకరాల భూమికి సంబంధించిన ఓఆర్‌సీలను మాత్రం కొనసాగించారు.

సర్వే నెంబర్ 30లో 722.20 ఎకరాల ప్రభుత్వ భూములు

అమీన్‌పూర్ రెవెన్యూ మండలం సుల్తాన్‌పూర్ ప్రాంతంలో సర్వే నెంబర్ 30లో 722.20 ఎకరాల భూములున్నాయి. ఇందులో 83.20 ఎకరాలు శిఖం భూమి కాగా 384 ఎకరాల్లో కొండలు, మైదానాలున్నాయి. 6.08 ఎకరాల భూమి గ్రామం పరిధిలో ఉంది. 0.17 ఎకరాల్లో శ్మశాన వాటిక ఉండగా 6.08 ఎకరాల్లో రోడ్లున్నాయి. 242.07 ఎకరాల భూములు రైతుల సాగులో ఉన్నాయి. మొత్తం భూమిలో 480.13 ఎకరాల భూములు సాగుకు అనుకూలంగా లేకపోగా 242.07 ఎకరాలు మాత్రం సాగులో ఉన్నాయి. కొండలు, మైదానంగా ఉన్న ఆ పడావు భూములపై బడా నేతలు కన్నేసి ఆక్రమణకు ఉసికొల్పారు.

ఎకరం ధర రూ.15కోట్లపైనే..

గత ప్రభుత్వంలో సాగిన భూ దందాల జోరు ఈ ప్రభుత్వంలోనూ కొనసాగుతోందనే చర్చను బలపర్చేలా సుల్తాన్‌పూర్ ప్రభుత్వ భూముల వ్యవహారం వెలుగు చూస్తోంది. ప్రభుత్వంలోని పెద్దల కనుసైగలతోనే సర్కారు భూముల్ని మింగే తతంగానికి ఒడిగట్టినట్టు విమర్శలున్నాయి. ఆర్‌సీ పురం, పటాన్‌చెరు ప్రాంతానికి చెందిన అధికార పార్టీ నాయకులే ఈ దందాలో ఉన్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇద్దరు కీలక నేతలకు నగదు రూపంలో పెద్ద మొత్తంలో డబ్బు ముట్టచెప్పేలా ఒప్పందం కుదిరిన తర్వాతనే అవుట్ ప్రక్రియను షురూ చేసినట్టు విశ్వసనీయ సమాచారం. అవుట్ రింగ్ రోడ్డుకు ఆనుకొని ఉన్న భూములు కావడంతో అక్కడి భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ప్రస్తుత మార్కెట్ విలువ చూస్తే అక్కడ ఎకరం ధర రూ.15 కోట్లపైనే పలుకుతోంది.

మసీదు నిర్మాణం.. విద్యుత్ స్తంభాల ఏర్పాటు

ఇనామ్, ఓఆర్‌సీ, కొనుగోలుదారులమంటూ ప్రభుత్వ భూముల్ని కాజేసేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. గుట్ట, మైదానంగా ఉన్న ప్రభుత్వ భూమిలో గుట్టుగా బండరాళ్లను తొలగించారు. అంతకు ముందే పైన చిన్న మసీదును కూడా నిర్మించారు. ఇటీవల ఆ మసీదును మరింత విస్తరించినట్టు చెబుతున్నారు. భూమిని చదును చేసి ప్లాట్లుగా మార్చారు. విక్రయించిన ప్లాట్లలో తాత్కాలిక నిర్మాణాల కోసం సిమెంట్ ఇటుకలతో నిర్మాణాలు చేశారు. బౌండ్రీ చుట్టూ రేకులతో గోడ కట్టారు. రోడ్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమిలో అక్రమంగా లేఅవుట్ చేస్తుంటే విద్యుత్ శాఖ అధికారులు మాత్రం పదుల సంఖ్యలో స్తంభాలు పాతారు. లేవుట్ అనుమతులు, భూమి రికార్డుల్ని పరిశీలించకుండానే స్తంభాలేశారు.



తప్పిన ఫాలోఆన్

- రాణించిన రాహుల్, జడేజా
- భారత్ తొలి ఇన్నింగ్స్ 252/9
- డ్రా కోసం టీమ్ ఇండియా పోరాటం

భారత్,ఆసీస్ మూడో టెస్టు నాల్గో రోజు

గబ్బా టెస్టు ఆసక్తికరంగా మారింది. భారత బ్యాటర్లు, బౌలర్లు ఆశించిన ప్రదర్శన చేయలేదు. కానీ వరుణుడు నిలకడగా ఆటకు ఆటంకం కలిగిస్తూ ఉండటంతో బ్రిస్బేన్‌లో భారత్ డ్రా కోసం పోరాడేందుకు ఓ అవకాశం ఏర్పడింది. కెఎల్ రాహుల్ (84), రవీంద్ర జడేజా (77) స్ఫూర్తిదాయక అర్థ సెంచరీలతో కదం తొక్కారు. ఆకాశ్ దీప్, జశ్‌ప్రీత్ పదో వికెట్ పోరాటంతో భారత్ ఫాలోఆన్ గండం నుంచి గట్టెక్కింది. మూడో టెస్టులో నేడు ఆఖరు రోజు. రోజంతా వర్షం సూచనలు ఉండటం భారత్‌కు అతిపెద్ద అనుకూలత.

నవతెలంగాణ-బ్రిస్బేన్

కెఎల్ రాహుల్ (84, 139 బంతుల్లో 8 ఫోర్లు), రవీంద్ర జడేజా (77, 123 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) బాధ్యతాయుత అర్థ సెంచరీలు సాధించారు. మేఘావృత వాతావరణంలో ఆసీస్ పేసర్లు నిప్పులు చెరిగినా.. రాహుల్, రవీంద్ర అసమాన ఇన్నింగ్స్‌లతో కదం తొక్కారు. కీలక బ్యాటర్లు చేతులెత్తేసిన వేళ టీమ్ ఇండియా ఫాలో ఆన్ గండం గట్టెక్కేలా చేశారు. యశస్వి జైస్వాల్ (4), శుభ్‌మన్ గిల్ (1), విరాట్ కోహ్లి (3), రిషబ్ పంత్ (9), రోహిత్ శర్మ (10) దారుణంగా విఫలమయ్యారు. తొలి ఇన్నింగ్స్‌లో 74.5 ఓవర్లలో భారత్ 252/9 పరుగులు చేసింది. ఆకాశ్ దీప్ (27 నాటౌట్, 31 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), జశ్‌ప్రీత్ బుమ్రా (10 నాటౌట్, 27 బంతుల్లో 1 సిక్స్) అజేయంగా ఆడుతున్నారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ మరో 193 పరుగులు వెనుకంజలో కొనసాగుతుంది.

ఆదుకున్న రాహుల్, జడేజా

తొలి ఇన్నింగ్స్‌లో ఓవర్‌నైట్ స్కోరు 51/4తో నాల్గో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన టీమ్ ఇండియా.. ఐదు మాత్రమే కోల్పోయి విలువైన పరుగులు చేసింది. ఆరంభంలో కెఎల్ రాహుల్ అందించిన క్యాచ్‌ను స్మిత్ నేలపాలు చేశాడు. అంది వచ్చిన అవకాశాన్ని రాహుల్ రెండు చేతులా ఒడిసిపట్టుకున్నాడు. అద్భుత ఇన్నింగ్స్ నమోదు చేశాడు. రోహిత్ శర్మ (10) పాట్ కమిన్స్ ఓవర్లో అవుటైనా.. రవీంద్ర జడేజా (77) తోడుగా అదరగొట్టాడు. రోహిత్‌తో కలిసి ఐదో వికెట్‌కు 30 పరుగులు జోడించిన రాహుల్.. రవీంద్ర జడేజాతో కలిసి ఆరో వికెట్‌కు 67 పరుగులు సాధించాడు. ఆరు ఫోర్లతో 85 బంతుల్లో అర్థ సెంచరీ సాధించిన రాహుల్ ఆసీస్ బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. రాహుల్ నిష్క్రమించినా.. నితీశ్ కుమార్ రెడ్డి (16)తో కలిసి రవీంద్ర జడేజా పోరాటం కొనసాగించాడు. ఆరు ఫోర్లతో 82 బంతుల్లో అర్థ సెంచరీ సాధించిన జడేజా భారత్‌ను ఫాలోఆన్ గండం నుంచి తప్పించాడు. నితీశ్, జడేజా జోడీ ఏడో వికెట్‌కు 53 పరుగులు చేసింది. రాహుల్, జడేజా మెరవటంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో పోరాట పటిమ కొనసాగించింది.



బుమ్రా, ఆకాశ్ వావ్

రాహుల్, జడేజా, జడేజా నిష్క్రమణతో భారత్ 194/7తో నిలిచింది. ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 445 పరుగులు చేయగా.. ఫాలోఆన్ మార్క్ 246 పరుగులు. బ్యాటింగ్ లైనప్ పెవిలియన్‌లో కూర్చోగా భారత్ ఫాలోఆన్ ప్రమాదంలో పడింది. ఈ సమయంలో టెయిలెండర్లు తెగువ చూపించారు. జశ్‌ప్రీత్ బుమ్రా (10 నాటౌట్), ఆకాశ్ దీప్ (27 నాటౌట్) పదో వికెట్‌కు అజేయంగా 39 పరుగులు జోడించారు. దీంతో భారత్ ఫాలోఆన్ గండం గట్టెక్కింది. అదనపు భారంతో అలిసిపోయిన కమిన్స్, స్టార్క్‌లు పాత బంతితో బుమ్రా, ఆకాశ్ దీప్‌లను ఇరకాటంలో పెట్టడంలో విఫలమయ్యారు. దీంతో బుమ్రా, ఆకాశ్‌లు అలవోకగా పరుగులు పిండుకున్నారు. బుమ్రా, ఆకాశ్‌లు చెరో సిక్సర్‌తో భారత శిబిరంలో ఉత్సాహం నింపారు. ఫాలోఆన్ మార్క్ దాటడంతో స్టేడియంలో భారత అభిమానులు కేరింతలు కొట్టారు. వర్షం ప్రభావిత టెస్టులో ఆసీస్ మరోసారి బ్యాట్ పట్టేలా చేసింది. దీంతో గబ్బా టెస్టులో డ్రా అవకాశాలు రెట్టింపు అయ్యాయి!.

నేడు వర్షం సూచనలు

భారత్, ఆసీస్ మూడో టెస్టులో నేడు ఆఖరు రోజు. తొలి వర్షంతో సుమారు 90 శాతం ఆట తుడిచిపెట్టుకుపోయింది. నాల్గో రోజు ఆటలో సైతం వరుణుడు ఆటంకం కలించాడు. మూడు సెషన్లలో పలుమార్లు వర్షంతో ఆట నిలిచిపోయింది. దీంతో మంగళవారం కేవలం 57.5 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యపడింది. దీనికి తోడు పేసర్ హాజిల్‌వుడ్ గాయంతో మైదానం వీడాడు. పాట్ కమిన్స్, మిచెల్ స్టార్క్, నాథన్ లయాన్‌లు మాత్రమే వికెట్ల వేట బాధ్యత తీసుకున్నారు. పాత బంతితో వికెట్ల వేట ఆసీస్ పేసర్ల కష్టంగా మారింది. నేడు చివరి రోజు ఆటలో రోజంతా వర్షం సూచనలు ఉన్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురవనుంది. మధ్యాహ్నం భారీ నుంచి అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. దీంతో కనీసం రెండు సెషన్ల ఆట సాధ్యపడే అవకాశం వీల్లేదు. ఆసీస్ మరోసారి బ్యాటింగ్‌కు రావాల్సి ఉండటం, ఆ తర్వాత భారత్ పది వికెట్లు నిలుపుకుంటే బ్రిస్బేన్ టెస్టు నుంచి గట్టెక్కే అవకాశం ఉంది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : 445/10

భారత్ తొలి ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ (సి) మార్ష్ (బి) స్టార్క్ 4, కెఎల్ రాహుల్ (సి) స్మిత్ (బి) లయాన్ 84, శుభ్‌మన్ గిల్ (సి) మార్ష్ (బి) స్టార్క్ 1, విరాట్ కోహ్లి (సి) కేరీ (బి) హాజిల్‌వుడ్ 3, రిషబ్ పంత్ (సి) కేరీ (బి) కమిన్స్ 9, రోహిత్ శర్మ (సి) కేరీ (బి) కమిన్స్ 10, రవీంద్ర జడేజా (సి) మార్ష్ (బి) కమిన్స్ 77, నితీశ్ కుమార్ రెడ్డి (బి) కమిన్స్ 16, మహ్మద్ సిరాజ్ (సి) కేరీ (బి) స్టార్క్ 1, జశ్‌ప్రీత్ బుమ్రా నాటౌట్ 10, ఆకాశ్ దీప్ నాటౌట్ 27, ఎక్స్‌ట్రాలు : 10, **మొత్తం : (74.5 ఓవర్లలో 9 వికెట్లకు) 252.**

వికెట్ల పతనం : 1-4, 2-6, 3-22, 4-44, 5-74, 6-141, 7-194, 8-201, 9-213.

బౌలింగ్ : మిచెల్ స్టార్క్ 24-3-83-3, జోశ్ హాజిల్‌వుడ్ 6-2-22-1, పాట్ కమిన్స్ 20.5-2-80-4, నాథన్ లయాన్ 21-0-54-1, ట్రావిశ్ హెడ్ 1-0-1-0, మిచెల్ మార్ష్ 2-0-6-0.

'బచ్చలమల్లి'కి అందరూ కనెక్ట్ అవుతారు




అల్లరి నరేష్

"గమ్యం'లో గాలి శీను ఎలా గుర్తుండిపోయాడో, 'బచ్చల మల్లి' కూడా ఓ పదేండ్ల పాటు గుర్తుండిపోతాడు. క్యారెక్టర్ ఇంపాక్ట్ అలా ఉంటుంది. నా కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి కొత్తగా ట్రై చేశాను' అని హీరో అల్లరి నరేష్ చెప్పారు. ఆయన నటించిన రస్టిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బచ్చల మల్లి'. సుబ్బు మంగాదేవి దర్శకుడు. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, బాలాజీ గుత్తా నిర్మించారు. ఈనెల 20న క్రిస్మస్ సందర్భంగా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హీరో అల్లరి నరేష్ మీడియాతో సంభాషించారు.

- డైరెక్టర్ సుబ్బు ఈ కథ చెప్పినప్పుడు సింగల్ సిట్టింగ్ లోనే ఓకే అయింది. కథ అంత అద్భుతంగా ఉంది. ఇప్పటివరకు నేను చేసిన సినిమాల్లో చాలా వేరియేషన్స్ ఉన్న క్యారెక్టర్ ఇది. ఇందులో హాస్య రసం తప్ప అన్ని వేరియేషన్స్ ఉన్నాయి.
- 'నాంది' తర్వాత డిఫరెంట్ సినిమా చేద్దామనుకున్నాను. అలా మంచి కంటెంట్ సినిమాల కోసం చూస్తున్న టైంలో ఈ సినిమా వచ్చింది. నిర్మాత రాజేష్‌కి కూడా చాలా నచ్చింది. ఆయన చాలా ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యారు. ఇది ఆటో బయోగ్రఫీ కాదు. డైరెక్టర్ సుబ్బు ఊర్లో బచ్చల మల్లి అనే ఒక క్యారెక్టర్ ఉంది. ఆయన ఊర్లో గొడవలను కూడా తన గొడవలుగా ఫీల్ అయ్యే మనిషి. ఆయన జీవితంలోని మూడు ఇన్సిడెంట్స్ తీసుకుని కంప్లీట్‌గా ఒక డిఫరెంట్ కథని తయారు చేశారు.
- బచ్చల మల్లి చాలా ఇంపాక్ట్ ఫుల్ క్యారెక్టర్. ప్రతి మనిషిలోనూ బచ్చలమల్లి లాంటి క్యారెక్టర్ ఉంటుంది. మనకు తెలియకుండానే జీవితంలో కొన్ని నిర్ణయాలు మూర్ఖత్వంతో తీసుకుంటాం. అందరూ రిలేట్ చేసుకునే క్యారెక్టర్ ఇది. ఇందులో తెలియకుండానే ఒక మంచి మెసేజ్ కూడా ఉంది. ఈ కథని చాలా నిజాయితీగా చెప్పాం. ఈ సినిమాలో ప్రీ క్లైమాక్స్ చాలా అద్భుతంగా ఉంటుంది. సుడిగాడు 2ని పాన్ ఇండియా స్థాయిలో చేస్తున్నాం.

శ్రీమురళి కొత్త సినిమా 'పరాక్'


తెలుగు పరిశ్రమలో బ్లాక్‌బస్టర్ ప్రాజెక్ట్‌లను అందించిన నిర్మాత టీజీ విశ్వప్రసాద్ నేతృత్వంలోని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వారి 47వ ప్రాజెక్ట్ కోసం శ్రీమురళితో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉంది.
'బఘీర' ఘనవిజయం తర్వాత శ్రీమురళి, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కలిసి నిర్మాత విశ్వ ప్రసాద్ నేతృత్వంలో చేస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ కాంబినేషన్ ఇప్పటికే అభిమానులు, విమర్శకులలో క్యురియాసిటీని పెంచింది. ఈ స్పెషల్ మూమెంట్‌కి గుర్తుగా, అలాగే శ్రీమురళి పుట్టినరోజును పురస్కరించుకుని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను విడుదల చేసింది.
ఇదిలా ఉంటే, శ్రీమురళి పుట్టినరోజు సందర్భంగా బ్రాండ్ స్టూడియోస్ హాలేష్ కోగుండి టీమ్ రూపొందిస్తున్న కొత్త సినిమాకి 'పరాక్' అనే టైటిల్‌ని అనౌన్స్ చేశారు. ఇది అభిమానులకు, ప్రేక్షకులకు గొప్ప విజువల్ ట్రీట్ అవుతుందని, ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ప్రాజెక్ట్ మార్చిలో సెట్స్‌పైకి రానుంది అని మేకర్స్ తెలిపారు.



శ్రీ మురళి

నవచిత్రం

మాజీ ప్రేయసి పై ప్రతీకారం తీర్చుకునే కథ



మృణాల్ ఠాకూర్, అడివి శేష్


అడివి శేష్ నటిస్తున్న పాన్-ఇండియా యాక్షన్ డ్రామా 'డకాయిట్'. షానిల్ డియో దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. హిందీ, తెలుగు భాషలలో ఏకకాలంలో ఈ చిత్రాన్ని చిత్రీకరణ చేస్తున్నారు. అడివి శేష్, షానీల్ డియో సంయుక్తంగా కథ, స్క్రీన్ ప్లే రూపొందించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమాకి సంబంధించి లాంగ్ షెడ్యూల్ మహారాష్ట్రలో కొనసాగుతుంది.
మంగళవారం తన పుట్టినరోజు సందర్భంగా అడివి శేష్, తన లీడింగ్ లేడీని ఈ హై ఆక్టేన్ ఫేస్ ఆఫ్‌లోకి స్వాగతిస్తున్నట్లు అనౌన్స్ చేశారు. మృణాల్ ఠాకూర్ ఈ చిత్రంలో ఫీమేల్ లీడ్‌గా చేరారు. అడివి శేష్, మృణాల్ ఠాకూర్ పాత్రల మధ్య కెమిస్ట్రీని ప్రజెంట్ చేస్తూ చిత్ర బృందం ఇంటెన్స్ పోస్టర్‌ను రిలీజ్ చేసింది. తనకు ద్రోహం చేసిన తన ఎక్స్ లవర్ పై ప్రతీకారం తీర్చుకునే కోపంతో ఉన్న దోషి కథగా, ప్రేమ, ద్రోహం, ప్రతీకారం, పవర్ ద్వారా నడిచే యాక్షన్ డ్రామాగా ఈ సినిమా ఉండనుంది అని చిత్ర యూనిట్ తెలిపింది.

ప్రేక్షకులకు కృతజ్ఞతలు



రాకింగ్ రాకేష్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'కేశవ చంద్ర రమావత్' (కెసిఆర్). గ్రీన్ ట్రీ ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ చిత్రానికి గరుడవేగ అంజి దర్శకత్వం వహించారు.
రాకింగ్ రాకేష్ స్వయంగా నిర్మించారు. అనన్య కృష్ణన్ కథానాయికగా నటించింది. నవంబర్ 22న విడుదలైన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకొని, ఘన విజయాన్ని సాధించింది. ఈ సందర్భంగా మేకర్స్ సక్సెస్ మీట్ నిర్వహించారు.
హీరో రాకింగ్ రాకేష్ మాట్లాడుతూ,'ఈ సినిమా ఆలోచనని ఓ మిత్రుడికి చెప్పినప్పుడు తను ఇచ్చిన సమాధానం, నాకు ఎదురైన బాధ, అవమానం నన్ను ఈ సినిమాని ఎట్టి పరిస్థితుల్లోనైనా చేయాలనే కసి రేకెత్తించింది. ఒక కసితో ఈ సినిమా చేశాను. ఈ సినిమా చేయడానికి కారణం రాఘవన్న, పుష్ప వదిన వాళ్ళు లేకపోతే ఈ సినిమా లేదు. నా భార్య సుజాత కారణంగానే నేను ఈరోజు ఈ వేదికపై ఉన్నాను. నాకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చింది. ఈ సినిమాకు పని చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు. చరణ్ చాలా మంచి మ్యూజిక్ ఇచ్చారు. డైరెక్టర్ అంజి నన్ను తలెత్తుకునేలా చేసే సినిమా తీశారు. ఈ నెలలోనే మరో సినిమాని ప్రకటించబోతున్నాను. ఈ సినిమాలో నటించిన నటీనటులందరికీ రుణపడి ఉంటాను. ఈ సినిమా ఆహాలో ప్రసారమవుతుంది. ఈ సినిమాకి ఖచ్చితంగా అవార్డ్స్ వస్తాయి. గొప్ప పండగ చేసుకుంటాం. ఈ సినిమాకి పార్ట్ 2 కూడా ఉంటుంది. ఇదే టీంతో మరో మంచి సినిమాతో మీ ముందుకు వస్తాం. మీ అందరి ఆశీర్వాదంతో మరో హిట్ కొడతాం' అని అన్నారు.

'గోదారి గట్టు' సాంగ్‌కి అద్భుతమైన రెస్పాన్స్



వెంకటేష్, అనిల్ రావిపూడి, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం సమకూరుస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన 'గోదారి గట్టు..' సాంగ్ 27 మిలియన్ వ్యూస్ క్రాస్ చేసి చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. రమణ గోగుల పాడిన ఈ పాట సోషల్ మీడియాతో పాటు అన్నీ మ్యూజిక్ చార్ట్స్‌లో టాప్ ట్రెండింగ్‌లో కొనసాగుతూ వైరల్‌గా మారింది. జనవరి 14న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు, సింగర్ రమణ గోగుల మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- 'గోదారి గట్టు..' సాంగ్ ఆల్రెడీ 27 మిలియన్ వ్యూస్ దాటేసింది. ఈ రెస్పాన్స్ చాలా గ్రేట్ ఫుల్‌గా ఉంది. నా పాటని అభిమానించే ఎంతోమంది అభిమానులు ఉన్నారు. మళ్ళీ నేనెప్పుడు పాడతానా అని ఎదురు చూశారు. నేను నా వ్యక్తిగత జీవితంలో బిజీ అయిపోయాను. యూఎస్‌లో ఉన్నాను. నేను ఎవరి సంగీతంలో ఇప్పటివరకు పాడలేదు. కానీ అనిల్, భీమ్స్ చాలా లవింగ్ పర్సన్స్. ఫెంటాస్టిక్ యాటిట్యూడ్‌తో ఉంటారు. వెంకటేష్ నాకు చాలా మంచి ఫ్రెండ్. నా తొలి సినిమా వెంకటేష్ 'ప్రేమంటే ఇదేరా.' ఇలాంటి మంచి కాంబినేషన్‌లో వస్తున్న ఈ పాటని పాడాలని అనుకున్నాను. భీమ్స్ లవ్లీగా కంపోజ్ చేశారు. పాటకి ఇంత అద్భుతమైన రెస్పాన్స్ రావడం చాలా ఆనందం ఇచ్చింది. లైఫ్ ఫుల్ సర్కిల్ అయిందనే ఫీలింగ్ వచ్చింది
- పాటలో ఒక హార్ట్ ఉంది. డెఫినెట్‌గా పాడాలి అనిపించింది. అలా ఈ పాట పాడాను. ఈ పాట పాడటానికి చాలా క్రియేటివ్ ఫ్రీడమ్ దొరికింది. మధుప్రియ కూడా చాలా అద్భుతంగా పాడింది. నా వాయిస్‌కి తన వాయిస్‌కి పర్ఫెక్ట్‌గా బ్యాలెన్స్ అయింది. భాస్కర భట్ల చక్కగా రాశారు. ఓ వ్యక్తి ఫోన్ చేసి మా ఊర్లో పొద్దున లేస్తే ఇదే పాట వేస్తున్నారు, అందరూ డాన్స్ చేస్తున్నారని చెప్పారు. వాయిస్‌లో అదే మ్యాజిక్ ఉందని అందరూ చెప్పడం చాలా హ్యాపీనెస్‌నిచ్చింది.
- వెంకటేష్ కాల్ చేశారు. నేను మళ్లీ పాట పాడడం చాలా ఆనందంగా ఉందని చెప్పారు. ఆయనకి పాట చాలా నచ్చింది. ఆయనలో అప్పటికి, ఇప్పటికీ ఎలాంటి మార్పు లేదు. అదే మ్యాజిక్ ఉంది. ఆయన రాక్ స్టార్. పాట విని ఇండస్ట్రీ నుంచి కూడా చాలా కాల్స్ వచ్చాయి. అందరూ అభినందించారు. మళ్లీ నేను కంపోజ్ చేయటానికి సిద్ధంగా ఉన్నాను. ఇప్పుడున్న మ్యూజిక్ డైరెక్టర్స్ అందరూ చాలా అద్భుతంగా సంగీతం చేస్తు న్నారు. పాటలు ఫెంటాస్టిక్‌గా ఉన్నాయి. అయినా ఒక న్యూ కైండ్ ఆఫ్ మ్యూజిక్‌కి ఎక్కడో చిన్న గ్యాప్ ఉంది. ఆ గ్యాప్‌ని ఫిల్ చేయడానికి నేను రెడీగా ఉన్నాను. నా దగ్గర కొన్ని వినూత్నమైన ఐడియాలు ఉన్నాయి.

\- రమణ గోగుల

అతిగా ఆలోచిస్తే?



షణ్ముఖ్ జస్వంత్ లీడ్ రోల్‌లో నటించిన ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్ 'లీలా వినోదం'. పవన్ సుంకర దర్శకుడు.
అనగ అజిత్, గోపరాజు రమణ, ఆమని, రూపాలక్ష్మి తదితరులు కీలక పాత్రలు పోషించారు.
శ్రీ అక్కియన్ ఆర్ట్స్ బ్యానర్ పై శ్రీధర్ మారిసా నిర్మించారు. ఈటీవీ విన్‌లో ఈనెల 19 నుంచి ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్‌ని ఘనంగా నిర్వహించారు.
హీరో షణ్ముఖ్ జస్వంత్ మాట్లాడుతూ,'నేను కంటెంట్ చేసి వన్ అండ్ హాఫ్ ఇయర్ అవుతుంది. అయినప్పటికీ ఎంతగానో సపోర్ట్ చేస్తున్నారు. మీకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. నాకు కరెక్ట్ టైంలో 'లీలా వినోదం' వచ్చింది. భరత్, సాయికి థ్యాంక్స్. నన్ను నమ్మి అవకాశం ఇచ్చారు. ఈ సినిమా మీ అందరికీ చాలా చాలా నచ్చుతుంది. కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్నాం' అని అన్నారు. 'ఇదొక క్యూట్ లవ్ స్టోరీ. మేం ఇంట్రడ్యూస్ చేసిన 5వ డైరెక్టర్ పవన్. తను కూడా తప్పకుండా సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అవుతాడు' అని ఈటీవీ విన్ బిజినెస్ హెడ్ సాయికృష్ణ చెప్పారు.
ఈటీవీ విన్ కంటెంట్ హెడ్ నితిన్ చక్రవర్తి మాట్లాడుతూ,' పవన్ ఈ కథ చెప్పిన వెంటనే సింగల్ సిట్టింగ్‌లో ఓకే అయింది. అలా సింగల్ సిట్టింగ్‌లో ఓకే అయిన కథలు చాలా అరుదు. తను చాలా ఫెంటాస్టిక్ రైటర్, డైరెక్టర్. ఇండస్ట్రీలో తనకంటూ ఒక మార్క్ క్రియేట్ చేసుకుంటాడు' అని అన్నారు. డైరెక్టర్ పవన్ సుంకర మాట్లాడుతూ, 'నా అనుభవాలన్నీ కూడా ఇందులో చూస్తారు. ఉషా కిరణ్ మూవీస్‌లో డైరెక్టర్‌గా పరిచయం కావడం ఒక గొప్ప అదృష్టం. ఇందులో ఓవర్ థింకింగ్ అనే కాన్సెప్ట్‌ని చూపిస్తున్నాం. కచ్చితంగా ఆడియన్స్ సర్‌ప్రైజ్ ఫీల్ అవుతారు. అందరూ రిలేట్ అవుతారు. చాలా మంచి ఫీలింగ్ ఇచ్చేసి సినిమా ఇది' అని తెలిపారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886